నెపోలియన్
రూ॥ 180/-
పేజీలు: 190


నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సిఎంతో మాట్లాడి గుడిసెవాసులకు పట్టాలకు కృషి

చేనేత రంగానికి ప్రత్యేక స్థానం ఉంది

క్రిమినల్ గ్యాంగ్ నేరాలపై దృష్టి పెట్టండి

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 248 | శుక్రవారం | 8-08-2025 | కరీంనగర్ | Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## రైతు ప్రయోజనాలను పణంగా పెట్టబోం

ట్రంప్ సుంకాలపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందన



**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ దిగుమతులపై భారీగా సుంకాలు విధించడంపై ప్రధాని నరేంద్ర మోదీ పరోక్షంగా స్పందించారు. గతంలో ఉన్న 25 శాతం సుంకాలకు అదనంగా మరో 25 శాతం టారిఫ్‌ను విధిస్తూ ట్రంప్ బుధవారం ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేసిన విషయం తెలిసిందే. పెంచిన టారిఫ్‌లతో భారతీయ వస్త్ర పరిశ్రమ, ఆక్వా రంగం, తోలు ఉత్పత్తులపై తక్షణ ప్రభావం చూపనుంది. రొయ్యలు, జంతు సంబంధ ఉత్పత్తులపై అదనపు భారం పడింది. కాగా, ట్రంప్ సుంకాల మోతపై ప్రధాని మోదీ పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. రైతుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రైతు ప్రయోజనాలను పణంగా మెట్టబోమని వ్యాఖ్యానించారు. దివంగత వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఢిల్లీలో గురువారం ప్రారంభమైన మూడు రోజుల అంతర్జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన మోదీ మాట్లాడుతూ ట్రంప్ సుంకాల పెంపును పరోక్షంగా ప్రస్తావించారు. 'రైతుల సంక్షేమమే మాకు అత్యంత కీలకం. రైతులు, మత్స్యకారులు, పాడిరైతుల ప్రయోజనాలకు సంబంధించిన విషయాల్లో ఎన్నటికీ రాజీపడబోం' అన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు వ్యక్తిగతంగా ఎంతటి మూల్యాన్ని చెల్లించడానికైనా తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. అమెరికా సుంకాలు పెంచినా, రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని అన్నారు. రష్యా నుంచి తరువాయి 2లో


## గెలుపు చోరీ!

● బిజెపితో కలిసి ఓట్ల దొంగతనం చేసిన ఇసి : రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు
● ఒకే అసెంబ్లీ స్థానంలోనే లక్ష దొంగ ఓట్లు ● వాటితోనే బిజెపి గెలుపు
● ఆధారాలతో బైటపెట్టిన కాంగ్రెస్ అగ్రనేత ● ఆరు నెలల పాటు కర్నాటకలో మహాదేవపుర ఓట్ల పరిశీలన ● బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానంలో గెలుపు తారుమారును వివరించిన ప్రతిపక్ష నేత ● 25 చోట్ల మోదీ ఇలాగే గెలిచారని విమర్శ

**న్యూఢిల్లీ :** ఎన్నికల అవకతవకలపై ఆటంబాంబు పేల్చుతానన్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఆ పని చేశారు. ఢిల్లీలోని ఎఐసిసి ప్రధాన కార్యాలయం ఇందిరాభవన్‌లో ఎన్నికల చోరీపై ఓటరు జాబితా, తదితర ఆధారాలతో ఆయన గురువారం నాడు ప్రజెంటేషన్ ఇచ్చారు. బిజెపితో కలిసి ఎన్నికల సంఘం ఎన్నికలను దొంగలిస్తోందని, ఇది రాజ్యాంగానికి వ్యతిరేకంగా చేసిన నేరం అని ఆయన ఆరోపించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కర్ణాటకలోని బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గంలోని డేటాను విశ్లేషించినప్పుడు స్పష్టమైందన్నారు. ఆరు నెలలపాటు ఒక బృందాన్ని ఏర్పాటు చేసి ఓట్ల చోరీకి సంబంధించిన కచ్చితమైన ఆధారాలను సేకరించినట్లు ఆయన తెలిపారు. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గంతో పాటు మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్ ఓటర్ల డేటాను విశ్లేషించినట్లు ఆయన తెలిపారు. ఆ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీకి 6,26,208 ఓట్లు రాగా, బిజెపికి 6,58,915 ఓట్లు వచ్చాయని, రెండు పార్టీల మధ్య తేడా 32,707 ఓట్లు అని, అక్కడ ఒకే అసెంబ్లీ నియోజకవర్గంలో లక్షకు పైగా ఓట్ల చోరీ జరిగిందని ఆయన అన్నారు.

**ఐదు రకాలుగా ఓటు చోరీ**

కర్నాటక లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 16 స్థానాలు గెలుస్తుందని తమ అంతర్గత సర్వేలో తేలిందని, కానీ 9 చోట్ల మాత్రమే గెలిచామని, అందుకే ఓడిన ఏడు స్థానాలలో బెంగళూరు సెంట్రల్ నియోజవర్గంలో ఒక అసెంబ్లీ సెగ్మెంట్ ఓట్లను పరిశీలించామని రాహుల్‌గాంధీ తెలిపారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరు చోట్ల కాంగ్రెస్ ఆధిక్యం సాధించిందని, తరువాయి 2లో




### మహాదేవ్‌పురలో దొంగ ఓట్ల లీలలు...

మహాదేవ్‌పుర నియోజకవర్గంలో షకున్‌రాణి అనే మహిళ రెండు సార్లు ఓటేసింది. ఆమెకు రెండు ఓటరు ఫోటో ఐడి కార్డులు ఉన్నాయి. పేరులో చిన్న చిన్న మార్పులతో వేర్వేరు ఓటరు కార్డులను సృష్టించి, ఆమె రెండు బూత్‌లలో ఓట్లేయగా, రెండు లెక్కింపు జరిగాయి. ఇది ఓటు చోరీకి నిదర్శనం. అలాగే ఆదిత్య శ్రీవాత్సవ అనే వ్యక్తి మూడు రాష్ట్రాలలో ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్రలలో ఒక్కోసారి, కర్నాటకలో రెండు సార్లు ఓటు వేశారు. గురు కిరాత్‌సింగ్ అనే వ్యక్తి ఒకే నియోజకవర్గంలో 4 పోలింగ్ బూత్‌లలో నాలుగుసార్లు ఓటేశారు. అడ్రస్ లేని, లేదా ఇంటినెంబర్ : 0 ఉన్న ఓటర్లు 40మంది ఉన్నారు. వారు చెప్పిన ఇళ్ళకు వెళ్ళిన అక్కడ అలాంటి వారు లేరు. కానీ, వారంతా ఓట్లేశారు. ఫోటోలు లేకుండా లేదా గుర్తించలేనంత చిన్న ఫోటోలు ఉన్న ఓటర్లు 4వేలకు పైగా ఉన్నారు. ఇలా వేల సంఖ్యలో ఓట్లు నమోదయ్యాయి.

## 'సుంకాల' పెంపు.. భారత్ స్వయంప్రతిపత్తిపై దాడి

● తీవ్రంగా ఖండించిన సిపిఐ
● ప్రపంచ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికే అమెరికా బెదిరింపు వ్యూహాలు

**న్యూఢిల్లీ :** రష్యాతో చమురు వాణిజ్యానికి ప్రతీకారంగా భారతదేశంపై 50శాతం శిక్షాత్మక సుంకాల విధింపు ద్వారా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపు వ్యూహాలకు పాల్పడటాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు గురువారం నాడు ఒక ప్రకటన విడుదల చేసింది. వాణిజ్య సంబంధాలను అమెరికా ఇలా బహిరంగంగా దెబ్బతీయడం భారతదేశ స్వయం ప్రతిపత్తిపై దాడి చేయడమేనని సిపిఐ తరువాయి 2లో

## హైదరాబాద్‌లో క్లౌడ్ బరస్ట్

● కుంభవృష్టి బీభత్సం ● రోడ్లన్నీ జలమయం
● నగరమంతటా భారీ ట్రాఫిక్ జామ్ ● జనజీవనం అస్తవ్యస్తం

ప్రజాపక్షం/హైదరాబాద్

భాగ్యనగరంలో గురువారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. క్లౌడ్ బరస్ట్ తరహాలో ఒకేసారి కుంభవృష్టి సంభవించింది. నగరం మొత్తాన్ని సాయంత్రం 3 గంటల నుంచే నల్లటి మబ్బులు కమ్మేశాయి. దాదాపు గంట పాటు రికార్డు స్థాయిలో కురిసిన ఈ వర్షం నగరంలో బీభత్సం సృష్టించింది. కుండపోత వర్షం కారణంగా నగరంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఈ అకాల వర్షం కారణంగా నగర జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. పలు ప్రాంతాల్లో రోడ్లపైకి వర్షపు నీరు తరువాయి 2లో



### అధికారులు అప్రమత్తంగా ఉండాలి : సిఎం రేవంత్‌రెడ్డి

రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి వరకు భారీ వర్ష సూచన ఉన్నందున అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను అదేశించారు. హైదరాబాద్ నగర ప్రజలు తమ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని,అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దని సిఎం సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ,డిజిపి జితేందర్, జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్, హైడ్రా కమిషనర్ తరువాయి 2లో

## భారత విదేశాంగ విధానం ధ్వంసం


● ట్రంప్ సుంకాల విధింపుపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే విమర్శనాస్త్రాలు
● ఆ విపత్తును ఎలా ఎదుర్కోవాలనేది మోదీ ప్రభుత్వానికి తెలియదని ఎద్దేవా



**న్యూఢిల్లీ :** కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కారుపై గురువారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. భారతీయ వస్తువులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50శాతం సుంకాలు విధించడం 'ఇది ఒక విదేశీ విధానం విపత్తు' అని, ఆ విపత్తును ఎలా ఎదుర్కోవాలనేది మోదీ ప్రభుత్వానికి తెలియదని మల్లికార్జున్ ఖర్గే ఎద్దేవా చేశారు. రష్యా దేశ ం చమురును భారతదేశం కొనుగోలు చేసినందుకు ట్రంప్ మరొక 25 శాతం జరిమానా విధించిన ఒక రోజు తర్వాత ఖర్గే మాట్లాడుతూ మన దౌత్యం వినాశకరమైన రీతిలో దిగజారిపోతున్న సమయంలో ఈ నిర్ణయం వచ్చిందని ఖర్గే ఆరోపించారు. అనేక నెలలుగా చర్చలు జరుపుతున్నప్పటికీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమెరికాలో వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరపడంలో విఫలం అయ్యారని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పుడు ట్రంప్ మనలను 'బలవంతం చేయడమే కాకుండా బెదిరిస్తున్నారు' అని అన్నారు. 'ఎక్స్'లో చేసిన ఒక పోస్ట్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే 'భారతదేశ జాతీయప్రయోజనాలే అన్నింటికంటే గొప్పవి' అని పేర్కొన్నారు.'అలీనసిద్ధాంతంలో పొందుపరచబడిన మన కాల పరీక్షిత వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి విధానం కోసం భారతదేశాన్ని ఏకపక్షంగా శిక్షించే ఏ దేశమైనా భారతదేశం ఏ ఉక్కుచట్రంతో తయారు చేయబడిందో అర్థం చేసుకోలేని దేశమే' అని ఖర్గే అన్నారు.7వ నౌకాదళ బెదిరింపు నుండి తరువాయి 2లో

## నోటిఫికేషన్ విడుదల

ఉపరాష్ట్రపతి ఎన్నికకు నామినేషన్లు మొదలు




**న్యూఢిల్లీ:** భారత ఉపరాష్ట్రపతి ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ రాజీనామాతో చేయడంతో, ఈ ఎన్నిక అనివార్యమైంది. ఉపరాష్ట్రపతి ఎన్నికల నోఫిషికేష్‌లో నామినేషన్ల ప్రక్రియ తక్షణమే ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు. ఈనెల 21వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 22వ తేదీన నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. ఒకవేళ ఎవరైనా అభ్యర్థిత్వం ఉపసంహరించుకోవాలనుకుంటే, 25వ తేదీ వరకు గడువు ఉంటుంది. అవసరమైతే, సెప్టెంబర్ 9న ఎన్నిక జరుగుతుంది. అదేరోజు ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు. పార్లమెంటు సభ్యులు ఓటర్లుగా ఉంటారు. రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ తాత్కాలికంగా బాధ్యతలు నిర్వహిస్తారు. ఏక బదిలీ ఓటు పద్ధతిలో ఎన్నిక జరుగుతుంది. ఆరోగ్యం తరువాయి 2లో

## బిసి రిజర్వేషన్లపై పార్టీలో చర్చించి నిర్ణయం

● న్యూఢిల్లీలో మీడియా సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి
● బిజెపికి బిఆర్‌ఎస్ 'బి' టీమ్‌గా మారిందని విమర్శ

ప్రజాపక్షం/హైదరాబాద్



బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను ఇవ్వకుండా బిజెపి అడ్డుపడుతోందని,రిజర్వేషన్ల విషయంలో బిఆర్‌ఎస్ శిఖండి పాత్రను పోషిస్తూ, బిజెపికి బిటీమ్‌గా వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆరోపించారు. బిసి రిజర్వేషన్ల విషయంలో భవిష్యత్ కార్యాచరణపై పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ (కాంగ్రెస్ పార్టీ పిఎసి), ప్రభుత్వపరంగా చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. బిసి రిజర్వేషన్ల సాధనకు ఏ విధంగా ముందుకెళ్లాలి, చట్టపరంగా, న్యాయపరంగా ఎటువంటి ఒత్తిడి తీసుకురావాలి.?, ప్రజా క్షేత్రంలో తీసుకోవాల్సిన కార్యాచరణపైన ఒక నిర్ణయానికి వస్తామన్నారు. బిసిలపైన బిజెపికి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే ఆ పార్టీ నేతలు చెబుతున్నట్టుగానే వారు కోరుకునే విధివిధానాలతోనే ప్రస్తుత పార్లమెంట్ సమావేశంలోనే బిసిలకు రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెడితే చట్టం అవుతుందని, తద్వారా అన్ని రాష్ట్రాలలో అమలు చేసేందుకు అవకాశం ఉంటుంది కదా? అని అన్నారు. న్యూఢిల్లీలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కొండాసురేఖ, అడ్లూరి లక్ష్మణ్, జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్, ఎంపిలతోకలిసి సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును అమోదించొద్దని బిజెపి, తెలంగాణ రాష్ట్రంలో 50 శాతం మించి రిజర్వేషన్లను తరువాయి 2లో

## రిటైర్డ్ అయ్యాక ఐపిఎస్ హోదానా?

● ప్రభాకర్‌రావుకు మళ్ళీ అదే హోదా కల్పించే అధికారం రాష్ట్రానికి లేదంటున్న ఐపిఎస్ వర్గాలు
● ఆ జీఓ ఇవ్వడం నేరమే..! ● ఆయన నియామకం సిఫార్సులపై సంతకం పెట్టిన అప్పటి సిఎం
● కెసిఆర్‌పై కేసు నమోదు చేసేందుకు సిట్ అధికారుల కసరత్తు!


(బి.వాసుదేవరాజు)




దేశ వ్యాప్తంగా సంచలనం కలిగించిన తెలంగాణలో 'ఫోన్ ట్యాపింగ్ కేసు'లో రోజుకో కొత్త విషయం బయటపడుతున్నది. తాజాగా ఎస్‌ఐబి ఐజిగా పదవీ విరమణ చేసిన ఐపిఎస్ అధికారి టి.ప్రభాకరరావును, తిరిగి అదే పోస్టులో (క్యాడర్ పోస్టులో) నియమించడం సరైంది కాదనే విషయం వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి నాటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు నేరపూరితమైనవని ఐపిఎస్ వర్గాలు, న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి ఉత్తర్వులు జారీచేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని ఆ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్ర సిబ్బంది వ్యవహారాలు, శిక్షణ విభాగం (డిఓపిటి) నిబంధనల ప్రకారం ఔట్ సోర్సింగ్, రీ రిక్రూట్‌మెంట్ కింద నాన్‌–క్యాడర్ పోస్టులో సలహాదారులుగా, చైర్మన్‌లుగా, ఆన్ స్పెషల్ డ్యూటీ (ఒఎస్‌డి) లుగా నియమించుకునే అధికారం మాత్రమే రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంది. అయితే, పదవీ విరమణ పొందిన ఐపిఎస్ అధికారిని, అదే క్యాడర్‌లో, హోదాలో తిరిగి నియమించేందుకు రాష్ట్రానికి స్వతంత్ర అధికారం లేదు. కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ఆల్ ఇండియా సర్వీస్ రూల్స్ ప్రకారం ఐజి పోస్టు అనేది ఐపిఎస్ హోదాలోని క్యాడర్ పోస్టు. వీటి నియామకాలకు తరువాయి 12లో

## జన నేతకు ఘన వీడ్కోలు

● కదిలిన పల్లెలు, బరువువెక్కిన గుండెలు
● అశ్రునయనాల మధ్య సిపిఐ నేత అయోధ్య అంతిమయాత్ర
● కదిలొచ్చిన జనం, కన్నీరుపెట్టిన నేతలు
● జనసంద్రమైన రామానుజవరం





ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

కమ్యూనిస్టు పోరాట యోధుడు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్యకు అంతిమ వీడ్కోలు గురువారం అశృనయనాల నడుమ సాగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, కలవేన శంకర్‌లు అయోధ్య భౌతికకాయంపై ఎర్రజెండాను కప్పి, పూల మాలలు వేసి జోహార్లు అర్పించారు. సూర్యాపేటలో బుధవారం వేకువ జామున ప్రమాదానికి గురై తుదిశ్వాస విడిచిన ఆయనను ముందుగా ఖమ్మం జిల్లా సిపిఐ కార్యాలయానికి, ఆతర్వాత కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యాలయానికి, తరువాయి 12లో



## సినీరంగ కార్మికులకు వేతనాలు పెంచాల్సిందే

సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సినీమా రంగ కార్మికులకు వేతనాలు పెంచాల్సిందేనని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్. కె.నారాయణ డిమాండ్ చేశారు. పెద్ద బడ్జెట్ సినిమాలకు 30 శాతం, చిన్న చిత్రాలకు 15 శాతం వేతనాలు పెంచాల్సిందేనని స్పష్టం చేశారు. వారికి న్యాయం జరిగేవరకు సిపిఐ పూర్తిగా అండగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తక్షణమే జోక్యం చేసుకుని సినిమా కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టి.నరసింహ్మాతో కలిసి నారాయణ మీడియాతో తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## 76 ఏళ్ళ ఫ్రాన్స్ చరిత్రలో అతిపెద్ద కార్చిచ్చు

### హెలికాప్టర్లతో వాటర్ బాంబింగ్

**పారిస్:** దక్షిణఫ్రాన్స్‌లో గడచిన 76 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంత ఉద్ధృత స్థాయిలో కార్చిచ్చు వ్యాపించింది. దాదాపు పారిస్ నగరానికంటే చాలా ఎక్కువ విస్తీర్ణంగల ప్రాంతంలో కార్చిచ్చు మంటలు వ్యాపించి తీవ్ర నష్టం కలిగించాయి. అనేక ఇళ్ళు దగ్ధమయ్యాయి. ఎంతోమంది నిరాశ్రయుల య్యారు. ఇప్పటికే ఒక మహిళ సజీవదహనం కాగా మరో ముగ్గురు జాడ తెలియడంలేదు. ఇప్పటివరకూ 62 చదరపు మైళ్ళ విస్తీర్ణం (16000 చదరపు హెక్టార్లు)లో కార్చిర్చు వ్యాపించింది. 2000 మంది అగ్నిమాపకదళ సిబ్బంది, మరో 500 అగ్నిమాపకదళ వాహనాలు మంటలను అదుపుచేసే కార్యక్రమంలో నిమగ్నమయ్యాయి.

హెలికాప్టర్ల ద్వారా వాటర్ బాంబింగ్ చర్యలు చేపట్టారు.గవాతావరణ మార్పులకు, ఈ కార్చిచ్చుకు చాలా దగ్గర సంబంధం ఉందని పర్యావరణ వేత్తలు హెచ్చరించారు.

## కాల్పుల విరమణపై 'ఏసియన్' పర్యవేక్షణ..

# థాయ్—కాంబోడియా అంగీకారం




**కౌలాలంపూర్:** ఇటీవల సరిహద్దు ఘర్షణలకు దిగిన థాయ్‌లాండ్—కాంబోడియా దేశాలు ''ఏసియన్'' గ్రూపు (ఆగ్నేయ ఆసియా దేశాల సంఘం) దేశాల ను కాల్పుల విరమణ పర్యవేక్షణకు అనుమతించేందుకు అంగీకరించాయి. మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో రక్షణ అధికారులు మూడురోజులు జరిపిన చర్చలు గురువారం ఒక సం యుక్త ప్రకటనతో ముగిశాయి. చర్చల సందర్భంగా థాయ్—కాంబోడియా దేశాల రక్షణ అధికారులు ఈ ''ఏసియన్'' గ్రూపు దేశాల పర్యవేక్షణకు అంగీకారం తెలియజేశా యి. అంతర్జాతీయ మానవతావాద చట్టానికి కట్టుబడి ఉండేందుకు అంగీకరించాయి. ఈ అంగీకారం మేరకు పరస్పరం రెండు దేశాలవద్దా ఉన్న సైనికులపట్ల మానతాదృక్పథంతో వ్యవహరించాల్సి ఉంటుంది. రెండు దేశాలూ తమ వద్ద బందీలుగా ఉన్న సైనికులను ఇచ్చిపుచ్చుకోవాల్సి ఉంటుంది. ఆగస్టు నాలుగో తేదీనాటి గణాంకాల ప్రకారం రాయల్ థాయ్‌లాండ్ ఆర్మీ వద్ద 18 మంది కాంబోడియా దేశ సైనికులు బందీలుగా ఉన్నారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు కాంబోడియా సైనికులను ఆగస్టు ఒకటో తేదీన థాయలాండ్ దేశం వారికి స్వాధీనం చేసింది. ఐతే ఎంతమంది థాయ్‌లాండ్ సైనికులు కాంబోడియావద్ద బందీలుగా ఉన్నరన్న విషయం ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. ఐతే థాయ్‌లాండ్, కాంబోడియా రెండు దేశాలు 'ఏసియన్' దేశాలకు చెందిన పర్యవేక్షక బృందాలను తమ తమ సరిహద్దుల్లో పర్యటనకు అనుమతిస్తాయి. ఈ రెండు దేశాలమధ్యా దాదాపు 1200 కి.మీ నిడివిగల సరిహద్దులు ఉన్నాయి. మీరంటే మీరే కాల్పులు మొదట ప్రారంభించి కయ్యానికి కాలు దువ్వారని ఈ రెండు దేశాలు పరస్పరం ఆరోపించుకుంటున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని కూడా మీరంటే మీరే ఉల్లంఘించాయని కూడా జులై 28 తర్వాత ఘర్షణ పడ్డాయి. ఈ పరిస్థితుల్లో 'ఏసియన్' దేశాల బృందాలు పర్యవేక్షకులుగా ఉండేందుకు థాయ్ — కాంబోడియాలు అంగీకరించాయి. ఈ రెండూ 'ఏసియన్' లో సభ్యదేశాలే. జులై 25 వ తేదీన ఈ రెండు దేశాలమధ్య సరిహద్దు ఘర్షణలు ప్రారంభమయ్యాయి. ఘర్షణల్లో రెండు దేశాల కు చెందిన 38 మంది సైనికులు, సరిహద్దుగ్రామాల ప్రజలు మరణించారు. ఈ కారణంగా రెండు వైపులా దాదాపు 3,00,000 మంది ప్రజ లు సరిహద్దు గ్రామాలు ఖాళీచేసి ఇతర ప్రాంతాలకు వెళ్ళిపోయారు. మలేసియా మధ్యవర్తిత్వం తో ఆ దేశ రాజధానిలో జులై 29 అర్ధరాత్రి నుండి కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చింది. డోనాల్డ్ ట్రంప్ చొరవతో రెండు దేశాలమధ్యా మలేసియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం ఈ ఒప్పందం చేసినప్పటికీ మళ్ళీ కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనలు జరిగాయి. తర్వాత షాంఘై వేదికగా చైనా కూడా రెండు దేశాలమధ్య రాజీ కుదిర్చింది.

# 90 దేశాల్లో ట్రంప్ టారిఫ్‌లు అమలు

## అమెరికాకు లక్షలడాలర్లు వరద ప్రవాహం




**వాషింగ్టన్:** డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాల ప్రకారం దాదాపు 90 దేశాలలో ఆగస్టు ఏడో తేదీ నుండీ (గురువారం) కొత్త టారిఫ్‌లు అమలులోకి వచ్చాయి. ఈ కొత్త టారిఫ్‌లతో అమెరికా ఆర్థికవ్యవస్థ వేగం పుంజుకునే అవకాశాలు ఉంటాయని ట్రంప్ అంచనావేస్తున్నారు. దిగుమతులపై కొత్త సుంకాలవల్ల లక్షల డాలర్లు వరద ప్రవాహంలా దేశంలోకి వస్తున్నాయని ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. అమెరికా ఆర్థిక గణాంకాల ప్రకారం ఈ జూన్‌నెలలో దిగుమతులపై విధించిన కొత్త సుంకాలద్వారా 28 బిలియన్ డాలర్లు ఆదాయం లభించింది. గత ఏడాది జూన్‌తో పోలిస్తే మూడురెట్లు ఆదాయం పెరిగింది. యాలే యూనివర్సిటీ అధ్యయనం ప్రకారం గతనెల 28 నాటి లెక్కల ప్రకారం 1934 తర్వాత వివిధ దేశాలపై అమెరికా సగటున విధించిన సుంకాలు 18.2 శాతానికి పెరిగాయి.

ఇప్పటికే త్రైమాసిక ఫలితాల్లో ఆర్థికంగా పురోగతి సాధించామని ట్రంప్ ప్రభుత్వం చెప్పుకుంటున్నది. టారిఫ్‌లలో అసమానతలు తగ్గించడం ద్వారా అమెరికా ఆదాయం పెరుగుదలకు తమ ప్రభుత్వం దోహదం చేసిందని రిపబ్లికన్లతో ఇటీవల జరిగిన విందు కార్యక్రమంలో ట్రంప్ చెప్పారు. దేశంలోకి వరద ప్రవాహంలా వస్తున్న లక్షల డాలర్లను ఉద్యోగాలసృష్టికి, దేశం వెలుపల ఉన్న పరిశ్రమలకు తిరిగి అమెకాకు తీసుకువచ్చేందుకు ఉపయోగిస్తానని, 'మాగా' (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) ప్రణాళికలో భాగంగా దేశానికి పూర్వవైభవం తీసుకువస్తామని ట్రంప్ విశ్వాసం వ్యక్తం చేశారు. అమెరికాలో మరిన్ని టెక్ కంపెనీలు చిప్ కంపెనీలలో పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా అనేక బెదిరింపులు చేశారు. విదేశాలలో తయారై అమెరికాలోకి వచ్చే చిప్‌లపై 100 శాతం టారిఫ్‌లు విధిస్తామని హెచ్చరించారు. భారత్‌పై కూడా 50 శాతం సుంకాలు విధించి బెదిరించారు. ఐతే ఒక్కొక్కదేశంపై ఒక్కొక్కరమైన సుంకాలను ట్రంప్ అమలు చేశారు. అనేక దేశాలు అమెరికాను దోచుకుంటున్నాయని, ఆ దేశాలతో అమెరికాకు మాత్రం విపరీతంగా వాణిజ్యలోటు ఉంటోందనీ, సమానస్థాయి సుంకాలు ఎక్కడా అమలులో లేవని, అందువల్ల సుంకాలను పెంచుతామని ఈ ఏడాది ఏప్రిల్ రెండో తేదీన ట్రంప్ ప్రకటన చేశారు. ఆ రోజును ఆయన లిబరేషన్ డే గా ప్రకటించారు. ఇక అప్పటినుండీ అనేక దేశాలతో వివిధస్థాయిల్లో ఒప్పందాలు జరిగాయి. ఈ ఒప్పందాలలో బ్రెజిల్, భారత్ రెండు దేశాలపైన చాలా అత్యధికమైన సుంకాలను విధించారు.

అమెరికాకు మద్దతు ఇచ్చే కీలక దేశాలపై తక్కువ టారిఫ్‌లు విధించారు. యూరోపియన్ యూనియన్‌పై 15 శాతం టారిఫ్ వేశారు. పాకిస్థాన్‌పై 19 శాతం వేశారు. బ్రిటన్, జపాన్, దక్షిణ కొరియాలపై గతంలో బెదిరించినట్లు కాకుండా చాలా తక్కువ టారిఫ్‌లు వేశారు. స్విట్జర్లాండ్‌పై 39 శాతం, కెనడాపై 35 శాతం అత్యధిక సుంకాలు విధించారు.

## క్లౌడ్ బరస్ట్ (మొదటి పేజీ తరువాయి)

చేరడంతో ట్రాఫిక్ స్తంభించింది. కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లే సమయంలో వర్షం పడటంతో ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు. హైదరాబాద్‌కి వాతావరణ కేంద్రం అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. భారీ వర్షం నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డిజిపి, విపత్తుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జిహెచ్‌ఎంసి కమిషనర్, హైడ్రా కమిషనర్, విద్యుత్ విభాగం అధికారులు, హైదరాబాద్, రంగా రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వాతావరణ కేంద్రం అంచనాల ప్రకారం, ఈ వర్షం అర్ధరాత్రి వరకు కొనసాగే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

**తడిసిముద్దమైన భాగ్యనగరం..**

ఈ భారీ వర్షానికి భాగ్యనగరం తడిసిముద్దైంది. పలు బస్తీలు, కాలనీలు, రహదారులు చెరువులను తలపించాయి. రోడ్లపైకి భారీగా వరద నీరు చేరడంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచి పోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది లు ఎదుర్కొన్నారు. పలు ప్రాంతాల్లో మోకాళ్ల లోతు నీళ్లు నిలిచిపోయాయి. వర్షాల కారణంగా పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పంజాగుట్ట నుంచి గచ్చిబౌలి వరకు జూబ్లీహిల్స్ మీదుగా, ఖైరతాబాద్ నుంచి బేగంపేట్ వరకు, మెహిదీపట్నం నుంచి గచ్చిబౌలి వరకు, గచ్చిబౌలి నుంచి కొండాపూర్ వరకు, మలక్‌పేట్ నుంచి హయత్‌నగర్ వరకు, బషీర్‌బాగ్ నుంచి కోఠి మీదుగా మలక్‌పేట్ వరకు, ట్యాంక్ బండ్ నుంచి ఎస్‌పి రోడ్, ఆర్‌పి రోడ్ వరకు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి పోయాయి. కూకట్‌పల్లి, మియాపూర్, శేరిలింగం పల్లి, హైటెక్ సిటీ, మాదాపూర్, కుత్బుల్లాపూర్, నిజాంపేట్, మల్కాజ్‌గిరి, ఖైరతాబాద్, హిమా యత్ నగర్, సికింద్రాబాద్, నాంపల్లి, చార్మినార్, ఎల్.బి.నగర్, రాజేంద్రనగర్, ఐకియా, బయో డైవర్సిటీ, కొండాపూర్ జంక్షన్లలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఖైరతాబాద్ రాజ్‌భవన్ రహదారి నీట మునిగింది. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు తిప్పలు పడ్డారు. సంతోష్ నగర్, చాంద్రాయణ గుట్ట, కాంచన్ బాగ్, షాలిబండ, ఛత్రినాక, సికింద్రాబాద్, కంటోన్మెంట్ వంటి లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. వాహనదారులు రోడ్ల పక్కన నిలిచిపోయారు. పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, హైటెక్ సిటీ, ఐకియా వంటి రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ తీవ్రంగా స్తంభించింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. వర్షం కారణంగా తలెత్తిన పరిస్థితులను ఎదుర్కొనేం దుకు జిహెచ్ఎంసి, హైడ్రా, ఎస్‌డి ఆర్‌ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి, సహాయక చర్యలు చేపట్టాయి. రోడ్లపై నిలిచిన నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు.

## స్వయంప్రతిపత్తిపై దాడి (మొదటి పేజీ తరువాయి)

ఆక్షేపించింది. యునైటెడ్ స్టేట్స్ నేతృత్వంలోని ప్రపంచ ఆదేశాన్ని అమలు చేయడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ఒక క్రూరమైన ప్రయత్నం అని సిపిఐ మండిపడింది. ఇటువంటి చర్యలు స్వతంత్ర దేశాలను లొంగదీసుకోవడానికి, సార్వభౌమ విదేశీ, ఆర్థిక విధానాలను అనుసరించే హక్కును దెబ్బతీయడానికి ఉద్దేశించబడినవని అభిప్రాయపడింది. ప్రపంచ విధాన రూపకల్పన ఏ ఒక్క దేశ నాయకత్వం ముఖ్యంగా డొనాల్డ్ ట్రంప్ వంటి అస్థిర, శత్రు నాయకత్వం ఇష్టాలకు లొంగి ఉండటానికి అనుమతించకూడదని పేర్కొంది. బహుళ ధ్రువణతకు సంబంధించి తిరుగులేని పెరుగుదల, అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థల అధికమవుతోన్న విశ్వాసం గురించి యునైటెడ్ స్టేట్స్ విధాన వర్గాలలో నెలకొన్న లోతైన అసంతృప్తిని ఇటీవల పరిణామాలు ప్రతిబింబిస్తున్నాయని సిపిఐ ఆందోళనవ్యక్తం చేసింది. ఈ వాస్తవాన్ని అంగీకరించని యునైటెడ్ స్టేట్స్ తన ప్రపంచ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి బెదిరింపులు, వాణిజ్య దురాక్రమణలను కొనసాగిస్తోందని ఆరోపించింది. ఈ విపత్కర పరిస్థితులలో భారతదేశం తన వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని దృఢంగా నొక్కిచెప్పాలని, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలతో సహకారాన్ని పెంచుకోవాలని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం సూచించింది. ప్రజాస్వామ్య, బహుళ ధృ వ ప్రపంచ క్రమాన్ని నిర్మించడంలో భారత్ చురుకైన పాత్ర పోషించాలని కోరింది.

## నోటిఫికేషన్ విడుదల
(మొదటి పేజీ తరువాయి)

సహకరించడం లేదన్న కారణంగా ధన్కడ్ జులై 21వ తేదీన పదవి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. వాస్తవానికి ఆయన పదవీకాలం 2027 ఆగస్టు వరకు ఉంది. కానీ, ఆయన రాజీనామా చేయడంతో, రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఈ పదవికి వెంటనే ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఈ నిబంధనలకు అనుగుణంగానే ఎన్నికల సంఘం ఎన్నిక ప్రక్రియను వేగవంతం చేసింది. ఈ ఎన్నికల నిర్వహణ బాధ్యతను రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు రిటర్నింగ్ అధికారిగా అప్పగించారు. ఆయనకు సహాయంగా మరో ఇద్దరు అధికారులు నియమితులయ్యారు. ఈ ఎన్నికలో ఓటు వేసే అధికారం పార్లమెంటులోని లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు మాత్రమే ఉంటుంది. అయితే రాష్ట్రపతి ఎన్నికలా కాకుండా ఉపరాష్ట్రపతి ఎన్నికలో రాజ్యసభకు నామినేట్ అయిన సభ్యులు కూడా ఓటు వేయడానికి అర్హులు. ప్రస్తుతం రాజ్యసభలో మొత్తం 233 మంది ఎన్నికైన సభ్యులు, 12 మంది నామినేటెడ్ సభ్యులు ఉన్నారు. లోక్‌సభలో 543 మంది సభ్యులు ఉన్నారు. దీని ప్రకారం మొత్తం ఓటర్ల సంఖ్య 788. అయితే రాజ్యసభలో ఐదు స్థానాలు, లోక్‌సభలో ఒక స్థానం ఖాళీగా ఉండటంతో ఈ ఎన్నికలో 782 మంది సభ్యులు ఓటు వేయనున్నారు. ఎన్నికల్లో గెలవాలంటే అభ్యర్థికి 392 ఓట్లు అవసరం.

## విధానం ధ్వంసం
(మొదటి పేజీ తరువాయి)

అణుపరీక్షల ఆంక్షల వరకు మేం అమెరికాతో మా సంబంధాన్ని ఆత్మగౌరవంతో నడిపించాం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50శాతం సుంకాలు మన సొంత దౌత్యం వినాశకరంగా దిగజారిపోతున్న తరుణంలో వచ్చింది అని ఆయన ఆరోపించారు. 'నరేంద్రమోదీజీ ట్రంప్ కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించారని చెప్పినప్పుడు మీరు మౌనంగా ఉన్నారు. ఆయన కనీసం 30సార్లు చెప్పారు. లెక్కిస్తున్నారు. 2024 నవంబర్ **30**న బ్రిక్స్ దేశాలపై 100 శాతం సుంకాలను విధించనున్నట్లు బెదిరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అక్కడే కూర్చుని నవ్వుతున్నారు.

అదే సమయంలో 'బ్రిక్స్' చచ్చిపోయిందని ట్రంప్ ప్రకటించారు' అని ఖర్గే ఆరోపించారు. ట్రంప్ నెలల తరబడి 'పరస్పర సుంకాలను' ప్లాన్ చేస్తున్నారని రాజ్యసభలో ప్రతిపక్షనేత అయిన మల్లికార్జున్ ఖర్గే చెప్పారు. 'మనందరికీ దాని గురించి తెలుసు. వ్యవసాయం, ఎంఎస్‌ఎంఇ'లు, పలు పరిశ్రమలు, మన కీలకరంగాలను దెబ్బతీయడంపై మీరు కేంద్ర బడ్జెట్‌లో ఏమీ చేయలేదు. మీ మంత్రులు నెలలతరబడి అమెరికాలో వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరపాలని మాట్లాడుతూ ఉన్నారు. వారిలో కొందరు వాషింగ్టన్‌లో కొద్దిరోజులుగా మకాం వేశారు' అని ఆయన చెప్పారు. మీరు అమెరికాతో వాణిజ్య చర్చలు జరిపేందుకు విఫలమయ్యారని ఖర్గే ధ్వజమెత్తారు. 'మీకు ఆరు నెలలకు పైగా సమయం ఉంది. ఇప్పుడు మిస్టర్ ట్రంప్ మమ్మల్ని బలవంతం చేస్తున్నారు. భయపెడుతున్నారని అంటున్నారు కానీ మౌనంగానే ఉంటున్నారు' అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే మండిపడ్డారు. 'అమెరికాకు భారతదేశం ఎగుమతులు దాదాపు రూ. లక్ష కోట్లు (2024 సంవత్సరం)' అని పేర్కొంటూ 50 శాతం సుంకం అంటే రూ.3.75లక్షల కోట్ల ఆర్థిక భారం పడుతున్నదని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తెలిపారు.

**ఇది దౌత్య వైఫల్యం : టిఎంసి జాతీయ ప్రధానకార్యదర్శి అభిషేక్‌బెనర్జీ ధ్వజం**

భారతదేశ వస్తువులపై అమెరికా50శాతం సుంకం విధించడంపై తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) జాతీయ ప్రధానకార్యదర్శి అభిషేక్ బెనర్జీ గురువారం కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. బిజెపి నేతృత్వంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ఆర్థికవ్యవస్థను ప్రమాదంలోకి నెట్టివేస్తున్నదని ఆయన మండిపడ్డారు. టిఎంసి జాతీయ ప్రధానకార్యదర్శి అభిషేక్ బెనర్జీ బిజెపిపై విమర్శలు గుప్పిస్తూ రాజకీయ నిందలు వేసే బదులు భారత్‌పై ఇంత ఎక్కువ సుంకాలను ఎందుకు విధించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

బెనర్జీ మాట్లాడుతూ 56అంగుళాల ఛాతీ అని గొప్పలు చెప్పుకున్న బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై ఇప్పుడు ఇతర దేశాలు ఎర్రటి కళ్లు చూపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. 'నేను ఒక ప్రతినిధి బృందంలో భాగంగా 5 దేశాలకు వెళ్లాను. కానీ 11దేశాలు కూడా పహల్గామ్ ఉగ్రదాడిని ఖండించిన పాపాన పోలేదు' అని విమర్శించారు. 'భారత ఆర్థికవ్యవస్థ చనిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే నేను ట్రంప్ ప్రకటనతో ఏకీభవించను. కానీ, భారత ఆర్థికవ్యవస్థ చెడ్డ స్థితిలో ఉందని మాత్రమే నేను చెబుతాను' అని అభిషేక్ బెనర్జీ అన్నారు.

## గెలుపు చోరీ! (మొదటి పేజీ తరువాయి)

మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో మాత్రం 1.14 లక్షల ఓట్ల తేడాతో వెనుకబడిందని చెప్పారు. ఆ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఐదు రకాలుగా ఓట్ల చోరీ జరిగిందన్నారు. అవి డూప్లికేట్ (నకిలీ) ఓటర్లు, తప్పుడు చిరునామా ఓటర్లు, ఒకే చిరునామాపై పెద్ద సంఖ్యలో ఓటర్లు, సరైన ఫోటో లేని ఓటర్లు, ఫామ్ 6 దుర్వినియోగంతో కొత్త ఓటర్లు అని వివరించారు. వాటిలో 11,965 నకిలీ ఓటర్లు , తప్పుడు, చెల్లని చిరునామాలతో(ఇంటి నెంబర్:0 అని ఉంది, తండ్రి పేరు కూడా లేదు) 40,009 మంది ఓటర్లు, ఒకే చిరునామాపై 10,452 మంది ఓటర్లు, కనీకనిపించని ఫోటోలతో 4,132 మంది ఓటర్లు, కొత్త ఓటర్లకు సంబంధించిన ఫారం—6ను దుర్వినియోగం చేసి నమోదైన 33,692 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు.ఇవన్నీ కలిపి ఆ నియోజకవర్గంలో 1,00,250 ఓట్ల చోరీ జరిగిందని ఆయన ఆరోపించారు. ఆ ఒక్క నియోజకవర్గంలో కాంగ్రెస్ 1.14 లక్షల ఓట్లుతో వెనుబడిందని, 1.02 ఓట్లు సృష్టించి బిజెపి ఆధిక్యత సాధించిందని, దాంతో ఎన్నికల చోరీ జరిగిందన్నారు. మహారాష్ట్రలో ఎన్నికల్లో జనాభా కంటే ఎక్కువ మంది ఓటర్లు పెరిగారని తాము ముందే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసామని, అయినా పట్టించుకోలేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన తమ కూటమి ఆరు నెలల్లోనే ఓడిపోవడం ఆశ్చర్యం కలిగించిందని, అందుకే ఆరు నెలల పాటు మహాదేవపు ఓట్ల పరిశోధన జరిపామన్నారు. ఇది తాను సొంతంగా చెబుతున్నది కాదని, ఎన్నికల సంఘం ఇచ్చిన డేటా ఆధారంగానే చెబుతున్నట్లు తెలిపారు. ఒకే అసెంబ్లీ నియోజకవర్గంలో లక్ష ఓట్లు చోరీ జరిగిందన్నారు. ఇదే విధంగా మిగతా లోక్‌సభ స్థానాల్లో చేస్తే వాస్తవాలు తెలుస్తాయని, ఇది పక్కా క్రిమినల్ ఎవిడెన్స్ అని చెప్పారు.

**25 సీట్లు దొంగలించారు**

దేశవ్యాప్తంగా ఇదే జరుగుతోందని, ఇది భారత రాజ్యాంగం, భారత జెండాకు వ్యతిరేకంగా చేసిన నేరం అని రాహుల్‌గాంధీ విమర్శించారు. ఎన్నికలను రక్షించే బాధ్యత ఎన్నికల సంఘానిదని కాంగ్రెస్ గుర్తు చేస్తుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి స్వల్ప మెజారిటీ ఉందని, అధికారంలో ఉండటానికి కేవలం 25 సీట్లు మాత్రమే దొంగిలించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.లోక్‌సభ ఎన్నికల్లో 33,000 కంటే తక్కువ ఓట్లతో బిజెపి 25 సీట్లు గెలిచిందని గాంధీ తెలిపారు.మన రాజ్యాంగం పునాది 'ఒక వ్యక్తికి ఒక ఓటు' అనే విషయం మీద ఆధారపడి ఉందని ఆయన అన్నారు. మనం ఎన్నికలను పరిశీలించినప్పుడు, 'ఒక వ్యక్తికి ఒక ఓటు' అనే ఆలోచనను ఎలా సురక్షితం చేయాలి అనేది ప్రాథమిక విషయమని, సరైన వ్యక్తులను ఓటు వేయడానికి అనుమతిస్తున్నారా? నకిలీ వ్యక్తులను చేరుస్తున్నారా? ఓటరు జాబితా నిజమేనా కాదా? అని ఆయన ప్రశ్నించారు.

**ఆధారాలను నాశనం చేయాలని చూస్తున్న ఇసి**

గత 10—15 సంవత్సరాలకు సంబంధించిన యంత్రాలు చదవగలిగిన సమాచారం, సిసిటివి ఫుటేజీలను ఎన్నికల సంఘం తమకు ఇవ్వకపోతే, ఇసి ఈ నేరంలో భాగస్వామి అవుతుందని రాహుల్ హెచ్చరించారు. సిసి ఫుటేజిని 45 రోజుల్లో నాశనం చేస్తున్నారని తెలిపారు. మనకు ఎంతగానో ఇష్టమైన ప్రజాస్వామ్యం ఇప్పుడు లేనందున న్యాయవ్యవస్థ ఇందులో జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కొంతకాలంగా ప్రజల్లో అనుమానం ఉంది. ప్రభుత్వ వ్యతిరేకత ప్రతి పార్టీని ప్రభావితం చేస్తుంది, కానీ ప్రజాస్వామ్య విధానంలో ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కోని ఏకైక పార్టీ బిజెపి అని ఆయన ఎద్దేవా చేశారు. పోల్స్, అంతర్గత సర్వేలు ఒక మాదిరిగా, ఫలితాలు మరో మాదిరిగా ఉన్నాయని ఆయన అన్నారు. గతంలో తక్కువ సాంకేతిక పరిజ్ఞానంతో దేశంలో ఎన్నికలు ఒకేసారి నిర్వహించేవారని, కానీ ఈ రోజుల్లో ఎన్నికలు నెలల తరబడి సాగేలా చేయబడుతున్నాయని గాంధీ ఆరోపించారు. దేశం మొత్తం 'ఓట్ల చోరీకి' సంబంధించిన సాక్ష్యాలను ఎన్నికల సంఘం నాశనం చేయాలని చూస్తోందని ఆయన ఆరోపించారు.

## అప్రమత్తంగా ఉండాలి (మొదటి పేజీ తరువాయి)

రంగనాథ్‌తోపాటు విద్యుత్ ఉన్నతాధికారులతో సిఎం రేవంత్ రెడ్డి గురువారం ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు క్షేత్రస్థాయి పరిస్థితినిసిఎంకు వివరించారు. విపత్తు నిర్వహణ బృందాలను సంసిద్ధంగా ఉంచాలని సూచించారు. రానున్న రెండు రోజుల పాటు వర్షాలు ఉంటాయనే సమాచారం ఉన్నందున కలెక్టర్లు జిల్లాల్లోని అన్ని విభాగాలతో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని జిల్లా కలెక్టర్లను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. జిహెచ్‌ఎంసితో పాటు పోలీస్, ట్రాఫిక్, హైడ్రా విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, విద్యుత్ అంతరాయం రాకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని, వర్షాలు, వరదలతో ఎటువంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కనేందుకు, ఎలాంటి సహాయమైనా అందించేందుకు అధికారులు అందుబాటులో ఉండాలని సిఎం స్పష్టం చేశారు.

## పణంగా పెట్టబోం (మొదటి పేజీ తరువాయి)

చమురు కొనుగోలు చేస్తున్నందుకు, వ్యవసాయ ఉత్పత్తులపై రాయితీలు ఇవ్వనందుకు భారత్‌పై అమెరికా సుంకాలు విపరీతంగా పెంచడం తెలిసిందే. ఇప్పటికే 25 శాతం టారిఫ్ సహా పెనాల్టీలు విధించిన అగ్ర రాజ్యం, బుధవారం మరోసారి 25 శాతం సుంకాలను పెంచడంతో మొత్తం సుంకాల భారం 50 శాతానికి చేరింది. ఇప్పటి వరకూ అమెరికా విధిస్తున్న సుంకాలపై మౌనంగా ఉన్న ప్రధాని, నేరుగా కాకపోయినా, తొలిసారి స్పందించారు. దేశ ప్రయోజనాల విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని వ్యాఖ్యానించారు. ఇలావుంటే, భారత్—అమెరికా మధ్య ఐదు రౌండ్ల వాణిజ్య చర్చలు విఫలమైన తర్వాత టారిఫ్ పెంపుదలపై ట్రంప్ ప్రకటనలు చేశారు.

అమెరికా తన వ్యవసాయ ఉత్పత్తులు, జన్యుపరంగా మార్పు చేసిన పంటలు వంటి వివిధ వస్తువులపై సుంకాల రాయితీలు ఇవ్వాలని భారత్‌ను డిమాండ్ చేసింది. అయితే ఈ రంగాలపై భారతదేశం ఆచితూచి వ్యవహరిస్తున్నది. భారత్‌లో వ్యవసాయం అనేది కార్పొరేట్ సంస్థల ఆధ్వర్యంలో నడిచే వ్యాపారంలా కాకుండా కోట్లాది మంది చిన్న రైతుల జీవనోపాధికి సంబంధించిన విషయం. మన దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వ్యవసాయంపైనే ఎక్కువగా ఆధారపడి ఉండడంతో, చిన్న రైతులను కాపాడటానికి, ఆహార భద్రతను నిర్ధారించడానికి సుంకాలు తప్పనిసరి అని భారత్ వాదించింది. అందుకు ప్రతీకారంగా అమెరికా కూడా టారిఫ్‌లను పెంచుకుంటూ పోతున్నది. ఈ వాణిజ్య యుద్ధానికి ఎప్పుడు తెరపడుతుందో చెప్పలేని పరిస్థితి.

**ఎగుమతులపై భారం :** అమెరికా విధించిన అదనపు టారిఫ్ కారణంగా భారత్ చేసే 86 బిలియన్ డాలర్ల ఎగుమతులపై ప్రభావం పడనుంది. ట్రంప్ తాజా నిర్ణయం వల్ల భారత్‌లో సూక్ష్మ , చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఉత్పత్తుల ఎగుమతి సంక్షోభంలో పడనుంది. దుస్తులు, వజ్రాలు, ఆభరణాలు, సముద్ర ఉత్పత్తులు (రొయ్యలు), తోలు ఉత్పత్తులు, పాదరక్షలు, జంతు సంబంధ ఉత్పత్తులు, రసాయనాలు, విద్యుత్ పరికరాలు, యంత్ర సామాగ్రి ఎగుమతులపై అదనపు టారిఫ్ భారం ఉండొచ్చని తెలుస్తోంది. అయితే, ఔషధాలు, ఇంధన ఉత్పత్తులైన క్రూడాయిల్, రిఫైన్డ్ ఇంధనం, సహజ వాయువు, బొగ్గు, విద్యుత్‌తో పాటు కీలక ఖనిజాలు, సెమీ కండక్టర్లు, కంప్యూటర్లు, ట్యాబ్‌లు, స్మార్ట్ ఫోన్లు, డ్రైవ్‌లు, ప్యానల్ బోర్డులు, సర్క్యూట్లు తదితర వాటిపై ప్రస్తుతానికి ఉపశమనం ఉంటుందని తెలుస్తుంది.

## చర్చించి నిర్ణయం (మొదటి పేజీ తరువాయి)

అమలు చేయరాదని బిఆర్‌ఎస్ ఇలా ఆ రెండూ పార్టీలూ 'బిసి ద్రోహులుగా, వ్యతిరేకులుగా' తెలంగాణ సమాజం భావిస్తుందని, ఆ పార్టీలు తాత్కాలికంగా విజయం సాధించామని అనుకుంటున్నాయని, కానీ సమస్యను దీర్ఘకాలికంగా వాయిదా వేస్తే, ఆ సమస్యనే వారిని బలి తీసుకుంటుందని హెచ్చరించారు. ఇప్పటికైనా బిసి బిల్లులను, ఆర్డినెన్స్‌ను ఆమోదించాలని డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్లకు కేంద్రం నుంచి ఎటువంటి సహకారం అందలేదని, బిసిలకు బిఆర్‌ఎస్ నైతిక మద్దతు కూడా ఇవ్వలేదని,ఆ రెండు పార్టీల దుర్మార్గ మైన చర్యలను తెలంగాణ సమాజం గమనిస్తుందని, క్షేత్రస్థాయిలో వారికి గుణపాఠం చెప్పేవిధంగా, తప్పుడు నిర్ణయాలను ప్రశ్నించే విధంగా భవిష్యత్ కార్యాచరణ ఉంటుందన్నారు.

**ముస్లిం రిజర్వేషన్లు ప్రతిపాదించినట్టు కిషన్ రెడ్డి చూపిస్తారా.. దేశంలో మైనార్టీలను ఉండనివ్వరా?. ?**

బిసి రిజర్వేషన్ల అంశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తొండి, వితండవాదనతో చేస్తున్నారని, తాము ప్రతిపాదించిన ఏ బిల్లులో ముస్లింలకు రిజర్వేషన్లను ప్రతిపాదించామో ఆయన చూపించాలని సిఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. కిషన్ రెడ్డి ఒక గల్లీ లీడర్లు మాట్లాడినట్టుగా చెట్టుకింద ప్లీడర్ తరహా ఊకదంపుడు ఉపన్యాసం చేయవద్దని సూచించారు. దేశంలో మైనార్టీలను ఉండనివ్వరా? , ముస్లింలకు తావు లేదా? అని సిఎం మండిపడ్డారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో బిజెపి విధానం ఏమిటో చెప్పి, స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని, ఈ విషయమై పార్లమెంట్‌లో చర్చించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు రాహుల్ గాంధీ ఎందుకు రాలేదని బిజెపి, బిఆర్‌ఎస్ అజ్ఞానులుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ ధర్నాకు 'మీరు' ఎందుకు రాలేదని, బిజెపికి ఏమైనా పెద్ద రోగం వచ్చిందా?, ఆ పార్టీని బిఆర్‌ఎస్ ఎందుకు అడగడం లేదని నిలదీశారు.

**'రాష్ట్రపతి అపాయింట్‌మెంట్' ఇవ్వకపోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమే**

బిసి రిజర్వేషన్ల బిల్లులు, ఆర్డినెన్స్ విషయంలో తెలంగాణ సిఎం, మంత్రులకు, ప్రజాప్రతినిధులకు రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడ ం దురదృష్టకరమని, ఇది తెలంగాణ ప్రజలకు అవమానకరమని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. బిసి రిజర్వేషన్ల విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొత్తం ఢిల్లీలోనే ఉన్నదని, అయినప్పటికీ రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ దక్కకపోవడం బాధకరమని, ప్రధాని మోదీ, అమిత్‌షా రాష్ట్రపతిని కలిసిన తర్వాతనే తమకు అపాయింట్‌మెంట్ రాలేదని తమ మంత్రులు భావిస్తుందన్నారు. బలహీనవర్గాల హక్కులను కాలరాసేందుకు బిజెపి మొదటి నుంచి కుట్రలకు పాల్పడుతోందని, మండల్ కమిషన్ ద్వారా ఒబిసిలకు న్యాయం చేయాలని ప్రయత్నిస్తే, కమాండల్ కమిషన్‌ను తీసుకొచ్చారని, రథయాత్ర పేరుతో ఉద్రిక్తత పరిస్థితులను సృష్టించారని సిఎం రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. కేంద్ర యూనివర్సిటీలలో బిసి రిజర్వేషన్లు అమలు చేయాలనే నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్, యుపిఎ చైర్‌పర్సన్ సోనియాగాంధీ నిర్ణయం తీసుకుంటే, యూత్ ఫర్ ఇక్వాలిటీ పేరుతో బిజెపి అడ్డుకున్నదన్నారు.

**బిజెపి పాలిత రాష్ట్రాలలోనే ముస్లింలకు రిజర్వేషన్ల అమలు**

బిజెపి పాలిత రాష్ట్రాలలో ఒబిసి రిజర్వేషన్లలోనే ముస్లింలకు రిజర్వేషన్లను అనుమతినిస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 2017లో రాజస్థాన్‌లో అబ్దుల్ సత్తార్ ఒబిసి రిజర్వేషన్‌లోనే ఐఎఎస్ సాధించారన్నారు. 1971 నుంచి నూర్‌బాష, దూదేకులు ఇతర వివిధ వృత్తులు నిర్వహించే ముస్లిములకు చట్టంలో రిజర్వేషన్లను కల్పించారని, ఈ రిజర్వేషన్లు ఆర్‌ఎస్‌ఎస్ కేంద్ర కార్యాలయమైన మహారాష్ట్ర, నరేంద్ర మోదీ జన్మించిన గుజరాత్‌లో కూడా ఉన్నాయని, ఉత్తర ప్రదేశ్‌లో అమలులో ఉన్నాయన్నారు. ఎన్ బ్లాక్ రిజర్వేషన్లు ఇవ్వాలని చట్టంలో ఉన్నదని, దీనిని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చదివారా? లేదా రాజకీయ ప్రేరేపిత లోచనతో చదవకుండానే కండ్లు ముసుకుని మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించారు.

**బిజెపికి అంటకాగుతున్న బిఆర్‌ఎస్**

బిజెపితోనే అంటకాగుతూ, కాంగ్రెస్ పార్టీ చేపట్టే ఏ మంచికీ సహకరించబోమని, విధ్వంసపూరితంగా వ్యవహరిస్తున్న బిజెపికి అండగా నిలబడేందుకు బిఆర్‌ఎస్ తయారైందని సిఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. బిజెపి తప్పిదాలను బిఆర్‌ఎస్ ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. బిఆర్‌ఎస్ రాజ్యాసభ సభ్యులు బిసి రిజర్వేషన్ల సాధనకు జరిగిన ధర్నాలో ఎందుకు పాల్గొనలేదని, పైగా తమ ధర్నాను అవహేళన చేస్తున్నారని, తాటిచెట్టు తరహా పెరిగితే సరిపోదని, అవగింజనైనా అవగాహన ఉండాలని సిఎం ఎద్దేవా చేశారు. తమను బలహీనం చేసేందుకు, తమ చేతులను కట్టేసేందుకు బిఆర్‌ఎస్ ప్రయత్నిస్తోందన్నారు.

**మోదీని ప్రధాని కుర్చీ నుంచి దింపేస్తాం..**

ఆర్‌ఎస్‌ఎస్ నేత మోహన్ భగవత్ కూడా మోదీని తప్పించేందుకు ప్రయత్నిస్తున్నారని, కానీ ఆయన (మోదీ) తప్పుకునే పరిస్థితి లేదని, రాహుల్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ మాత్రమే మోదీని కుర్చీ నుంచి దింపేస్తామని, ఎర్రకోటపైన మూడు రంగుల జెండాను ఎ గురవేస్తామని సిఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పదే పదే బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే దేశానికి నష్టం జరుగుతుందని , అందుకే బీహార్ ఎన్నికల్లో అందరూ అప్రమత్తంగా ఉండాలని సిఎం సూచించారు. మోదీని కుర్చీలో ఉన్నంత వరకు రకరాల విద్వేషాలు, గొడువలు జరుగుతుంటాయని,అందుకే ఆయనను గద్దె దింపడమే అన్ని సమస్యలకు పరిష్కారం అని అన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రైల్వేల అభివృద్ధిపై సిఎస్‌కు వివరణ : రైల్వే జిఎం



**ప్రజాపక్షం/హైదరాబాద్:**తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న రైల్వేల అభివృద్ధి పనులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ గురువారం రాష్ట్ర సచివాలయం లో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో సమావేశమై వివరించారు. భారత్ అమృత్ పథకంలో భాగంగా రూ.వేల కోట్లతో జరుగుతున్న ఆయా స్టేషన్‌ల అభివృద్ధి పనులను సిఎస్‌కు వివరించారు. ఇందులో కొన్ని స్టేషన్‌లలో పునరాభివృద్ధి పనులు పూర్తి అయ్యాయని, ఈ ఏడాది చివరి నాటికి అన్ని స్టేషన్‌లలో పునరాభివృద్ధి పనులు పూర్తవుతాయని తెలిపారు. అన్ని స్టేషన్‌లలో ప్రయాణీకుల సౌకర్యార్థం అత్యాధునిక సౌకర్యాలను కల్పిస్తున్నామని రైల్వే జిఎం సంజయ్‌కుమార్, సిఎస్ రామకృష్ణరావుతో అన్నారు. అలాగే రైల్వేల భద్రత, ప్రయాణికుల భద్రత అంశాలపై కూడా వీరద్దరు చర్చించారు. రైలు భోగీలలో ప్రయాణికుల భద్రత కోసం సిసి కెమెరాల ఏర్పాట్లను వివరించారు.

# సమరశీల ఉద్యమాల ద్వారా సమస్యలు పరిష్కారం

### ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ ఎ స్టాలిన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న విద్యారంగాన్ని కాపాడాల్సిన పాలకులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం అన్యాయమని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్‌ఎఫ్) జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.స్టాలిన్ అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 10వ తేదీ నుంచి 30 వరకు జరగనున్న ఎఐఎస్‌ఎఫ్ 90వ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. హిమాయత్ నగర్‌లోని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్.ఎ. స్టాలిన్ మాట్లాడుతూ అందరికీ విద్య పేరు తో కొందరికే (కొనగలిగే వారికే) విద్యను పరిమితం చేసిన ఘనత మన పాలకులదని ఎద్దేవా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలను సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కేంద్రంలో నూతన జాతీయ విద్యావిధానం–2020 పేరుతో విద్య కార్పొరేటీకరణ, విద్య కేంద్రీకరణ, కాషాయికరణ చేయాలని చూస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, విద్యా శాఖ మంత్రిని కూడా నియమించలేని దుస్థితి ఉండడం విద్యారంగం పట్ల పాలకులకున్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గురుకులాల్లో, ఆశ్రమ విద్యాసంస్థల్లో కలుషిత ఆహారంతో విద్యార్థులు అల్లాడుతున్నారని దీనికి కారణాలేమిటో ప్రభుత్వం బహిర్గతం చేయడంతో పాటు విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న అధికారులను ఉద్యోగం నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్యారంగ సమస్యలపై ఎఐఎస్‌ఎఫ్ అలుపెరగని పోరాటాలు చేయాలని సూచించారు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని, దేశ స్వాతంత్ర్యమే లక్ష్యంగా దేశ స్వాతంత్ర్యం మా జన్మహక్కు అని 1936, ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఆవిర్భవించిన అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) ఈనెల 12తేదీ నాటికి 90వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ నెల 10 నుంచి 30 వరకు నిర్వహించనున్న 90వ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.8500 స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు ఉండడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో పాలక వర్గాలకు ఎలాంటి చిత్తశుద్ధి లేదని, ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ గ్యార నరేష్, బానోత్ రఘురాం, గ్యార క్రాంతి, సి.రాజు, కాసోజ్ నాగజ్యోతి, బరిగెలా వెంకటేష్, రాష్ట్ర నాయకులు జేరిపోతుల జనార్ధన్, మచ్చ రమేష్, మురళీ కృష్ణ, సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, భాషబోయిన సంతోష్, అజిత్, చైతన్య యాదవ్, కుమ్మరి సాగర్, ప్రీతమ్, పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూసేకరణ) శాఖ

(కేంద్ర చట్టము 30/2013 యొక్క సెక్షన్ 19 (1) మరియు తెలంగాణ రాష్ట్ర రూల్ 25 (1) అనుసరించి కలెక్టర్ /అధనపు కలెక్టర్ /రాజస్వ మండలాధికారి హుజూర్‌నగర్ (భూసేకరణ)

ఫారం- 7 (రూఢీ ప్రకటన)

జిల్లా కలెక్టర్ సూర్యాపేట ఫైల్ నం. జి/201/2025 తేది: 04.08.2025
రెవెన్యూ డివిజినల్ అధికారి ఫైల్ నం. ఎఫ్/537/2025 హుజూర్‌నగర్ తేది: 31.07.2025
గెజిట్ నెంబర్: 41/2025 తేది: 40.08.2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, సూర్యాపేట, సూర్యాపేట గారి ఆదేశానుసారం ఈ దిగువ షెడ్యూల్‌లో నిర్దిష్ట పరచిన సూర్యాపేట జిల్లా, పాలకవీడు మండలం, కోమటికుంట గ్రామ శివారు లోని సర్వే నెంబర్ 23, 24, 25, 41, 43, 46 లలో విస్తీర్ణం **ఎ.1.06 గుంటలు** పట్టా భూములు ప్రజా ప్రయోజన నిమిత్తము అనగా పాలకీడు మండలము, కోమటికుంట గ్రామము నుండి జాన్ పహాడ్ బ్రాంచ్ కెనాల్‌కు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు కొరకు అవసరమైనదని భావించినందున, భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013లోని సెక్షన్ 19(1) అనుసరించి భూసేకరణ నిమిత్తము రూఢీ ప్రకటన జారీ చేయనైనది.

ఇట్టి భూసేకరణ భూములకు భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 (తెలంగాణా సవరణ) చట్టం 2016 (చట్టం 21 ఆఫ్ 2017) ననుసరించి సదరు భూసేకరణ చట్టం 30/2013 (చాప్టర్ 2) లోని సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక మరియు చాప్టర్-3 ప్రకారం సెక్షన్ - 10A ఆహారభద్రత పరిరక్షణ మినహాయింపు ఇవ్వనైనది.

కావున సూర్యాపేట జిల్లా, పాలకవీడు మండలం, కోమటికుంట గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 23, 24, 25, 41, 43, 46 లో విస్తీర్ణం **ఎ.1.06 గుంటలు** గల భూమి నుండి జాన్‌పహాడ్ బ్రాంచ్ కెనాల్‌కు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు కొరకు అవసరమైనదని ఈ క్రింద చూపిన విధముగా భూ సేకరణ నిమిత్తం రూఢీ ప్రకటన జారీ చేయనైనది.

గ్రామం: కోమటికుంట మండలం: పాలకవీడు జిల్లా: సూర్యాపేట

| క్రమ సంఖ్య | సర్వే నెంబరు | [illegible] | భూమి రకము | [illegible] | పట్టాదారు పేరు / ఆసక్తిగల వ్యక్తుల పేరు / చిరునామా | అనుభవదారు | సరిహద్దులు: ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు / నిర్మాణములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | | | | 9 |
| 1 | 23 | [illegible] | [illegible] | 0.01 1/2 | - | రోడ్డు | VB | 25 | 24 | 26 | [illegible] |
| 2 | 23/ఆ1 | [illegible] | [illegible] | 0.01 | కసిరెడ్డి అంతమ్మ భర్త శ్రీనివాసారెడ్డి | కసిరెడ్డి అంతమ్మ భర్త శ్రీనివాసారెడ్డి | VB | 25 | 24 | 26 | [illegible] |
| 3 | 23/ఈ | [illegible] | [illegible] | 0.02 1/2 | ఒంటెద్దు సైదిరెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి | ఒంటెద్దు సైదిరెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి | VB | 25 | 25 | 26 | [illegible] |
| 4 | 24 | [illegible] | [illegible] | 0.02 | - | మొడే పుష్ప భర్త సైదులు | VB | 41 | - | 23 | [illegible] |
| 5 | 24/ఆ2 /2 | [illegible] | [illegible] | 0.01 | మొడే ఉషా భర్త గోవిందు | మొడే గోవిందులు తండ్రి బిక్షమ్ | VB | 41 | - | 23 | [illegible] |
| 6 | 24/ఆ /2 | [illegible] | [illegible] | 0.01 | మొడే రామలింగమ్మ భర్త బిక్షమయ్య | మొడే రామలింగమ్మ భర్త బిక్షమయ్య | VB | 41 | - | 23 | [illegible] |
| 7 | 24/ఆ3 /2 | [illegible] | [illegible] | 0.01 | మొడే బాల కృష్ణ తండ్రి బిక్షం | మొడే బాల కృష్ణ తండ్రి బిక్షం | VB | 41 | - | 23 | [illegible] |
| 8 | 24/2 /1 | [illegible] | [illegible] | 0.01 | మొడే ఝాన్సీ భర్త బాలకృష్ణ | మొడే ఝాన్సీ భర్త బాలకృష్ణ | VB | 41 | - | 23 | [illegible] |
| 9 | 25/ఆ2 /1 | [illegible] | [illegible] | 0.01 1/4 | చింతలచెర్వు రమాదేవి భర్త గంగయ్య | చింతలచెర్వు రమాదేవి భర్త గంగయ్య | 23 | 41 | 41 | 26 | [illegible] |
| 10 | 25/ఆ2 /1 | [illegible] | [illegible] | 0.01 1/4 | చింతలచెర్వు రమాదేవి భర్త గంగయ్య | చింతలచెర్వు గంగయ్య తండ్రి సైదులు | 23 | 41 | 41 | 26 | [illegible] |
| 11 | 25 | [illegible] | [illegible] | 0.00 1/2 | - | ఎస్ఎస్‌పి కాలువ | 23 | 41 | 41 | 26 | [illegible] |
| 12 | 25 | [illegible] | [illegible] | 0.04 1/2 | భూక్యా నాగేందర్ తండ్రి ధంజ్యా | భూక్యా నాగేందర్ తండ్రి ధంజ్యా | 23 | 41 | 41 | 26 | [illegible] |
| 13 | 25/ఇ /2 | [illegible] | [illegible] | 0.00 1/2 | భూక్యా పంగి భర్త బాలు | భూక్యా పంగి భర్త ధంజ్యా | 23 | 41 | 41 | 26 | [illegible] |
| 14 | 41-1 | [illegible] | [illegible] | 0.04 | భూక్యా శాంతి భర్త కరుణ్‌నాయక్ | భూక్యా కరుణ్ నాయక్ తండ్రి ధంజ్యా | 25 | 43 | 41 | 40 | [illegible] |
| 15 | 41/2/2 | [illegible] | [illegible] | 0.01 1/2 | భూక్యా నాగేందర్ తండ్రి ధంజ్యా | భూక్యా నాగేందర్ తండ్రి ధంజ్యా | 25 | 43 | 41 | 40 | [illegible] |
| 16 | 41/1 -23 | [illegible] | [illegible] | 0.05 1/2 | తోడేటి గంగమ్మ భర్త గంగయ్య | తోడేటి గంగమ్మ భర్త లింగయ్య | 25 | 43 | 41 | 40 | [illegible] |
| 17 | 43/1 | [illegible] | [illegible] | 0.05 | అవిరబోయిన మల్లయ్య తండ్రి సైదయ్య | అవిరబోయిన మల్లయ్య తండ్రి సైదయ్య | 41 | 46 | 42 | 40 | [illegible] |
| 18 | 46 | [illegible] | [illegible] | 0.04 1/2 | అవిరబోయిన మల్లయ్య తండ్రి సైదయ్య | అవిరబోయిన మల్లయ్య తండ్రి సైదయ్య | 43 | VB | 46 | 40 | [illegible] |
| 19 | 46/5/1 | [illegible] | [illegible] | 0.00 1/2 | బొలగాని సోమయ్య తండ్రి రామచంద్రు | బొలగాని సోమయ్య తండ్రి రామచంద్రు | 43 | VB | 46 | 40 | [illegible] |
| 20 | 46/2 | [illegible] | [illegible] | 0.02 1/2 | జనిగా బచ్చమ్మ భర్త సైదయ్య | జనిగా బచ్చమ్మ భర్త సైదులు | 43 | VB | 46 | 40 | [illegible] |
| 21 | 46/1 | [illegible] | [illegible] | 0.00 1/2 | మొగిలి నారయ్య తండ్రి సైదయ్య | మొగిలి నారయ్య | 43 | VB | 46 | 40 | [illegible] |
| 22 | 46/ఆ2 /1 | [illegible] | [illegible] | 0.03 | తోడేటి లింగమ్మ భర్త నాగయ్య | తోడేటి లింగమ్మ భర్త నాగయ్య | 43 | VB | 46 | 40 | [illegible] |
| | | | మొత్తం | 1.06 | | | | | | | |

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూ సేకరణ పై వచ్చిన అభ్యంతరాలు పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులు కానందున పునరావాసం కల్పించుట లేదు.

భూ సేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్ట్ నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పైన భూమిని భూ సేకరణ చేయు భూములు యొక్క నమూనా భూ సేకరణ అధికారి మరియు రాజస్వ మండలాధికారి హుజూర్‌నగర్ నందు కార్యాలయపు పనివేళల నందు చూసుకొనవచ్చును.

సం/- భూసేకరణ అధికారి & రెవెన్యూ డివిజినల్ అధికారి హుజూర్‌నగర్
సం/- అదనపు కలెక్టర్ సూర్యాపేట
సం/- జిల్లా కలెక్టర్, సూర్యాపేట

DIPR RO NO. 452/LA/PP/Advt/Pub/2025-26


## ఎస్‌సిల సంక్షేమం కోసం నిధులు విడుదల

### కేంద్రాన్ని కోరిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్




**ప్రజాపక్షం/హైదరాబాద్:**తెలంగాణ రాష్ట్రంలో ఎస్‌సిల సంక్షేమం కోసం నిధులు విడుదల చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు న్యూ ఢిల్లీ లో గురువారం కేంద్ర మంత్రి రాందాస్ అథవాలేని కలిసి రాష్ట్రానికి సంబంధించిన సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రాష్ట్రానికి కేంద్ర సహాయం తక్షణం విడుదల చేయాలని అడ్లూరి విజ్ఞప్తి చేశారు. పిసిఆర్, పిఒఎ చట్టాల చట్టాల అమలుకు రూ.232.68 కోట్లు (మును పటి బకాయిలతో కలిపి), పిఎం ఎజెఎవై పథకం కింద 2025–26 సం.కి రూ.82.20కోట్ల నుకేంద్రం నుండి విడుదల చేయాల్సి ఉందని కేంద్రమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే రాష్ట్రం తన వాటాను చెల్లించిందని, కేంద్ర వాటా ఇప్పటివరకు రిలీజ్ కాలేదని మంత్రి తెలిపారు. ఈ నిధుల విడుదల వల్ల ఎస్‌సి వర్గాల న్యాయం, సాధికారత, అభివృద్ధి మరింత బలోపేతం అవుతుందని అన్నారు. 1,023 రెసిడెన్షియల్ విద్యా సంస్థలలో సుమారు 650 అద్దె భవనాల్లో పనిచేస్తున్నాయని, ఇది విద్యా ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం చూపుతోందని చెప్పారు. కేంద్ర మంత్రి ని కలిసిన వారిలో తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య ఉన్నారు.

## సిఎంతో మాట్లాడి గుడిసెవాసులకు

# ఇళ్ల పట్టాలకోసం కృషి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు భరోసా



**ప్రజాపక్షం/హనుమకొండ:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి పలివేల్పుల భగత్ సింగ్ నగర్ వాసులకు ఇండ్ల పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కాలనీవాసులకు భరోసా ఇచ్చారు. గత 17 సంవత్సరాలుగా ప్రభుత్వ భూమి లో నివాసం ఉంటున్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు జాప్యం చేస్తున్నందున వారి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సిపిఐ ....జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, కార్యవర్గ సభ్యులు ఏదునూరి వెంకట్రాజం ఆధ్వర్యంలో గురువారం హనుమకొండలోని హరిత హోటల్లో బసచేసిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కాలనీవాసులు కలవడం జరిగింది. న్యాయమైన కాలనీవాసుల సమస్యను సావధానంగా విన్న సాంబశివరావు చలించి పోయారు. అన్ని విధాలుగా అర్హులై ఉండి, పట్టాలు ఇవ్వడానికి ఎలాంటి ఆటంకం లేనప్పుడు, పైగా స్థానిక ఎమ్మెల్యే లు అందరూ పట్టాల కోసం హామీలు ఇచ్చి ఉన్నప్పుడు ఇంకా ఎందుకు జాప్యం జరుగుతుందో తెలుసుకుంటానన్నారు. ఇప్పటివరకు అసలు పైస్థాయిలో ప్రభుత్వం గానీ, అధికారులు కానీ సమస్యను పెద్దగా పట్టించుకున్నట్టు లేదని, అసలు వారికి ఈ సమాచారం ఉందో లేదో కూడా తెలియట్లేదని అందువల్ల తాను ఇప్పుడు స్వయంగా ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీ నుండి రాగానే వీలైతే కాలనీవాసుల ప్రతినిధి బృందంతో వెళ్లి కలుస్తానని అన్నారు. సమస్య పరిష్కారం అయ్యేదాకా వెంట పడతానని కూడా కాలనీవాసులకు భరోసా ఇచ్చారు. వారి సమస్య పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తానని మాట ఇచ్చిన రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకి, రాష్ట్ర పార్టీ సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుకు భగత్ సింగ్ నగర్ కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఎన్ ఎ స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కొట్టెపాక రవి, మండల సహాయ కార్యదర్శి అలవాల రాజు, మహిళా సమాఖ్య నాయకురాలు జూకంటి పద్మ, నాయకులు వీరలక్ష్మి, కుమార్, మొగిలి, ప్రవర్ధన్, శ్రవణ్ కుమార్, తదితరులతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

## స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీతో ఒప్పందం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలోని స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీతో తాము కూడా ఒప్పందం చేసుకుంటామని, స్కిల్డ్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల్లో భాగస్వాములుగా అవుతామని అమిటీ యూనివర్సిటీ ఛాన్స్‌లర్ అతుల్ చౌహాన్ తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర విద్యారంగం అభివృద్ధికి తమ వంతుగా సేవలు అందిస్తామన్నారు. ఢిల్లీలోని తెలంగాణ సిఎం అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని

### అమిటీ యూనివర్సిటీ ఛాన్స్‌లర్ అతుల్ చౌహాన్

అమిటీ యూనివర్సిటీ ఛాన్స్‌లర్ అతుల్ చౌహాన్ గురువారం కలిశారు. తెలంగాణలో తమ యూనివర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసినందుకు సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. మెరుగైన వసతులు, నాణ్యమైన విద్యా బోధనతో అమిటీకి మంచి పేరు ఉన్నదని, తెలంగాణలో మరింతగా రాణించేందుకు కృషిచేస్తామని చౌహాన్ అన్నారు.

# చేనేత రంగానికి ప్రత్యేక స్థానం ఉంది

### చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చేనేత రంగానికి రాష్ట్రంలో ప్రత్యేక స్థానం ఉందని, వారసత్వంగా వచ్చిన రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వ్యవసాయం, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నకు, వస్త్రానిచ్చే నేతన్నకు ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి ధన్యవాదాలు తెలియజేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్‌ప్లాజాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. చేనేత దినోత్సవం సందర్భంగా పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన వస్త్ర ప్రదర్శనలో 100 పైగా స్టాల్స్ ను మంత్రి ప్రారంభించి, నేతన్నలు తయారు చేసిన చేనేత ఉత్పత్తులను పరిశీలించారు. ముఖ్యంగా జైలు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్లోని వస్త్రాలను మంత్రి పరిశీలించి అభినందించారు. అదేవిధంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత అవార్డులకు ఎన్నికైన వారు తయారుచేసిన ఉత్పత్తులను పరిశీలించిన మంత్రి వారిని అభినందించారు. తెలంగాణ చేనేత లోగోతో పాటు త్రిలింగ పట్టు చీరలను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ చేనేత కార్మికులకు ఏ సమస్య వచ్చిన ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధిలో మన రాష్ట్రమే మొదటి స్థానంలో ఉందని, అదేవిధంగా జియో ట్యాగింగ్ లో కూడా మనమే ముందున్నామన్నారు. చేనేత అనేది కేవలం ఉపాధి మార్గం మాత్రమే కాదు అని, భారతీయ సంస్కృతికి ప్రతీక అని అన్నారు. ఇది తరతరాలుగా వారసత్వంగా అందిన హస్తకళ. ఈ కళను పరిరక్షించడం బాధ్యత మనందరి మీద ఉందన్నారు. (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ) ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తూ చేనేత కళను కొత్త తరం వరకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందన్నారు. తెలంగాణ రాష్ట్రం చేనేతరంగంలో దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును సంపాదించిందని, గద్వాల, నారాయణపేట, పోచంపల్లి ఇక్కత్, సిద్దిపేట గొల్లభామ, వరంగల్ దర్రిస్, కరీంనగర్ బెడ్‌షీట్లు వంటి ఉత్పత్తులు అంతర్జాతీయంగా పేరుగాంచాయని పేర్కొన్నారు చేనేత ఉత్పత్తుల వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వ శాఖలు టెస్కో ద్వారానే వస్త్రాలను కొనుగోలు చేయాలనే ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. అంతరించిన పోతున్న చేనేత కళలన్నింటికి పునర్వైభవం తెచ్చేలా ఈ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా స్టాల్స్‌తోఏర్పాటు చేసినచేనేత వస్త్ర ఎగ్జిబిషన్ ఈనెల 17వరకు కొనసాగనుంది. అన్ని ప్రాంతాల్లో ఉత్పత్తి అయ్యే చేనేత వస్త్రాలు ఈ వస్త్ర ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. ఈకార్యక్రమంలో జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ కామారెడ్డి జిల్లా కార్యదర్శిగా ఎల్.దశరథ్



**కామారెడ్డి :** సిపిఐ కామారెడ్డి జిల్లా కార్యదర్శిగా ఎల్. దశరథ్ ఎన్నికయ్యా రు. కామారెడ్డిలో జరిగిన మహాసభలో జిల్లా సహాయకార్యదర్శులుగా పి.బాలరాజ్, దుబాస్ రాములు, వీరితో పాటు కార్యవర్గ సభ్యులుగా వి.ఎల్. నరసింహారెడ్డి, గంగాధర్, రాజిరెడ్డి, శివ ప్రసాద్, ప్రవీణ్ సహా 21 మంది కౌన్సిల్ సభ్యులు ఎన్నికయ్యారు.మహాసభకు 450మంది ప్రతినిధులు హాజరయ్యారని, వివిధ పార్టీల నుండి సిపిఐలో 30 మంది చేరారని జిల్లా కార్యదర్శి దశరథ్ తెలిపారు.

## సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శిగా బృంగి బాలకిషన్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శిగా బృంగి బాలకిషన్ రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతో పా టు 8 మంది కార్య వర్గ సభ్యు లు, 19 మంది కౌన్సిల్ సభ్యులును జడ్చర్లలో జరిగిన జిల్లా మహాసభలో ఎన్నుకున్నారు.

జిల్లా కార్యవర్గ సభ్యులుగా బి.పరమేశ్ గౌడ్, కొండపల్లి రాము, సురేష్, బాగి కృష్ణయ్య, ఆర్.అల్వాల్ రెడ్డి, గోవర్ధన్ , పద్మ ఎన్నికయ్యారు.

## బ్రౌన్‌షుగర్ స్వాధీనం : ఇద్దరి అరెస్టు



**ప్రజాపక్షం/హైదరాబాద్:**పశ్చిమ బెంగాల్ నుంచి హైదరాబాద్‌కు బ్రౌన్‌షుగర్ (హెరాయిన్)ను స్మగ్లింగ్ చేస్తున్న ఓ ముఠా గుట్టును ఎక్సైజ్ అధికారులు రట్టు చేశారు. ఈ మేరకు రూ.2.50 లక్షల విలువైన బ్రౌన్‌షుగర్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. శంషాబాద్ టిడిఎఫ్ సిఐ ప్రవీణ్‌కుమార్ కథనం మేరకు పూర్తి వివరా లు ఇలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఎండి నూర్ అక్బర్, ఎండి అజిత్ మోహిన్ అనే ఇద్దరు యువకులు తరచుగా హైదరాబాద్‌కు బ్రౌన్ షుగర్ స్మగ్లింగ్ చేస్తు అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నారు. శంషాబాద్ టిడిఎఫ్ సిఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐలు శ్రీకాంత్, గణేష్, మల్లేష్, కానిస్టేబుళ్లు నెహ్రూ సాయి శంకర్ లు గురువారం కాజాగూడ నుంచి నానక్‌రామ్ రోడ్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా పై ఇద్దరు నిందితులు పట్టుబడ్డారు. వీరివద్ద నుంచి రూ.2.50లక్షల విలువైన బ్రౌన్ షుగర్‌ను స్వాధీనం చేసుకున్నారు. బ్రౌన్ షుగర్ ని పట్టుకున్న డిటిఎఫ్ టీం ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షా నవాజ్ ఖాసీం, శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణ ప్రియలు అభినందించారు.

# క్రిమినల్ గ్యాంగ్ నేరాలపై దృష్టి పెట్టండి

### రాష్ట్ర క్రైమ్ మీటింగ్‌లో డిజిపి డాక్టర్ జితేందర్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** క్రిమినల్ గ్యాంగ్ లు పాల్పడే నేరాలపై దృష్టి పెట్టాలని రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ పోలీసు అధికారులకు సూచించారు. తొలి అర్ధ వార్షిక నేర సమీక్షా ముగింపు సమావేశం గురువారం డిజిపి కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో అధికారులను ఉద్దేశించి డిజిపి మాట్లాడుతూ.. క్రిమినల్ గ్యాంగ్ ల నేరాలను అరికట్టేందుకు కఠినమైన చట్టాలు ఉన్నాయని వాటి ద్వారా ఆయా నేరాలను అరికట్టాల్సిన భాధ్యత పోలీస్ అధికారులపై ఉందని డిజిపి అన్నారు. క్రిమినల్ గ్యాంగ్ ల వారీ గానే కాక అందులో సభ్యు లై నేరాలకు పాల్పడిన వారు గత 20 సంవత్సరాలు గా జైళ్ల లో శిక్షలు అనుభవిస్తున్నారని డిజిపి అన్నారు. పోలీసు కమిషనర్లు, ఎస్‌పిలు వారి, వారి యూనిట్ల పరిధి లోని క్రిమినల్ గ్యాంగ్ ల పై ప్రత్యేక దృష్టి పెట్టీ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ సరఫరాను , వినియోగాన్ని అరికట్టాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ ఐపిఎస్ స్పష్టం చేశారు. డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నదని తదనుగుణంగా కమీషనర్లు, ఎస్పీలు కఠినంగా వ్యవహరించాలన్నారు. అదేవిధంగా, యువత డ్రగ్స్ బారిన పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ పై అవగాహన చర్యలు చేపట్టడం తో పాటు, తగ్గిన చర్యలు చేపట్టాలని ఆకాంక్షించారు. డ్రగ్స్ పట్టుకున్న తరువాత అవి ఎక్కడి నుండి రాష్ట్రానికి వచ్చాయనే వివరాలు సేకరించాలన్నారు. ఇతర రాష్ట్రాల నుండి డ్రగ్స్ సరఫరా జరుగుతున్నదని తెలిపారు. సమావేశంలో ముందుగా టి నాబ్ డైరెక్టర్ సందీప్ శాండి ల్యా మాట్లడుతూ డ్రగ్స్ సరఫరా చేస్తున్న నైజీరియన్లను అరెస్ట్ చేశామన్నారు. డ్రగ్స్ కంట్రోల్ , డైరెక్టర్ షా వనాజ్ ఖాసీం నకిలీ మందుల ను అరికట్టేందుకు స్థానిక పోలీసులు సమాచారం అందించాలని కోరారు.

సిఐడి, డిఐజి నారాయణ నాయక్ కొత్త చట్టాల గురించి వివరించారు. మారిన సెక్షన్ లను వివరించారు. లీగల్ అడ్వైసర్ అజయ్ కుమార్, దర్యాప్తు లోని లోపాలను వివరించారు. టిజిపిఏ డైరెక్టర్ అభిలాష బిస్త్ అకాడమీ లో చేపడుతున్న శిక్షణా కార్యక్రమాలను తెలియజేశారు. డైరెక్టర్ అఫ్ ప్రాసిక్యూషన్ సాంబశివ రెడ్డి ఆర్గనైజ్డ్ నేరాలపై మాట్లాడారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ అనిత రామచంద్రన్ పిల్లల, మహిళల ల కోసం చేపడుతున్న మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి ల ప్రాధాన్యత లను తెలిపారు. గాంధీ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ కృపా ల సింగ్ దర్యాప్తు లో కీలకమైన ఫోరెన్సిక్ అంశాల గురించి వివరించారు. మెడికో లీగల్, పోస్ట్ మార్టం రిపోర్టింగ్ పై ఉస్మానియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్, క్రిమినల్ గ్యాంగ్ ల నేరాల చట్టాల గురించి రిటైర్డ్ పి పి డాక్టర్ రాములు , ఖైదీల ఎస్కార్ట్ ల పై జైళ్ల శాఖ డిజి సౌమ్య మిశ్రా, సిసిటివిఎస్ కెమెరాల పై అడిషనల్ డిజిపి వి వి శ్రీనివాస రావు , శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్ మాట్లాడుతూ పార్ధీ గ్యాంగ్ ల తరహాలో చెడ్డి, భవేరియా వంటి గ్యాంగ్ లపై దృష్టి పెట్టాలని, నకిలీ విత్తనాల విషయంలో అవసరమైతే పి డి యాక్ట్ పెట్టాలన్నారు.

శాంతిభద్రతల కోసం, అదుపు చేసేందుకు కెమెరాలను అవసరమైన ప్రాంతాల్లో తప్పనిసరిగా ఏర్పాటు చేయడం ద్వారా నేరాల గురించి తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు.హోం గార్డు ల గురించి అడిషనల్ డిజిపి స్వాతి లక్రా తెలియజేశారు.హైదరాబాద్ ట్రాఫిక్ పై జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ వివరించారు. రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, మల్టీ జోన్ ఐజిపి లు చంద్రశేఖర్ రెడ్డి, తఫ్సీర్ ఇక్బాల్, ఐజిపి లు ఎం. రమేష్, రమేశ్ నాయుడు, శ్రీనివాసులులతో పాటు కమిషనర్లు, అన్ని జిల్లాల ఎస్‌పిలు సమావేశంలో పాల్గొన్నారు.


HYDERABAD
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

NIT No. 23, **పని పేరు:** జిహెచ్‌ఎంసి, రాజేంద్రనగర్ సర్కిల్-11లో 03 పనుల కొరకు సిసి రోడ్డు వేయడం, ఆర్‌సిసి ఎన్‌పి3 600mm డయా పైప్ లైన్ వేయడం మరియు డ్రైనేజీ కనెక్షన్లను అందించడం , **అంచనా వ్యయం:** రూ.23.50 లక్షలు, **డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ & సమయం:** 07.08.2025న మ.2.30గం.ల నుండి, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 12.08.2025న మ.2.45గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ డివిజన్ నెం.11, జిహెచ్‌ఎంసి. సెల్: 9989930608. ఇ-మెయిల్ ఐడి:eec11.ghmc2@gmail.com

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-XI, (ఆర్‌జెఎన్‌ఆర్), జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 6197-PP/CL/ADVT/1/2025-26, Date: 07-08-2025



పురపాలక సంఘ కార్యాలయము-దుబ్బాక, జిల్లా :: సిద్దిపేట

నెం. E1/62/15th FC/GF/2025, టెండర్ ప్రకటన తేది: 07.08.2025

దుబ్బాక పురపాలక సంఘం పరిధిలో, 15వ ఆర్థిక నిధుల ద్వారా **1.** ఆర్.ఒ. ప్లాంట్ ఏర్పాటు చేయుటకు రూ: 4.00 లక్షలు, **2.** DRCC & Vermi Compost Shed మిగులు పనులు చేయుటకు రూ: 6.00 లక్షలు, **3.** సాధారణ నిధుల నుండి LED లైట్స్ కొనుగోలు చేయుటకు రూ: 3.00 లక్షలు, **4.** విద్యుత్తు మరియు మంచినీటి సామాగ్రి కొనుగోలు చేయుటకు రూ: 10.00 లక్షలు మరియు ఫర్మేషన్ రోడ్డు ఏర్పాటు చేయుటకు రూ: 2.50 లక్షల చొప్పున, మొత్తం రూ: 25.50 లక్షలు, మంజూరీ కాబడినవి. ఇట్టి పనులు నిర్వహించుటకు పనులను చేపట్టుటకు ఈ ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్స్ ఆహ్వానిచనైనది.

| | | |
|---|---|---|
| 1. | బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడింగ్ ప్రారంభ తేదీ: | 08.08.2025 11.00 A.M. |
| 2. | బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడింగ్ చివరి తేదీ: | 16.08.2025 4.00 P.M. |
| 3. | బిడ్ వాలిడిటీ పీరియడ్ | 90 Days |
| 4. | వివరములకు సంప్రదించు ఫోన్ నం. | 9390988378, 9391495430, |

పైన తెలిపినపనులకు ద్వారా టెండర్స్ ఆహ్వానిచనైనది. తదుపరి వివరాలకు ఈ ప్రొక్యూర్మెంట్ www.eprocurment.telangana.gov.in సంప్రదించగలరు.

సం/- కమీషనర్ పురపాలక సంఘం దుబ్బాక.

DIPR R.O. No. : 6207-PP/CL/ADVT/1/2025-26, Date: 07-08-2025

## తల్లిదండ్రుల శ్రమను గుర్తించి బాగా చదువుకోవాలి

**ప్రజాపక్షం/కోదాడ:** విద్యార్థులు తల్లిదండ్రుల శ్రమను చూసి బాగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థానాలను సాధించాలని పిసిసి డెలిగేట్, కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావులు అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని ఎస్ఆర్ఎస్ కళాశాల బాయ్స్ క్యాంపస్‌లో జరిగిన ఫ్రెషర్స్ డే లో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థి జీవితం ఇంటర్మీడియట్ దశ కీలకమని ఈ దశలోనే వారి జీవితానికి పునాది ఏర్పడుతుందని అన్నారు. కుటుంబంలో ఒక్కరు ఉన్నత స్థాయిలో ఉంటే ఆ కుటుంబంలో మూడు తరాల వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్థిరపడతారని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కళాశాల చైర్మన్ వద్దే రాజేష్‌రెడ్డి, డైరెక్టర్ మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు డేగ శ్రీధర్, కంభంపాటి శ్రీనివాస్, పిడతల శ్రీనివాస్, అకాడమిక్ అడ్వైజర్ మైసం రామయ్య, ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

## ప్రమాదాలు నివారించడానికే తనిఖీలు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రసాయనిక, ఔషధ పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించకుండా తనిఖీలు నిర్వహించి నివేదికను సమర్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం తన ఛాంబర్‌లో ఫ్యాక్టరీలు, రసాయనిక పరిశ్రమల్లో భద్రతపై ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 30వ తేదీన సంగారెడ్డి జిల్లా పాశంమైలారంలో సంభవించిన అతిపెద్ద విస్ఫోటనాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాక్టరీలు, ప్రత్యేకించి రసాయన పరిశ్రమలు, ఔషధ యూనిట్లలో ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు. సూర్యాపేట జిల్లాలో పరిశ్రమల కార్మిక, కాలుష్య నియంత్రణ మండలి తదితర సంబంధిత శాఖల అధికారులతో కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈనెల 14వ తేదీలోగా నిర్ణేశించిన ప్రొఫార్మా ప్రకారం నివేదికను సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటి చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి, జిల్లా పరిశ్రమల మేనేజర్ టి సాయిరాం, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి, కాలుష్య నియంత్రణ మండలి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## పటిష్ఠంగా ఆహార భద్రతచట్టం

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/ సూర్యాపేట కలెక్టరేట్ :** ఆహార భద్రత చట్టాన్ని సూర్యాపేట జిల్లాలో పటిష్ఠముగా అమలు చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషనర్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం జిల్లాలో ఫుడ్ కమిషన్ పర్యటన సందర్భముగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి సమీక్షించారు. జిల్లాలో ఆరోగ్యం, స్కూల్స్, హాస్టల్స్ విషయాల్లో ప్రత్యేక తీసుకుంటున్నారని, ఇక్కడ ఆహారభద్రత చట్టాన్ని అమలు చేయడంపై ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. పేదరికం పోవాలంటే చదువు ముఖ్యమని అన్నారు. రేషన్ దుకాణాలలో డీలర్స్ వేయింగ్ మిషన్లలో ఇబ్బందులు వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అంగన్‌వాడీ కేంద్రాలలో గుడ్లు, పాలు, ఆట వస్తువులు సక్రమంగా సరఫరా చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ హాస్టల్, అంగన్‌వాడీ, రెసిడెన్షియల్ స్కూళ్ళలో పూర్తిస్థాయి ఆహారభద్రత చట్టాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఫుడ్ కమీషన్ సభ్యులు ఆనంద్, శారద, భారతి, జ్యోతి, డిఆర్‌డిఏ పిడి అప్పారావు, సంక్షేమ శాఖ అధికారులు దయానందరాణి, శంకర్ నాయక్, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మారుతున్న కాలానికి అనుగుణంగా డిజైన్లు

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** మారుతున్న కాలానికి అనుగుణంగా చేనేత డిజైన్లు రూపొందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని రాయగిరి క్రాస్ నుండి జిల్లా కలెక్టరు కార్యాలయం వరకు చేనేత కార్మికుల భారీ ర్యాలీని, జిల్లా కలెక్టరు హనుమంత రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థలు అదనపు భాస్కరరావు, ఏడి హ్యాండ్లూమ్ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన గావించారు. చేనేత కళను కాపాడుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కళాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ సుందరీమణులు పోచంపల్లి సందర్శించినప్పుడు, వారు మన వస్త్రాన్ని ధరించడం వల్ల మార్కెట్ పెరిగిందని తెలిపారు. నేతన్న భీమాకు చనిపోయిన నెలరోజుల్లోనే రూ.5 లక్షలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టరు శ్రీనివాస్, చేనేత సహకార సంఘ ప్రెసిడెంట్ జల్ది రాములు, కార్మిక సంఘ నాయకులులక్ష్మీ నరసయ్య, చేనేత సహకార సంఘ అధ్యక్షులు సుధాకర్, చేనేత సహకార సంఘం ప్రెసిడెంట్ సుధాకర్ సుదర్శన్, డెవలప్మెంట్ ఆఫీసర్ రాజేశ్వర్ రెడ్డి, అసిస్టెంట్ డెవలప్మెంట్ ఆఫీసర్ సత్యనారాయణ, చేనేత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు

యాదాద్రి జోన్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజలకు సురక్షితమైన ఆహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా, పట్టణంలో రెండు రోజుల పాటు ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించబడింది. ఆగష్టు 6 నుంచి 7 వరకు ఎస్ఎల్‌బీసీ నుండి డీవీకే రోడ్, క్లాక్ టవర్, బస్టాండ్, మిర్యాలగూడ రోడ్డు కలెక్టరేట్ వరకు ఉన్న 60కి పైగా హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఫ్రూట్స్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, మాంసం దుకాణాలు, టీ స్టాల్స్, బేకరీలతో సహా వివిధ ఆహార వ్యాపార కేంద్రాలను ఆహార భద్రతా నిబంధనల మేరకు తనిఖీ చేశారు.యాదాద్రి జోన్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి ఆదేశాల మేరకు, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి డాక్టర్ ఎన్ శివ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ ద్వారా ఆహార భద్రతా డ్రైవ్‌లో సిబ్బంది పాల్గొన్నారు. ఈ తనిఖీల్లో పాలు, టీ పొడి, కారం, పసుపు, మసాలాలు, వంట నూనె, బిర్యానీ, స్వీట్స్, బేకరీ ఆహార పదార్థాలలో నిషిద్ధ రంగులు వాడకుండా, కొందరు చికెన్ సెంటర్ల నిర్వాహకులు అవగాహన రాహిత్యంతో రంగులు వాడుతున్నట్లు గుర్తించి నోటీసులు జారీచేయడం జరిగింది, అనుమా నాస్పద పదార్థాలపై ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ వాహనంతో తక్షణ పరీక్షలు నిర్వహించారు. తనిఖీలో టెక్నీషియన్ ఎం. వెంకటపతి,(నమూనా సహాయకుడు ఎం. రమేష్,ఏ. మహేష్ లు ఉన్నారు.

## భూభారతి చట్టం రైతులకు గొప్ప వరం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైతులకు భూభారతి చట్టం గొప్ప వరమని భూభారతి చట్టం రూపకర్త, రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమీషన్ సభ్యుడు ఎం.సునీల్ అన్నారు. గురువారం స్థానిక రైతు వేదికలో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. రైతులు తమ పని తాము చేసుకోవడం కాదని, చట్టాల గురించి తెలుసుకోవాలని, సాగురంగంలో చట్టాల పాత్ర పెరుగుతుందని, చట్టాలు వినియోగించుకుంటే ఏరువాక సాఫీగా సాగుతుందని ఆయన అన్నారు. అనంతరం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌లు లీవ్స్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రైతులకు ఏమైనా సమస్యలు ఏర్పడితే అధికారుల దృష్టికి తీసుకురావాలని, భూభారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, వ్యవసాయాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# అందుబాటు ధరలో ఇసుక

మిర్యాలగూడలో సాండ్ బజార్ ప్రారంభం : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఇసుక అక్రమ దందాను అరికట్టి అందుబాటు ధరలో కావాల్సినంత ఇసుక అందుబాటులో ఉంచేందుకు సాండ్ బజార్‌ను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని చింతపల్లి ఎక్స్ రోడ్డు వద్ద తెలంగాణ రాష్ట్ర మైనింగ్‌శాఖ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాండ్ బజార్‌ను గురువారం రాష్ట్ర మైనింగ్‌శాఖ ఎండి, వైస్ ఛైర్మన్ భవేష్‌మిశ్రా, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌లతో కలిసి ప్రారంభించారు. చింతపల్లి ఎక్స్‌రోడ్డులోని నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిలో అందరికి అందుబాటులో కావాల్సినంత ఇసుక లభ్యమయ్యేలా ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోనే హైద్రాబాద్ తరువాత మొట్టమొదటి సారిగా మిర్యాలగూడలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక అక్రమ దందా అరికట్టడంతోపాటు సామాన్యులకు అందుబాటు ధరలో ఇసుకను ఉంచేందుకు సాండ్ బజారను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. టన్నుకు రూ.1250 చొప్పున కావాల్సినంత ఇసుక అందుబాటులో ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇంకా తక్కువ ధరకే ఇసుక అందించేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పేదల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తక్కువ ధరకు ఇసుకతోపాటు స్థానిక సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యాలతో మాట్లాడి బస్తాకు రూ.50 చొప్పున తగ్గింపు ధరలో అందించనున్నట్లు తెలిపారు. ఇటుకలు కూడా మార్కెట్ రేట్ కంటే ఒక రూపాయి తక్కువకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్ హరిబాబు, నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, మైనింగ్ ఏడీ జాకోబ్, తహసీల్దార్ సురేష్‌కుమార్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మా భూమిని మాకు ఇప్పించండి

మంత్రి చెప్పినా స్పందించరా?

కలెక్టరేట్ ఎదుట రైతు కుటుంబం కంటతడి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మా భూమిని మాకు ఇప్పించండని ఓ రైతు కుటుంబం అధికారులను వేడుకుంది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి తమ గోడు చెప్పినా అధికారులు స్పందించకపోవడంపై తమకు న్యాయం చేయాలంటూ గురువారం జిల్లా కలెక్టరేట్ ఎదుట రైతు కుటుంబం కంటతడి పెడుతూ ఆందోళనకు దిగింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఆత్మకూర్ ఎస్ మండలంలోని కోటపహాడ్ గ్రామంలో 209, 210 సర్వే నంబర్లలో పదేండ్ల క్రితం 830 గుంటల భూమిని తాము కొనుగోలు చేసి మూడెకరాల చొప్పున పట్టాలు చేసుకున్నామని బాధిత రైతు గడ్డం సత్యనారాయణ రెడ్డి, ఆయన భార్య సులోచన, కుమారుడు హరీష్‌లు మీడియాకు తెలిపారు. గత ఏనిమిదేండ్లుగా ఖబ్జాలో ఉండి సాగు చేసుకున్నామని, గత రెండు సంవత్సరాలుగా గ్రామానికి చెందిన కొందరు పెద్దలు ఎలాంటి ఆధారాలు లేకుండా భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తమ భూమిలో 30 గుంటల వరకు దున్నుకున్నారని దీనిపై తాము వారిని ప్రశ్నిస్తే దాడి చేశారని, ఇదే విషయం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం తమ భూమిలోకి వెళ్ళేందుకు దారిలేదంటూ అడ్డుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్ళామని చెప్పారు. ఇదే విషయము జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు, జిల్లా ఎస్‌పికు ఫిర్యాదు చేశామని తెలిపారు. అయినా ఎవరూ స్పందించలేదని ఇప్పటికైనా మా భూమిని మాకు చెందేలా చర్యలు తీసుకొని బాధ్యులను చట్టపరంగా శిక్షించాలని వేడుకున్నారు.

# రూ. 10వేల వేతనం అమలు చేయాలని ధర్నా

ఎంఇఒకు ఎఐటియుసి వినతి




**ప్రజాపక్షం/డిండి:** ఎఐటియుసి రాష్ట్ర కమిటి పిలుపులో భాగంగా మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలపై గురువారం డిండి ఎంఇఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం ఎంఇఒకు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వంట కార్మికులు గత 22 సంవత్సరాల నుండి విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తున్నారని, వారి జీవితాలు మాత్రం నెలల తరబడి ఎక్కడ వేసిన గొంగడి అక్కడ అన్నట్లుగానే ఉందని ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించే విషయంలో నత్తనడకగా వ్యవహరిస్తుందని ఆయన అన్నారు. వంట బకాయిలు 4, 5 నెలల బిల్లులు, జీతాలు చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వ హామీలో భాగంగా రూ. 10వేల వేతనం ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యాలను కల్పించాలని, కోడిగుడ్లను, వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రతి విద్యార్థికి తరగతితో సంబంధం లేకుండా రోజుకు 25 రూపాయలు చెల్లించాలని, ప్రతి నెల 5వ తేది వరకు జీతాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత, అధికారుల, రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈనెల 25న జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షులు లింగమయ్య, సహాయ కార్యదర్శి జవహర్‌లాల్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మయ్య, అలివేలు, తబిత, ఎల్లమ్మ, వెంకటమ్మ, పద్మ, జంగమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎసిబికి పట్టుబడిన ఇరిగేషన్ డిఇ



**ప్రజాపక్షం/ఉండవెల్లి:** నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న డిఈ శ్రీకాంత్ నాయుడు అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డాడు. వివరాల్లోకెళితే జోగులాంబ గద్వాల జిల్లాలోని అల్లంపూరు మున్సిపాలిటీ కేంద్రంలో ఆర్డీఎస్ ఇరిగేషన్ శాఖ డిఇ శ్రీకాంత్‌నాయుడు బాధ్యతలు నిర్వహించేవాడు. గురువారం కాంటాక్టు నుంచి రూ. 11000 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా ఎసిబి అధికారులకు పట్టుబడినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. కాంట్రాక్టర్ మెజర్మెంట్ రికార్డు నమోదు కోసం అదనంగా సొమ్ము అడిగినట్లు సమాచారం వినిపిస్తుంది.

## చేనేత సహకార సంఘాల బలోపేతానికి కృషి

హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలలో చేనేత వస్త్రాలను వినియోగించేలా జీవో జారీ చేసి విధిగా అమలుపరిచే బాధ్యత ఇరు ప్రభుత్వాలు తీసుకోవాలని బిజెపి మాజీ కేంద్ర మంత్రి సీనియర్ నాయకులు హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అభిప్రాయపడ్డారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆయన గురువారం యాదాద్రి జిల్లా భూదాన్ పోచంపల్లిని సందర్శించి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. సహకార సంఘంలో చేనేత వస్త్రాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేనేత రంగానికి కార్మికుల సంక్షేమం జీవనోపాధి కోసం బాపూజీ చేసిన త్యాగాన్ని కొనియాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ స్మారక భవనం నిర్మించి చేనేత పరిశ్రమ పటిష్ఠం చేసి చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు వస్తేనే బాపూజీకి నిజమైన నివాళిగా చేనేత దినోత్సవ ఆశయం నెరవేరుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నోముల గణేష్, బిజెపి రాష్ట్ర నాయకులు కర్నాటి ధనుంజయ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్, మాజీ ఎమ్మెల్యే పొన్నాల శ్రీరాములు, టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షులు భారత లవ కుమార్ పాల్గొన్నారు.

## బిసిలకు న్యాయం బిజెపితోనే సాధ్యం

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** బీసీలకు న్యాయం జరిగేది బిజెపితోనే అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు అన్నారు. భువనగిరిలోని ఎంఎన్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన పార్టీ జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి గెలుస్తుందని, బీసీ రిజర్వేషన్‌లకు మేము వ్యతిరేకం కాదన్నారు. మూసీ ప్రక్షాళనపై సీఎం రేవంత్ రెడ్డి మాటలు కేవలం ప్రగల్భాలు మాత్రమేనని ఆయన ఆరోపించారు. భువనగిరి ప్రజలు బీజేపీ పార్టీని ఆదరిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో ఇక్కడి ప్రాంతంలో బీజేపీకి భారీగా సీట్లు వస్తాయనే సంకేతాలు స్పష్టంగా ఉన్నాయన్నారు. యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ రాష్ట్రంలో యూరియాను బ్లాక్ మార్కెట్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం కేసుల్లో ఏ ఒక రాజకీయ నాయకుడిని అరెస్ట్ చేయరని చెప్పారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ రెండు ఒక్కటేనని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపి బూర నర్సయ్య గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జి.ప్రేమేందర్ రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు పాశం బాస్కర్, దాసరి మల్లేశం పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్

అధికారులకు నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఈ సంవత్సరపు స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా అధికారులను ఆదేశించారు. ఇందుకుగాను అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ముఖ్య అతిథి సందేశానికి ఆయా శాఖలు వారి ప్రగతికి సంబంధించిన నివేదికలను తక్షణమే ముఖ్య ప్రణాళిక అధికారికి అందజేయాలన్నారు. గురువారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్షించారు. గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం వేడుకలలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని చెప్పారు. ఆగస్టు 15న ఉదయం 9 గంటలకు పోలీస్ పరేడ్ మైదానంలో స్వతంత్ర దినోత్సవ వేడుకలు మొదలవుతాయని, ఎప్పటిలాగే ముఖ్య అతిథి జాతీయ పతాకావిష్కరణ, వందన స్వీకరణ, సందేశం, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శన, స్టాల్స్ తదితరాలు ఉంటాయని తెలిపారు .స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆయా శాఖలు వారి అభివృద్ధిని తెలిపే విధంగా శకటాలు,స్టాల్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ద్వారా జాతీయ సమైక్యత, దేశభక్తిని పెంపొందించే విధంగా పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. స్వతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరయ్యే అతిథులు, ప్రజలకు, విద్యార్థులకు అవసరమైన తాగునీరు ,టెంట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తదితర ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులు నిర్వహించాలని ఆదేశించారు అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, ఇన్చార్జి డిఆర్ఓ వై. అశోక్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** వైద్యులు ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం తుంగతుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపి, ఐపి రిజిస్ట్రేషన్ ఛాంబర్‌ను పరిశీలించి ఎన్ని రిజిస్ట్రేషన్లు అయ్యాయో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్కానింగ్, ఎక్స్‌రే రూములను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. కంటి పరీక్ష చేయు పరికరాలను చూసి అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని, రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సెల్యులైటిస్‌తో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బండ రామారాం గ్రామానికి చెందిన 35 సంవత్సరాల రమేష్‌ను, వెంపటి గ్రామానికి చెందిన 36 సంవత్సరాల వెంకన్నను పరామర్శించి వారికి అందుతున్న వైద్య చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్‌లో పరికరాల కొరత ఉందని వైద్యులు చెప్పగా తప్పక మంజూరి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. అలాగే కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాలను కూడా తనిఖీ చేసి వాటర్‌ప్లాంట్, డైనింగ్ రూమ్, కిచన్ రూమ్, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. ఖాన్ అకాడమీ ద్వారా బయోసైన్స్‌పై ఆన్‌లైన్ పాఠాలను పరిశీలించి 10వ తరగతి విద్యార్థులకు హిందీ, తెలుగు చదివించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి లక్ష్యానికి అనుగుణంగా విద్యలో రాణించాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు.

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన తడకమల్ల రాములమ్మ మూడు సంవత్సరాల క్రితం మరణించగా ఆమె భర్త వెంకన్న ఇటీవల మరణించడంతో వారి ఇద్దరు ఆడపిల్లలు అనాథలుగా మారారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన పెద్ద కుమార్తె ఉమకు ఇష్టమైన బిఎస్‌సి కోర్సు చెప్పిస్తామని, చిన్న కూతురు శ్రీజను కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 8వ తరగతిలో చేర్పించడంతోపాటు ఇందిరమ్మ ఇల్లును ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి నిల్వలను అడిగి తెలుసుకున్నారు. తహశీల్దార్ దయానంద్, ఎంపిడిఓ శశికుమార్, డిటిహెచ్ఎస్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఉపేందర్, దీప్తి, గౌతమ్, సూపరింటిండెంట్ నిర్మలకుమార్ పాల్గొన్నారు.


## దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం

రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** భూభారతి అమలులో భాగంగా రెవిన్యూ సదస్సులలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం అయన నల్గొండ ఆర్డీవో కార్యాలయంలో డివిజన్లోని తహసిల్దార్లు, డిప్యూటీ తహసిల్దారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లతో భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు .రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు, డీటీలు, ఆర్‌ఐలు, సీనియర్ అసిస్టెంట్లు, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## 11న తెలంగాణ పెన్షనర్ల మహా ధర్నా

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం పెన్షనర్ల సమన్వయ సమితి పిలుపు మేరకు హైదరాబాదులోని ఇందిరా పార్కు వద్ద 11వ తేదీ సోమవారం తెలంగాణ పెన్షనర్ల మహా ధర్నా నిర్వహించబడుతుందని , జిల్లాలోని పెన్షనర్లు అందరూ పాల్గొని ప్రభుత్వానికి నిరసన తెలియజేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నల్లగొండ జిల్లా శాఖ పిలుపునిచ్చింది.గురువారం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు నూకల జగదీశ్ చంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన మాదిరిగా పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రెండవ పీఆర్సీని 30 ఫిట్మెంట్ తో అమలుపరచాలని, పెండింగ్ లో ఉన్న 5 డి.ఏ లను వెంటనే చెల్లించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, రూ .398 వేతనంతో పనిచేసి రిటైర్ అయిన వారికి నోషనల్ ఇంక్రిమెంటు మంజూరీ చేసి పెన్షనరీ బెనిఫిట్స్ కు అనుమతించాలన్నారు. ఏప్రిల్ 2024 నుండి రిటైర్ అయిన పెన్షనర్లకు పెన్షనరీ బెనిఫిట్స్ ను వాయిదా పద్ధతిలో కాకుండా ఏక మొత్తంలో చెల్లించాలని, ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన నగదు రహిత హెల్త్ స్కీమును విధి విధానాలతో ఏర్పాటు చేసి వెంటనే అమలు పరచాలని ,ఒకటవ పేకమిషన్ ప్రకటించినట్లుగా 20 సంవత్సరాలకు పూర్తి పెన్షన్ ఇవ్వాలని,సివిపి మినహాయింపులను 15సంవత్సరాలకు బదులుగా 11 సంవత్సరాల మూడు నెలలకు తగ్గించాలని, పెన్షనర్లందరికీ ఆర్టీసీ బస్సుల్లో 50 రాయితీ ఇవ్వాలని, మెడికల్ రీయింబర్స్మెంట్ బకాయిలను, జీపిఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలని , పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం పెన్షనర్ల డైరెక్టరేట్ ను ఏర్పాటు చేయాలన్నారు. ఈసమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు కుకుడాల గోవర్ధన్, జిల్లా కోశాధికారి యండి.అబ్దుల్ ఖాదర్, రాష్ట్ర కమిటి సభ్యులు శ్రీమతి వనం వాణిశ్రీ, వాడపల్లి రమేష్, డివిజన్ కార్యదర్శి బిక్షమయ్య పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## లోయలోకి దూసుకెళ్లిన సిఆర్‌పిఎఫ్ వాహనం : ముగ్గురు జవాన్లు మృతి

**ఉధంపూర్:** జమ్మూ శశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో గురువారం ఘోర ప్రమాదం జరిగింది. కద్వా బసంత్‌గఢ్ ప్రాంతంలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) సిబ్బందిని తీసుకెళ్తున్న వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న లోయలోకి దూసుకెళ్లింది. అధికారుల సమాచారం మేరకు, ఈ ప్రమాదంలో ముగ్గురు జవాన్లు మరణించగా, 15 మంది గాయపడ్డారు. 187వ బెటాలియన్‌కు చెందిన జవాన్ల బృందం బసంత్ ఘర్ నుండి తిరిగి వస్తుండగా ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది హుటాహుటినా సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పుతిన్ భారత పర్యటన

### తేదీలు ఖరారు కాలేదు!
### విశ్వసనీయ వర్గాల స్పష్టీకరణ



**న్యూఢిల్లీ:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈనెలాఖరులో భారత్ పర్యటనకు వస్తున్నారన్న వార్త నిరాధారమైనవని తెలుస్తోంది. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో వచ్చిన వార్తల ప్రకారం, పుతిన్ పర్యటన ఈ ఏడాది ఉండవచ్చు. కానీ, ఈనెలాఖరున పర్యటించబోతున్నారని వస్తున్న వార్తల్లో ఎంతమాత్రం నిజం లేదు. ఆయన పర్యటనకు తేదీలను ఖరారు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. రష్యా పర్యటనలో ఉన్న భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరుపుతున్నారు. రష్యాతో వాణిజ్య సంబంధాలు, ముడి చమురు కొనుగోళ్లు, అమెరికా విధిస్తున్న అదనపు టారిఫ్‌లు వంటి అంశాలపై రష్యా నేతలతో ధోవల్ చర్చిస్తారని సమాచారం. అదే విధంగా రెండు దేశాల మధ్య రక్షణ, భద్రతా భాగస్వామ్యం అంశాలపై కూడా ఇరు దేశాలు దృష్టి పెట్టాయని తెలుస్తోంది. ఎస్400 సిస్టమ్స్ అంశంలో రష్యాతో ఆయన చర్చించనున్నారు. ప్రస్తుతం ఇండియా వద్ద మూడు ఎస్400 డిఫెన్స్ సిస్టమ్స్ ఉన్నాయి. ఇలావుంటే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ త్వరలోనే పుతిన్ కూడా భేటీ కానున్నారు. ఆ ఇద్దరి భేటీకి వేదికను ఖరారు చేసినట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. భేటీకి సంబంధించిన వేదికను రెండు దేశాలు అంగీకరించినట్లు తెలుస్తోంది. అమెరికా దౌత్యవేత్త స్టీవ్ విట్‌కాఫ్ ఇటీవల మాస్కోలో పర్యటించారు. ఆయన పర్యటన తర్వాత ఇద్దరు అగ్రనేతలకు చెందిన మీటింగ్‌పై అంగీకారం కుదిరినట్టు చెప్తున్నారు. ఈ భేటీకి ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీని కూడా ఆహ్వానించాలని అమెరికా భావిస్తున్నది. కానీ, ఈ వార్తపై రష్యా స్పందించలేదు.

## మోదీ చైనా పర్యటనపై సర్వత్రా ఆసక్తి

**న్యూఢిల్లీ:** షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనడానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ చైనాకు వెళ్లనుండడంపై సర్వత్రా ఆసక్తి వ్యక్తమవుతున్నది. ఈనెల 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరిగే ఎస్‌సిఒ సమావేశాల్లో ప్రధాని పాల్గొంటారు. 2019 తర్వాత ప్రధాని చైనాలో పర్యటించడం ఇదే మొదటిసారి. 2020లో గల్వాన్ లోయలో ఘర్షణ తర్వాత మొదటిసారిగా చైనా పర్యటనకు భారత ప్రధాని వెళ్లడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మోదీ చైనాలోని తియాంజిన్‌ను సందర్శిస్తారు. రష్యానుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బ్రిక్స్ దేశాలను లక్ష్యంగా చేసుకొని భారీగా సుంకాలు విధిస్తున్న నేపథ్యంలో చైనా పర్యటనలో ఏఏ అంశాలు ప్రస్తావనకు వస్తాయన్నది కూడా ఉత్కంఠ రేపుతున్నది. ఎస్‌సిఒ సదస్సుకు హాజరయ్యేముందు మోదీ ఈనెల 30న జపాన్‌ను సందర్శించనున్నారు. టోక్యోలో జపాన్ ప్రధాని ఫ్యూమియో కిషిడాతో కలిసి. భారత – జపాన్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు. అక్కడి నుంచి ఆయన నేరుగా చైనా వెళ్తారని అధికార వర్గాలు తెలిపాయి.

### సర్‌పై పార్లమెంటు ఆవరణలో
# వరుసగా 12వ రోజు నిరసన

**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ సహా ఇండియా కూటమికి చెందిన పలువురు ఎంపిలు పార్లమెంట్ భవన సముదాయంలో వరుసగా 12వ రోజు కూడా నిరసనలు కొనసాగించారు. ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – ఎస్‌ఐఆర్)కు వ్యతిరేకంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ధర్మేంద్ర యాదవ్, టిఎంసికి చెందిన సాగరిక ఘోష్, అలాగే ఇతర విపక్ష పార్టీల ఎంపీలు బ్యానర్లు, పోస్టర్లు చేతబట్టి పార్లమెంట్ మకర్ ద్వార్ వద్ద గురువారం నినాదాలు చేస్తూ సర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



### ఓటర్ల ప్రజాస్వామిక హక్కును నిరాకరించడం ద్వారా...
# ‘ఇసి’ సిగ్గులేని పాత్ర పోషిస్తోంది

### లోక్‌సభలో టిఎంసి నేత
### అభిషేక్ బెనర్జీ ధ్వజం

**కోల్‌కతా :** లోక్‌సభలో తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ గురువారం ఎన్నికల సంఘం(ఇసి)పై తీవ్ర విమర్శలు చేశారు. పశ్చిమబెంగాల్‌లో నిజమైన ఓటర్ల ఓటు హక్కును తొలగించడంలో ఇసి రాజ్యాంగ తటస్థతను రాజీపడిందని, సిగ్గులేని పాత్రను పోషిస్తోందని ఆరోపించారు. ఆయన కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీ నివాసంలో విందులో పాల్గొనడానికి ఢిల్లీకి వెళ్లడానికి ముందు ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష నాయకులు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) ఓటర్ల జాబితాపై చర్చించి, ఉమ్మడి ఉపరాష్ట్రపతి అభ్యర్థి విషయమై చర్చించే అవకాశం ఉన్నదని తెలియజేశారు. బిజెపికి రాజకీయ ప్రయోజనం చేకూర్చేందుకు ఎన్నికల సంఘం తన రాజ్యాంగ సరిహద్దులను అతిక్రమించిందని బెనర్జీ ఆరోపించారు. ఎన్నికల సంఘం ఒక నిష్పాక్షికమైన సంస్థ అనే వాస్తవాన్ని అర్థం చేసుకోవాలని, పక్షపాతం లేని సంస్థ అనే విషయాన్ని ఎన్నికల సంఘం తప్పక గ్రహించాలని, అది రాజ్యాంగ పరిధిలో పనిచేయాలని అభిషేక్ బెనర్జీ హితవుపలికారు. ఎన్నికల సంఘం బిజెపి చేతిలో ఒక సాధనంగా మారిందని మండిపడ్డారు. ఇప్పుడు ఇసి సిగ్గులేని పాత్రను పోషించి గత మూడు నెలల కాలం నుంచే నిజమైన ఓటర్ల ఓటు హక్కును లాక్కునే పనిలో నిమగ్నమై, వారు పనిచేసే ప్రభుత్వాన్ని పనిచేయనివ్వరనే విషయం స్పష్టమవుతున్నదని చెప్పారు. పశ్చిమబెంగాల్ ఎన్నికలు ఇంకా 10 నుంచి 11నెలల సమయం ఉందనగానే ఇసి అతిగా ఆలోచిస్తున్నదని ధ్వజమెత్తారు. పశ్చిమ బెంగాల్‌లోని నిజమైన బెంగాలీలు తమ ఓటు హక్కును వినియోగించుకోకుండా ఉండటానికి ఎన్నికల సంఘాన్ని ఉపయోగించుకుంటున్నారని కేంద్ర ప్రభుత్వంపై బెనర్జీ నిప్పులు చెరిగారు. ఇటీవలి వివాదంపై అభిషేక్ బెనర్జీ స్పందిస్తూ ‘నిన్న బిహార్‌లో డొనాల్డ్ ట్రంప్ పేరుతో ఒక నివాస ధృవీకరణ పత్రం జారీచేయబడిందనే ఒక నివేదిక నేను చూశాను.. మీరు మాపై ప్రశ్నలు వేయడానికి బదులుగా ఎన్నికల సంఘాన్ని అడగాలి’ అని టిఎంసి నేత అభిషేక్ బెనర్జీ విలేకరులకు సూచించారు.



## చీనాబ్, అంజి వంతెనల నిర్మాణంలో పర్యావరణానికి హాని కలిగించకుండ జాగ్రత్తలు

**న్యూఢిల్లీ :** చీనాబ్, అంజి వంతెనల నిర్మాణంలో హిమాలయ పర్యావరణానికి స్వల్ప స్థాయిలోనే భంగం కలిగించేలా జాగ్రత్తలు తీసుకున్నట్లు ప్రభుత్వం లోక్‌సభకు తెలిపింది. హిమాలయ పర్యావరణానికి కనీస భంగం కలిగించడానికి, వాలు స్థిరీకరణకు తగిన జాగ్రత్తలు తీసుకున్నారని, ఉధంపూర్–శ్రీనగర్–బారాముల్లా రైల్ లింక్, చీనాబ్ , అంజి వంతెనల నిర్మాణం కోసం అత్యుత్తమ సంస్థలను రంగంలోకి దించినట్లు బుధవారం లోక్‌సభకు తెలిపారు. పెళుసుగా ఉండే హిమాలయ ప్రాంతాల్లో చీనాబ్ , అంజి ఖాద్ వంతెనల పర్యావరణ ప్రభావిత అంచనా నివేదికలను ప్రభుత్వం నిర్వహించిందా అని అడిగిన ప్రశ్నలకు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రాజెక్ట్ పర్యావరణ ప్రభావిత అంచనా నివేదికలపై విస్తృతమైన సమాధానం ఇచ్చారు. మొత్తం 272 కిలోమీటర్ల పొడవు గల ఉధంపూర్–శ్రీనగర్–బారాముల్లా రైల్ లింక్ ప్రాజెక్ట్ ఇటీవల ప్రారంభమైందని, ఇది జమ్మూ మరియు కాశ్మీర్లోని ఉధంపూర్, రియాసి, రాంబన్, శ్రీనగర్, అనంతనాగ్, పుల్వామా, బుద్గాం ,బారాముల్లా జిల్లాలను కలుపుతుందని వైష్ణవ్ తెలిపారు.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on X SCRailwayIndia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

ఇ-టెండరు నోటీసు నెం.GNT/SG/36/343. తేదీ: 04.08.2025 PUB/0950

క్రింద పేర్కొన్న పనుల కోసం కింది సంతకందారు **తేదీ: 26.08.2025న 16:00 గంటల** వరకు ఇ-టెండర్లను ఆహ్వానించడమైనది.

**ID. నం. 344, పని పేరు:** గుంటూరు డివిజన్‌లోని NRDP- VLG మధ్య LC నం.13 @ కి.మీ.27/3-4 వద్ద మిడ్-సెక్షన్ LC గేట్ యొక్క ప్రతిపాదిత ఇంటర్‌లాకింగ్‌కు సంబంధించి సిగ్నలింగ్ ఏర్పాట్లు, **ప్రకటించిన టెండర్ విలువ (రూ.):** 63,57,588.60, **ఇఎండి/బిడ్-సెక్యూరిటీ (రూ.):** 1,27,200.00, **టెండర్ డాక్యుమెంట్ ధర (రూ.):** లేదు

**1.** టెండర్లు తెరిచే తేదీ తరువాత సెలవు దినంగా ప్రకటించబడితే, టెండర్లు తదుపరి పని దినాన నిర్ణీత సమయంలో తెరవబడతాయి.

**2.** ఇ-బిడ్లను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి చివరి తేదీలు: 26.08.2025 నుండి 16:00 గంటల వరకు. వివరణాత్మక సమాచారం కోసం **www.ireps.gov.in** వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వండి.

**3.** ఏదైనా తదుపరి కమ్యూనికేషన్ / దిద్దుబాటు ఇ-పోర్టల్ **www.ireps.gov.in** ద్వారా మాత్రమే తెలియజేయబడుతుంది.

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్ / గుంటూరు

ఇ-టెండరు నోటీసు నెం. 470/DRM/W/GNT PUB/0951

క్రింద పేర్కొన్న పనుల కోసం **04.09.2025న 15:30 గంటల** వరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నది.

**క్ర.సం. 1, టెండర్ ఐడి:** 2804, **సీనియర్ డిఇఎం / డిఇఎం:** కో-ఆర్డినేషన్, **పని వివరణ:** గుంటూరు డివిజన్ 5 సంవత్సరాల పాటు ఏజెన్సీ (RDSO ఆమోదించబడిన సంస్థ మాత్రమే) ద్వారా 164 వంపులలో (ఎలక్ట్రానిక్ రకం) ట్రాక్ మౌంటెడ్ ఆటోమేటిక్ గేజ్ ఫేస్ లూబ్రికేటర్ల సరఫరా, సంస్థాపన, కమిషన్ మరియు నిర్వహణ., **సుమారు విలువ (రూ.):** 22,41,85,442.00, **బిడ్ సెక్యూరిటీ (రూ.):** 12,70,900.00

**1.** ఆన్‌లైన్‌లో ఇ-బిడ్లను సమర్పించడానికి చివరి తేదీ: 04.09.2025న 15:30 గంటల వరకు. వివరణాత్మక సమాచారం కోసం **www.ireps.gov.in** వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వండి.

**2.** ఏవైనా తదుపరి సమాచారం / సవరణలు ఇ-పోర్టల్ **www.ireps.gov.in** ద్వారా తెలియజేయబడతాయి.

డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్)/గుంటూరు

ఇ-టెండరు నోటీసు నెం. 17-2025-26 _Sr.DEE _Tr _HYB, తేది:06.08.2025 PUB/0952

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ **DEE/TR/HYB, టెండర్ నంబర్: 17-2025-26 _Sr _DEE _Tr _HYB, తేదీ: 06.08.2025, ముగింపు తేదీ: 28.08.2025, 15:00 గంటలకు** ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు. బిడ్డర్లు తమ అసలు/సవరించిన బిడ్లను ముగింపు తేదీ మరియు సమయం వరకు మాత్రమే సమర్పించగలరు. ఈ టెండర్‌కు వ్యతిరేకంగా మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు మరియు అటువంటి మాన్యువల్ ఆఫర్లు స్వీకరించబడిన ఏవైనా విస్మరించబడతాయి.

**క్ర.సం.** 1, **పని వివరణ: టెండర్ నెం. 17-2025-26 _Sr _DEE _Tr _HYB:** హైదరాబాద్ డివిజన్: MBNR-GWD, GWD-DHNE & MOB-MUE విభాగంలో SCADA వ్యవస్థల కోసం సైబర్ భద్రతా ఫీచర్ ఏర్పాటు., **సుమారు ధర (రూ.):** 1,93,93,080.00, **ఇఎండి (రూ.):** 2,47,000.00, **పూర్తి వ్యవధి:** 06 నెలలు, **ముగింపు తేదీ:** 28.08.2025

టెండర్ యొక్క పూర్తి వివరాలను చూడగలిగే నోటీసు బోర్డు స్థానం: **సీనియర్ DEE/Tr/HYB, కార్యాలయం, హైదరాబాద్ భవన్, సికింద్రాబాద్ - 500025.**

మరిన్ని వివరాల కోసం మా వెబ్సైట్ **www.ireps.gov.in** ని సందర్శించండి

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ట్రాక్షన్)/ సికింద్రాబాద్

A1178

మరిన్ని టెండర్ నిబంధనలు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.


# అమెరికావి ద్వంద్వ ప్రమాణాలు

### మనం కూడా 50 శాతం సుంకం విధించాలి
### కాంగ్రెస్ ఎంపి శశిథరూర్



**న్యూఢిల్లీ:** రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్నారంటూ భారత్‌పై అమెరికా 50 శాతం సుంకం విధించడం దారుణమని కాంగ్రెస్ ఎంపి శశి థరూర్ అన్నారు. టారిఫ్‌ల విషయంలో అమెరికా ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నదని విమర్శించారు. డొనాల్డ్ ట్రంప్ నిర్ణయానికి సమాధానంగా, భారత్ కూడా అమెరికా నుంచి దిగుమతయ్యే వస్తువులపై 50 శాతం అదనపు సుంకాలు విధించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాలు రష్యా నుంచి క్రూడ్ ఆయిల్ దిగుమతి చేసుకుంటున్నాయని ఆయన సోషల్ మీడియా వేదికగా చేసిన పోస్టులో గుర్తుచేశారు. ఉదాహరణకు భారత్ కంటే చైనా ఎక్కువగా రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్నదని పేర్కొన్నారు. అయితే, చైనాకు మినహాయింపులిచ్చిన అమెరికా, భారత్‌పై మాత్రం సుంకాలు విధిస్తునే ఉందని అన్నారు. టంప్ తీసుకున్న ఈ నిర్ణయం అమెరికాలో భారతీయ ఉత్పత్తుల కొనుగోళ్లను తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం కూడా అమెరికా దిగుమతులపై ప్రతీకార చర్యలు తీసుకోవాలని శశి థరూర్ అభిప్రాయపడ్డారు. మన దేశం దాదాపు 90 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను అమెరికాకు ఎగుమతి చేస్తున్నదని, అలాంటి సమయంలో అధిక దిగుమతి సుంకాలు విధిస్తే, మన ఉత్పత్తులను కొనేందుకు ఎవరూ ఆసక్తి చూపరని శశి థరూర్ వివరించారు. అలాంటి పరిణామం తప్పనిసరిగా భారత ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. భారత్ కూడా తగిన రీతిలో స్పందించి, అమెరికాకు దీటైన సమాధానం ఇవ్వాలని అన్నారు.

## ఒడిశా మాజీ మంత్రి బిభూతి భూషణ్ సింగ్ మృతి

**భువనేశ్వర్ :** ఒడిశా మాజీ మంత్రి, శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ బిభూతి భూషణ్ సింగ్ మర్దరాజ్ (70) మరణించారు. ఆయన కుటుంబం ఈ విషయాన్ని వెల్లడించింది. 70సంవత్సరాల వయసున్న బిభూతి భూషణ్ సింగ్ మర్దరాజ్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. పూర్వ ఖండపాడ రాజకుటుంబానికి చెందిన మర్దరాజ్ గురువారం మధ్యాహ్నం 1230గంటలకు ఇక్కడి ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సమయంలో తుది శ్వాస విడిచారు. బిభూతి భూషణ్ సింగ్ మర్దరాజ్ మృతిపట్ల ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ తన తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. ‘మాజీ ఒడిశా మంత్రి, ఒడిశా అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసిన బిభూతి భూషణ్‌సింగ్ మర్దరాజ్ మృతి విచారకరం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పూరీ జగన్నాథుడిని నేను ప్రార్థిస్తున్నాను. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేస్తున్నాను. ‘ఓంశాంతి’ అని మాఝీ తన ఎక్స్ పోస్ట్‌లో తెలిపారు. ఒడిశా రాష్ట్రం ఖండపాడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బిభూతి భూషణ్‌సింగ్ మర్దరాజ్ 1980,1985,1995లో మూడుసార్లు శాసనసభ్యుడుగా ఎన్నికయ్యారు.ఒడిశా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా 1996 నుంచి 2000వరకు కొనసాగారు. ఆయన కుమారుడు సిద్ధార్థ్ శేఖర్ సింగ్ కూడా ఒడిశా రాష్ట్ర శాసనసభకు 2009లో బిజెడి పార్టీ అభ్యర్థిగా పోటీచేసి ఎన్నికయ్యారు. కాగా మర్దరాజ్‌ను కడసారి సందర్శించుకునేందుకు అన్ని వర్గాల ప్రజలు హాస్పిటల్‌కు తండోపతండాలుగా తరలివచ్చి నివాళులు అర్పించారు.

# గతంలో పార్లమెంటు చర్చించింది

### ఇసి వ్యవహారంలో రిజుజు తప్పుదోవ పట్టిస్తున్నారు: గొగోయ్



**న్యూఢిల్లీ:** ఎన్నికల సంస్కరణలు, ఈసీ పనితీరుపై చర్చించే చరిత్ర పార్లమెంటుకు ఉందని కాంగ్రెస్ గుర్తు చేసింది. ఎన్నికల సంఘం పనితీరు వంటి అంశాలను చట్టసభల్లో చర్చించే అనుమతి లేదంటూ తప్పుదోవ పట్టించేలా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడరని పేర్కొంది. ఎస్‌ఐఆర్‌పై పార్లమెంటులో చర్చకు డిమాండ్ చేస్తూ ఇండియా ఐక్య సంఘటన ఎంపీలు గురువారం పార్లమెంటు మకర ద్వారం వద్ద ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ లోక్‌సభ డిప్యూటీ నాయకుడు గౌరవ్ గొగోయ్ విలేకరులతో మాట్లాడుతూ ఈసీ వ్యవహారంలో పార్లమెంటును, దేశ ప్రజలను రిజిజు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. 19502012 మధ్య కాలంలో ఎన్నికలకు సంబంధించిన అనేక అంశాలపై చట్టసభల్లో చర్చలు జరిగాయని తెలిపారు. ఎన్నికల సంస్కరణలు, ఎన్నికల సంఘం పని తీరును చర్చించే దీర్ఘకాలిక, ద్వైపాక్షిక చరిత్రను పార్లమెంటు కలిగివుందని చెప్పారు. ప్రశ్నలకు ఈసీ సమాధానం ఇవ్వలేదని, ఇది ఏ మంత్రిత్వశాఖ పరిధిలోకి రాదు కాబట్టి ఏ మంత్రి సమాధానం ఇస్తారంటూ గత కొన్ని రోజులుగా ప్రభుత్వం వాదిస్తోందని గొగోయ్ అన్నారు. ఇలాంటి చర్చ జరిగినప్పుడు న్యాయ మంత్రి సమాధానం ఇచ్చిన సందర్భాలు గతంలో చాలానే ఉన్నాయన్నారు. 1957లో, 1979లో, 1981లో, 2005లో, 2015లో చట్టసభల్లో ఎన్నికల అంశాలపై చర్చలు జరిగినట్లు గొగోయ్ తెలిపారు.

## జస్టిస్ వర్మకు సుప్రీంలో చుక్కెదురు

న్యూఢిల్లీ: తన ఇంట్లో భారీ మొత్తంలో నోట్లకట్టలు బయటపడిన కేసులో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తనపై నిర్వహించిన అంతర్గత దర్యాప్తు నివేదికను సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టేసింది. భారీ మొత్తంలో నగదు బయటపడటంతో ఆయనను తొలగించాలని ఆ నివేదిక సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ వర్మ పక్షాన వాదనలు వినిపించేందుకు సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ముకుల్ రోహత్గి హాజరయ్యారు. తాజాగా సుప్రీంకోర్టు నిర్ణయంతో పార్లమెంట్‌లో ఆయనపై అభిశంసన చేపట్టేందుకు మార్గం సుగమమైంది. జస్టిస్ వర్మను విధుల నుంచి తొలగించాలని నాటి సీజేఐ సంజీవ్‌ఖన్నా రాష్ట్రపతి, ప్రధానికి సిఫార్స్ చేశారు. తాజాగా జస్టిస్ వర్మ పిటిషన్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, ఏజీ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం వాదనలు విన్నది. అనంతరం జస్టిస్ వర్మ పిటిషన్‌ను సమర్థించలేమని తేల్చిచెప్పింది. ఆయన అంతర్గత కమిటీ విచారణలో పాల్గొన్న తీరు, ఆ తర్వాత కమిటీ సామర్థ్యాన్ని ప్రశ్నించడాన్ని తాము పరిగణనలోకి తీసుకొన్నట్లు పేర్కొంది. ఆయన రిట్ పిటిషనే విచారణకు అనర్హమని తేల్చింది. నాటి భారత ప్రధాన న్యాయమూర్తి, ఆయన ఏర్పాటుచేసిన అంతర్గత కమిటీ ఫొటోలు, వీడియోల అప్‌లోడ్ విషయంలో తప్పించి... మిగిలిన అంశాల్లో చట్టాన్ని పూర్తిగా అనుసరించిందని తేల్చిచెప్పింది. ఫొటోలు, వీడియోల విషయాన్ని జస్టిస్ వర్మ పిటిషన్ అభ్యంతరం చెప్పకపోవడంతో... దానిని పట్టించుకోమని ధర్మాసనం పేర్కొంది.

## జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలలో ఇడి సోదాలు

న్యూఢిల్లీ : జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలలో రూ. 750 కోట్ల విలువైన జిఎస్‌టి ‘నకిలీ’ ఇన్‌వాయిస్‌ల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కొత్తగా సోదాలు నిర్వహించిందని అధికార వర్గాలు తెలిపాయి. మూడు రాష్ట్రాల్లోని డజనుకు పైగా ప్రదేశాలలో ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్‌ఏ) కింద దాడులు నిర్వహించినట్లు ఆ వర్గాలు తెలిపాయి.ఈ కేసు జార్ఖండ్‌లో షెల్ కంపెనీలు, అనధికార ఆర్థిక మార్గాల ద్వారా రూ. 750 కోట్ల ‘నకిలీ’ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటిసి)లను సృష్టించిన దానికి సంబంధించినది. ఈ కేసులో ప్రధాన సూత్రధారి శివ కుమార్ దేవరా అరెస్టు తర్వాతడి దర్యాప్తు మొదలైంది. ఆయనను మే 2025లో అరెస్టు చేయగా, గత నెలలో చార్జిషీట్ దాఖలు చేశారని ఇడి వర్గాలు తెలిపాయి.

# ఓటర్ల హక్కులు హరిస్తున్న ఇసి

### ఎస్‌ఐఆర్ ముసుగులో ఎన్‌ఆర్‌సీకి కుట్ర
### అధికారుల తొలగింపు తగదు : మమతా బెనర్జీ



**కోల్‌కతా:** ఎన్నికల సంఘం నిసిగ్గుగా ఓటర్ల ప్రజాస్వామిక హక్కులను హరిరిస్తోందని తృణమూల్ కాంగ్రెస్ విమర్శించింది. ఎస్‌ఐఆర్ ముసుగులో ఎన్‌ఆర్‌సీ అమలునకు కుట్ర జరుగుతోందని ఆరోపించింది. రాజ్యాంగబద్ధ తటస్థతతో రాజీపడుతూ బెంగాల్ ప్రజల న్యాయమైన హక్కు నిరాకరిస్తోందని పేర్కొంది. తన పరిధికి మించిన వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటోందని దుయ్యబట్టింది. బెంగాల్ 2026లో ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. అయితే విధుల నిర్వహణలో వైఫల్యం, రెండు జిల్లాల్లో ఓటర్ల జాబితాలలో లోపాలను చూపుతూ నలుగురు అధికారులను ఈసీ తొలగించడాన్ని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, అధికారులందరికీ తమ ప్రభుత్వ అండ ఉంటుందన్నారు. ఎన్నికల తేదీ ప్రకటించినప్పటి నుంచి చర్యలు తీసుకునే అధికారం ఈసీకి ఉంటుందని, అందుకు ఇంకా చాలా సమయం ఉందని అన్నారు. మమత గురువారం రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతూ ఎన్నికల సంఘం తీరును తప్పుపట్టారు. రాజ్యాంగంలోని ఏ నిబంధన ప్రకారం అధికారులను సస్పెండ్ చేశారని ఈసీని నిలదీశారు. ఎన్‌ఆర్‌సీ పేరిట ఎవరిపైనైనా చర్యలు తీసుకోగలమని అనుకుంటున్నారా అంటూ మండిపడ్డారు. ఎస్‌ఐఆర్ ముసుగులో ఎన్‌ఆర్‌సీని గుట్టుగా అమలు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల జాబితాల నుంచి ఓటర్ల పేర్ల తొలగింపునకు కుట్ర జరుగుతోందని, ప్రతి ఒక్కరు తమ పేర్లు మళ్లీ నమోదు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ‘నా లాంటి చాలా మంది వద్ద జనన ధ్రువీకరణ పత్రాలు ఉండవు. అనేక మంది ఇళ్లలోనే పురుడు పోసుకుంటారు. లేదంటే ప్రకృతి విపత్తుల్లో ధ్రువీకరణ పత్రాలను కోల్పోయి ఉండవచ్చు. వీరిందరి పత్రాలు చట్టాలు రూపొందించే వారి వద్ద ఉంటాయా’ అని మమత వ్యాఖ్యానించారు. మాతృభాష అనేది ప్రతి ఒక్కరికి గర్వకారణమని, బెంగాలీ మాట్లాడుతున్న కారణంగా తమ రాష్ట్రానికి చెందిన వలస కార్మికులు ఇతర రాష్ట్రాల్లో వేధింపులను ఎదుర్కొంటున్నారని, రెండు వేలకు పైగా మందిని స్వస్థలాలకు చేర్చినట్లు తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడేవారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, కొందరు ంగ్లాదేశ్‌లోకి నెట్టబడుతున్నారని, మైన్మార్ నుంచి వచ్చిన రోహింగ్యాలుగా ముద్ర వేయబడుతున్నారని, ఇదంతా డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల కుట్ర అంటూ హర్యానా, ఉత్తరప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో పరిస్థితిని ఆక్షేపించారు. దేశ జాతీయ గీతం ‘జగ గణ మణ’ను బెంగాలీలోనే రాశారని, ఇప్పుడు ఇదే భాష ఉనికి ప్రశ్నార్థకమైందని అన్నారు. మాతృభాషలో మాట్లాడటం నేరమా? అక్రమ చొరబాటుదారులు ఉంటే తిప్పి పంచవచ్చు కానీ ఆ నెపంతో భారత పౌరులను వేధించడం సమంజసమా? అని ప్రశ్నించారు. పనితనాన్ని బట్టే బెంగాల్ కార్మికులకు ఇతర రాష్ట్రాల్లో ఉపాధి లభిస్తోందని, తమ రాష్ట్రంలో ఉన్న ఇతర రాష్ట్రాలకు చెందిన 1.5 కోట్ల మంది కార్మికుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఉత్తర బెంగాల్ వాసులకు అసోం ప్రభుత్వం నుంచి నోటీసులు అందాయని, ఇలాంటివి సహించేది లేదని తేల్చిచెప్పారు.

## బాధితుల చెంతకు రూ.23 వేల కోట్ల హవాలా సొమ్ము

### సుప్రీంకు తెలిపిన కేంద్రం

**న్యూఢిల్లీ:** మనీలాండరింగ్ నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఇప్పటివరకు రూ.23 వేల కోట్ల హవాలా సొమ్మును స్వాధీనం చేసుకుంది. ఆ మొత్తాన్ని ఆర్థిక నేరాల బాధితులకు చెల్లించినట్టు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలిపారు. దివాలా తీసిన భూషణ్ పవర్ అండ్ స్టీల్ లిమిటెడ్ (బీపీఎస్‌ఎల్) ఆస్తుల విక్రయానికి అనుమతినిస్తూ ఈ ఏడాది మేలో సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీన్ని సమీక్షించాలని అభ్యర్థనలు రావడంతో రివ్యూ పిటిషన్లపై విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా గురువారం విచారణ జరుగుతుండగా... ఓ న్యాయవాది మాట్లాడుతూ బీపీఎస్‌ఎల్‌పై ఈడీ కేసు గురించి ప్రస్తావించారు. దీనికి సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ బదులిస్తూ ‘ఇక్కడ కూడా ఈడీ ఉందా’ అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీనికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ ‘ఇక్కడో వాస్తవం చెప్పాలి. ఈ విషయాన్ని ఇంతవరకూ మేం ఏ కోర్టులోనూ చెప్పలేదు. ఇప్పటివరకు ఈడీ మనీలాండరింగ్ కేసుల దర్యాప్తులో భాగంగా రూ.23 వేల కోట్లను స్వాధీనం చేసుకుంది. ఆ మొత్తం దేశ ఖజానాలో ఉండదు. దాన్ని బాధితులకు ఈడీ చెల్లించింది’ అని వివరించారు. అయితే, ఈ కేసుల్లో శిక్షల రేటు ఎలా ఉందని సీజేఐ అడగ్గా... శిక్షలు పడిన సందర్భాలు తక్కువే అని ఎస్‌జీ కోర్టుకు తెలిపారు. ‘దోషులుగా తేలకపోయినా... విచారణ పేరుతో సంవత్సరాల పాటు మీరు వారికి శిక్ష వేస్తున్నారు కదా’ అని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది.

ప్రజాపక్షం
శుక్రవారం, 08 ఆగస్టు

# తదుపరి ఏమిటి ?

తెలంగాణలోని వెనుకబడిన తరగతులకు విద్య, ఉద్యోగాల్లో, స్థానిక సంస్థల్లో, (పంచాయతీరాజ్, పురపాలక సంస్థలు) (రాజకీయ పదవుల్లో) 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న విశ్వప్రయత్నం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ సహాయనిరాకరణ కారణంగా ముందుకు సాగటం లేదు. మరోవైపు సెప్టెంబర్ నెలాఖరులోపు పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికలు పూర్తిచేయాలని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశం వెనుక నుంచి తరుముతోంది. ఈ ఎన్నికలు ఇప్పటికే దాదాపు రెండు సంవత్సరాలు ఆలస్యం అయినాయి. ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామీణాభివృద్ధి సజావుగా సాగటంలేదు. రెండు, ఎన్నికైన పాలక వర్గాలు లేనందున గ్రామీణాభివృద్ధికి కేంద్రం ఇచ్చే ప్రణాళికా సంఘ నిధుల విడుదల నిలిచిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బిసిల రిజర్వేషన్ల పెంపుదలకు అవసరమైన ఆధారణీయ గణాంక సమాచారం కోసం కాస్ట్‌సర్వే 'కులగణన' నిర్వహించింది. ఆ గణాంకాల ప్రకారం బిసి రిజర్వేషన్‌లకు చట్టబద్ధత కోసం తెలంగాణ బిసిలు, (గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో సీట్ల రిజర్వేషన్) 'బిల్లు, 2025' 'తెలంగాణ బిసిలు, ఎస్‌సిలు, ఎస్‌టిలు (విద్యాసంస్థల్లో, రాష్ట్ర ఉద్యోగాల్లో నియామకాల్లో రిజర్వేషన్లు) బిల్లు, 2025లను శాసనసభల్లో 'ఏకగ్రీవం'గా (బిఆర్ఎస్, బిజెపి కూడా బలపరిచాయి) ఆమోదించింది, వాటిని 9 షెడ్యూల్లో చేర్చి రాజ్యాంగ రక్షణ కల్పించాలని కోరుతూ గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపింది. అలాగే స్థానిక సంస్థల్లో బిసి, ఎస్‌సి, ఎస్‌టి రాజకీయ రిజర్వేషన్లను 50శాతానికి పరిమితం చేస్తూ గతంలో కెసిఆర్ ప్రభుత్వం ఆమోదించిన చట్టం బిసిలకు రిజర్వేషన్ల పెంపుదలకు ఆటంకంగా ఉన్నందున, బిసి రిజర్వేషన్లను 42శాతానికి పెంచేందుకు ఆ చట్టాన్ని సవరిస్తూ తెచ్చిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదం కోసం పంపగా, ఆయన దాన్ని కూడా రాష్ట్రపతి పరిశీలన ఆమోదం కోసం పంపారు. మోదీ ప్రభుత్వం నుంచి స్పందన లేదు. రాష్ట్రపతి స్వయంగా చేయగలిగిందేమీ కాదు. అందువల్లనే కావచ్చు రేవంత్‌రెడ్డి ప్రతినిధివర్గానికి కలిసే అవకాశం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ, రాష్ట్రప్రభుత్వం తమ సమస్యను దేశ దృష్టికి తెచ్చేందుకు, తమ బిల్లుల క్లియరెన్స్‌కై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో 'పోరుబాట' పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేతో పాటు ఇండియా కూటమి నుంచి దాదాపు 70 మంది ఎంపిలు సంఘీభావం ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తదితరుల ప్రసంగాలు, మాటలు తూటాలు అలా ఉంచితే, ఈ సమస్య బిజెపి–కాంగ్రెస్ మధ్య రాజకీయ పోరాటం రూపం తీసుకుందని, అందువల్ల ఇప్పట్లో పరిష్కారం లభించబోదని సులభంగానే అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనకు అడ్డుపడటమే పనిగాపెట్టుకున్న బిఆర్ఎస్, బిజెపిలు ఇతర విషయాలతో పాటు ప్రభుత్వం 'కులగణన' చేపట్టిన నాటి నుంచీ పైకి బలపరుస్తున్నట్లు నటిస్తూ ఏదో వంక పెడుతూనే ఆరోపణలు సంధిస్తున్నాయి. తమ వెనుకనున్న బిసిలు కాంగ్రెస్ వెంట పోతారేమోనని బిఆర్ఎస్‌కు భయం. కుల గణనను జాతీయ నాయకత్వం వ్యతిరేకిస్తున్నందున ఇక్కడి బిజెపి నాయకులకు ఏం మాట్లాడాలన్నా బెదురు. దేశవ్యాప్తంగా ఒత్తిడి మూలంగా మోదీ ప్రభుత్వం 2026 జనగణనతో పాటు కులగణన చేపడతామని ప్రకటించటంతో రాష్ట్ర బిజెపి నాయకులకు నోరొచ్చింది. బిసి రిజర్వేషన్లకు తాము అనుకూలమే అని చెబుతూ ముస్లిం వ్యతిరేక కార్డు బయటకు తీసి అడ్డుపడుతున్నారు. గుజరాత్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో ముస్లిం బిసిలకు రిజర్వేషన్లు ఉన్నాయి కదా అనే ప్రశ్నకు సమాధానం చెప్పరు. బిసిలను దగా చేసేందుకు శాసనసభలో బిసి రిజర్వేషన్ బిల్లులను బలపరిచారు. బయటనేమో ప్రతిరోజూ కుశంకలు లేవదీస్తున్నారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు 10శాతం రిజర్వేషన్ సుప్రీంకోర్టు సమర్థించగా, లోగడ విధించిన 50శాతం లక్ష్మణ రేఖ చెరిగిపోయి రిజర్వేషన్లు 60 శాతానికి చేరాయి. ఆ రేఖ కారణంగానే మండల్ కమిషన్ రిజర్వేషన్లను 27శాతానికి పరిమితం చేసింది. మోదీ ప్రభుత్వం విజ్ఞతారహితంగా ఇప్పుడు తెలంగాణ బిసి రిజర్వేషన్లకు మోకాలడ్డినా, రేపు దేశవ్యాప్తంగా కులగణన తదుపరి ఏం చేయగలదు? 2029లో నరేంద్రమోదీని గద్దె దింపుతామన్న రేవంత్‌రెడ్డి అనవసర, అసమయోచిత సవాలుకు అదే ప్రాతిపదిక. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ముందున్న ప్రత్యామ్నాయం ఒక్కటే. స్థానిక సంస్థల ఎన్నికలను ఇంకా వాయిదా వేయకుండా (గ్రామస్వామ్యంలో ప్రజాస్వామ్య పాలనకు, అభివృద్ధికి అవరోధం). బిఆర్ఎస్, బిజెపి జిత్తులమారితనాన్ని ఎండగడుతూ ఎన్నికలకు వెళ్లటమే ఉత్తమం. 42శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత వచ్చేవరకు ఎన్నికలు వాయిదా వేయాలనే వారు అవకాశవాదులు, ప్రజాస్వామ్య వ్యతిరేకులుగా ప్రజల ముందు నిలబడతారు. బిసిల విశ్వాసం చూరగొనేందుకై కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థుల్లో 42శాతమే కాదు, అంతకుమించి బిసిలకు ఇచ్చి గెలిపించి పదవుల్లో కూర్చోబెట్టాలి. దీన్ని సవాలుగా తీసుకోవటం భవిష్యత్ రాజకీయ గమనానికి బాటవేస్తుంది. వైఎస్. రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం మున్సిపల్ చైర్మన్ పదవుల్లో 40శాతానికిపైగా మహిళలకు ఇచ్చిన రాజకీయ చాతుర్యం ఈ సందర్భంగా గుర్తుచేసుకోదగింది.

# కెసిఆర్‌పై పేలిన కాళేశ్వరం బాంబు




ఎస్‌కె. జకీర్
సీనియర్ జర్నలిస్ట్

కాళేశ్వరం కమిషన్ రిపోర్టు కెసిఆర్ పాలిట గరళమే. ఏ ప్రాజెక్టుతో ప్రపంచ ఖ్యాతి గడించినట్టు కెసిఆర్ భావించారో అదే ప్రాజెక్టు ఆయన ఖ్యాతిని పాతాళానికి తొక్కిపారవేసినట్లయిందని పరిశీలకులంటున్నారు.రాజకీయాల్లో గెలుపోటముల సంగతెలా ఉన్నా నాయకుడికి విశ్వసనీయత, నైతిక విలువలు అత్యంత ప్రధానమైనవి. 2001లో డిప్యూటీ స్పీకర్ పదవికి, నాటి అధికార పార్టీ టిడిపి ప్రాథమిక సభ్యత్వానికి, శాసనసభ్యత్వానికి రాజీనామా చేసిన కారణంగానే ప్రజల్లో కెసిఆర్‌కు విశ్వసనీయత లభించింది. 2014 నుంచి పదేండ్ల పాటు ముఖ్యమంత్రిగా పాలించిన కాలంలో జరిగిన పలు అవకతవకలలో కాళేశ్వరం ఒకటి. జస్టిస్ ఘోష్ కమిషన్ తమకు వ్యతిరేకంగా నివేదిక ఇచ్చినందున, అది కాంగ్రెస్ పార్టీ కమిషన్ అని కెసిఆర్ తరపున ఆయన పార్టీ నాయకులు గుప్పిస్తున్న ఆరోపణలు సాధారణ జనానికెక్కడం లేదు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో కాళేశ్వరం రిపోర్టుపై కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య భీకర పోరాటం జరగనుంది. కాళేశ్వరం తెలంగాణ జీవనాడి అని వాదించేందుకు కెసిఆర్ పార్టీ రెడీ అవుతోంది. ఇదొక ఫ్రీ ప్లాన్డ్ పథకమనీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెండాడబోతున్నారు. '7 బుర్జ్ ఖలీఫాలకు సరిపడా కాంక్రీటు, 15 ఈఫిల్ టవర్ల నిర్మాణానికి సరిపడా ఉక్కు, ప్రపంచంలో అతి పెద్దదైన గీజా పిరమిడ్ వంటి 6 పిరమిడ్ల పరిమాణంలో తవ్విన మట్టి, 72 గంటల్లో 25,584 ఘనపు మీటర్ల కాంక్రీటును పోసి గిన్నిస్ రికార్డ్ సృష్టించాం' అని మేడిగడ్డ బరాజ్ నిర్మాణ ఘనత గురించి దాని కాంట్రాక్టు సంస్థ ఎల్ అండ్ టీ అప్పట్లో చెప్పింది. ఈ ప్రాజెక్టులో గేట్ల బరువును ఆపే స్తంభాల వంటి నిర్మాణాలు (పీర్) ఒక్కొక్కటీ 110 మీటర్ల పొడవు, 46 మీటర్ల వెడల్పు, 25 మీటర్ల ఎత్తున కాంక్రీటుతో నిర్మించారు. ఇంత భారీగా కట్టిన పీర్‌లలో ఒకటి 2023 అక్టోబర్‌లో కుంగింది. ఇక అక్కడి నుంచి కాళేశ్వరం అనే 'పనికి మాలిన' ప్రాజెక్టు కేవలం రాజకీయ నాయకులు, అధికారులకు 'డబ్బు యంత్రం'లా మారినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. రాహుల్ గాంధీ, అప్పటి పిసిసి అధ్యక్షుడు, ప్రస్తుత సిఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించారు. 2023 చివర్లో రేవంత్ రెడ్డి రూపంలో సునామీ వచ్చేదాకా 'కెసిఆర్ కాశీ మజిలీ కథలు' జనం వింటూనే ఉన్నారు. రైతుబంధు, దళితబంధు, కెసిఆర్ కిట్స్, షాదీముబారక్, వంటి అనేక సంక్షేమ పథకాలు తెలంగాణలో సుడిగాలి వలే జనాన్ని చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఏమి జరుగుతుందో గ్రహించే లోపే జరగాల్సిన విధ్వంసం జరిగిపోయింది. కాళేశ్వరం భాగోతమంతా జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణలో తేటతెల్లమయింది. 'నేను డిజైన్ చేయలేదు. నాకు ఇంజినీరింగ్ భాషే రాదు. రాజకీయ నాయకులు స్ట్రాటజిస్టులే తప్ప డిజైన్ చేసేవాళ్లం కాదు. ప్రాణహిత చేవెళ్ల పథకాన్ని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో మొత్తం పెట్టిన ప్రాజెక్టుల కెపాసిటీ 14 టిఎంసిలు. ఒక పంపు పోస్తే మరో పంపు అందుకోవాలి. కరెంటు పోతే గోవిందా. వాళ్లకు నీరిచ్చే ఉద్దేశం లేదు. కానీ, మేం నీళ్లు తీసుకోవాలి. 14 టిఎంసిలు కాదు. రీ డిజైన్ చేయాలని అధికారులకు చెప్పాం. దటీజ్ స్ట్రాటజీ బై కెసిఆర్ బై ది గవర్నమెంట్. నీళ్లు రావాలని స్ట్రాటజీ చెప్పిన. కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్‌కోస్‌ను పిలిపించాం. వ్యాప్కోస్ కంప్లీట్‌గా సర్వే చేసింది. వారికి డబ్బులు పే చేశాం. తమ్మిడిహట్టి వద్ద తీసుకోవడం తప్పు అని సిడబ్ల్యుసి, వ్యాప్‌కోస్ రిపోర్ట్ ఇచ్చాయి. ఎక్కడ తీసుకోవాలంటే ప్రాణహిత తర్వాత తీసుకోవాలి. ప్రాణహిత గోదావరిలో కలిసిన తర్వాత తీసుకోవాలని మేడిగడ్డ వద్ద ప్లాను చేసాం. ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు, అన్నపూర్ణ, రంగనాయకసాగర్,మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్. ఈ క్రమంలో ప్రతి స్టేజీలో లక్షల ఎకరాల్లో నీళ్లు వస్తయ్.' అని కెసిఆర్ 2024 ఏప్రిల్‌లో ప్రముఖ న్యూస్ ఛానల్ లో మాట్లాడుతూ చెప్పారు.

దేశమంతా కాళేశ్వరం ప్రాజెక్టులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని నాలుగేళ్లుగా కోడై కూస్తూనే ఉన్నది. కాళేశ్వరం ప్రాజెక్టు కెసిఆర్ కుటుంబానికి ఎటిఎంలా మారింది. వేల కోట్ల అవినీతి జరిగింది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, అమిత్ షా, జేపీ నడ్డా అనేక సార్లు ఆరోపణలు చేశారు. కానీ బిజెపి ఈటల రాజేందర్ అందుకు భిన్నంగా కమిషన్ ఎదుట వివరణ ఇచ్చారు. ప్రజల నుండి, రైతుల నుండి వచ్చిన ఒత్తిళ్ల మేరకే ప్రాజెక్టు అంచనాలను పెంచారని ఈటల వాంగ్మూలం ఇచ్చారు. కాళేశ్వరంలో వేల కోట్ల అవినీతి జరిగిందని మొత్తుకున్న బిజెపి నాయకులు ఇప్పుడే ముఖం పెట్టుకుని మాట్లాడతారు? కాళేశ్వరం కెటిఆర్ కుటుంబానికి ఎటిఎంలా మారిందని పదేపదే ప్రచారం చేసిన ప్రధాని మోదీ, అమిత్ షా, నడ్డా ఇప్పుడేమంటారు? బిఆర్‌ఎస్‌తో బిజెపికి ఉన్న లోపాయికారీ ఒప్పందం మేరకే కెసిఆర్‌ను కాపాడేందుకు ఈటలతో వివరణ ఇప్పించారా? బిజెపి నాయకత్వం సమాధానం చెప్పాలన్న డిమాండ్ వస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నిస్సంకోచంగా విధానపరమైన, ఆర్థిక పరమైన అవకతవకలు జరిగాయని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ తేల్చింది. మేడిగడ్డ బరాజ్ కుంగడానికి, కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలకు మాజీ ముఖ్యమంత్రి కెసిఆరే కారణమని కమిషన్ నిర్ధారించింది.'పరిపాలన, ప్రణాళిక, సాంకేతిక, ఆర్థిక పరమైన అంశాలపై వ్యక్తిగత నిర్ణయాలకు తోడు నాటి రాజకీయ నాయకత్వం ప్రభావం చూపింది. దీనివల్ల పెద్దఎత్తున ప్రజాధనం దుర్వినియోగమైంది' అని జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక ప్రస్తావించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘన, ప్రజాధనం దుర్వినియోగం ఆరోపణలపై జ్యుడిషియల్ విచారణ చేసిన సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ ఘోష్ నివేదికను ఆగస్టు 4న తెలంగాణ కేబినెట్ ఆమోదించింది. మొత్తం 665 పేజీలతో కూడి నివేదికను జులై 31న జస్టిస్ పీసీ ఘోష్ ప్రభుత్వానికి సమర్పించారు.కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై కమిషన్ దాదాపు 16 నెలల పాటు అధ్యయనం చేసింది. తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు బరాజ్ నిర్మాణం మార్చడం పూర్తిగా తప్పు అని కమిషన్ తేల్చింది. 'నివేదికపై రానున్న రోజుల్లో అసెంబ్లీ, శాసన మండలి సమావేశాలు ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకున్నాక ప్రభుత్వం ముందుకు వెళుతుంది' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.చట్టసభల్లో చర్చించాక భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని, కమిషన్ తన నివేదికలో చేసిన సూచనలను అమలు చేస్తామని సిఎం చెప్పారు.

మరోవైపు ఈ ప్రాజెక్టు విషయంలో ఎటువంటి తప్పూ జరగలేదని బీఆర్ఎస్ ప్రకటించింది.'కాళేశ్వరం ప్రాజెక్టులో ఎలాంటి రహస్యం లేదు.అన్ని అంశాలు డిపిఆర్‌లో ఉన్నాయి.11 కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు ప్రాజెక్టును ఆమోదించాయి. ఒక ప్రాజెక్టుకు కావాల్సిన అన్ని అనుమతులు వచ్చాయి. మరి కమిషన్ ఎవరిని తప్పుబడుతుంది? కేంద్రం, అనుమతులు ఇచ్చిన ఏజెన్సీలను కమిషన్ తప్పుబడుతుందా?' అని హరీశ్ రావు ప్రశ్నించారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలు,కమిషన్ వక్రీకరణలు,వాస్తవాలు అనే అంశంపై హరీష్ రావు ప్రజంటేషన్ ఇచ్చారు. అయితే ప్రాజెక్టుకు సంబంధించిన అనేక తప్పులను కమిషన్ గుర్తించింది.తీవ్రవిమర్శలు చేసింది. అనేక లోటుపాట్లను ఎత్తి చూపింది. తీవ్రమైన ఆర్థిక అవకతవకలను, ప్రణాళిక లేకపోవడాన్ని, నిర్మాణంలో లోపాలు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ అసలు లేకపోవడాన్ని గుర్తించింది. కీలకమైన రాజకీయ నాయకులు, అధికారులు బాధ్యులని ఎత్తి చూపింది. ముఖ్యంగా అప్పటి ముఖ్యమంత్రి వ్యవస్థలను, ప్రొసీజర్లను పక్కన పెట్టి ప్రత్యక్షంగా ఎలా జోక్యం చేసుకుని,ప్రభుత్వ ఖజానాకు, బ్యారేజీల ప్రస్తుత స్థితికి కారకులయ్యారో తన నివేదికలో కమిషన్ వివరించింది. 'ప్రాణహిత చేవెళ్ళ సుజల స్రవంతిగా రూ. 38,500 కోట్ల అంచనా ఉండగా, కాళేశ్వరం ఖర్చు 2016 నాటికి రూ. 71,436 కోట్లకు పెరిగింది. తరువాత 2022 మార్చి నాటికి లక్షా 10 వేల 248 కోట్ల రూపాయలకు (1,10,248.48) పెరిగింది.ఈ మొత్తం ప్రాజెక్టు మితిమీరిన, బెరకులేని తీవ్రమైన ప్రొసీజరల్, ఆర్థిక పరమైన అవకతవకలతో నిండిపోయింది. వాప్కోస్ సంస్థకు ఇచ్చిన 6 కోట్ల 77 లక్షలు అధికారుల నుంచి వసూలు చేయాలి.మేడిగడ్డ బరాజ్ నిర్మాణంలో ఖర్చు పెట్టిన భారీ మొత్తాన్ని కుట్ర పూరితంగా స్వాహా చేయడంలో అధికార యంత్రాంగం, కాంట్రాక్టరు కలసి మెలసి పనిచేశార''ని నివేదిక వ్యాఖ్యానించింది.మొత్తంగా కాళేశ్వరం ప్రాజెక్టు ప్రజాధన దుర్వినియోగం చేసే సాధనంగా మిగిలింది. అంతేకాదు, పరిపాలన ప్రణాళిక,సాంకేతిక ముందుచూపు,ఆర్థిక క్రమశిక్షణ వంటి వైఫల్యం, వాటిలో అనవసరంలేని వ్యక్తిగత నిర్ణయాలు,రాజకీయ జోక్యం ఉన్నట్టు తేలిపోయింది.



బిఆర్ఎస్ పార్టీ తమ ఘన విజయాల్లో ఒకటిగా చెప్పుకునే కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన ఈ మేడిగడ్డ బరాజ్ సరిగ్గా ఎన్నికల ముందు కుంగడంతో చర్చ మొదలైంది. కాళేశ్వరం ఒక అద్భుతమని, ప్రపంచంలోనే పెద్దదని బిఆర్ఎస్ చెప్పుకుంటు వచ్చింది.ఈ ఒక్క బరాజ్‌కే సుమారు రూ.1850 కోట్లు ఖర్చు అయింది. 16 టిఎంసిల నీరు ఇందులో నిల్వ ఉండే ఏర్పాటు ఉంది. 85 గేట్లు ఉంటాయి. రెండేళ్లలోనే ఈ ప్రాజెక్టు పూర్తి చేసినట్టు నిర్మాణ సంస్థ ప్రకటించుకుంది. అదొక గొప్ప విషయంగా కూడా ప్రచారం చేశారు. ఎత్తిపోతలకు అయ్యే విద్యుత్తు చార్జీలు రూ.10,374.56 కోట్లు, నిర్వహణ ఖర్చులు రూ.272.70 కోట్లు కలిపి రూ. 10647.26 కోట్లు అవుతుందని కాగ్ నివేదిక స్పష్టం చేసింది. అయితే సుమారు లక్ష కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రాజెక్టుకు కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ ద్వారా తీసుకున్న రుణం రూ. 64.204.13 కోట్లుగా ఉన్నది.వడ్డీలు సకాలంలో చెల్లించకుండా వాయిదా వేయడంతో అదనంగా మరో రూ.19,556.4 కోట్ల వడ్డీ అసలులో కలిసింది. దీంతో అసలు రూ.87,369.89 కోట్లు అయింది. దీనికి వాయిదాలుగా ప్రతి ఏటా వడ్డీ, అసలు కింద రూ.10 వేల కోట్ల నుంచి 14 వేల కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుందని కాగ్ తెలిపింది. దీంతో ఈ ప్రాజెక్ట్ నిర్వహణ ప్రభుత్వానికి భారంగా మారనున్నది. పైగా ఈ ప్రాజెక్టుకు తెచ్చిన అప్పులు తీర్చడం కోసం కొత్త అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని కాగ్ హెచ్చరించింది. కాళేశ్వరం ప్రాజెక్టును ఆనాటి సిఎం కెసిఆర్ 2019 జూన్ 21న ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర, ఎపి సిఎంలను ఆహ్వానించారు. అట్టహాసంగా ప్రారంభించిన ఈ ప్రాజెక్ట్ బరాజ్‌లు అదే ఏడాది నవంబర్‌లో వచ్చిన వరదలకు దెబ్బతిన్నాయి. ఆర్‌సిసి వేసిన కోట్, సీసీ కర్టెన్ గోడలలో కొంత భాగం, దిగువ భాగంలో నిర్మించిన కాంక్రీట్ బ్లాక్‌లు కొట్టుకు పోయాయి. దీనివల్ల మేడిగడ్డ బరాజ్‌కు రూ.83.83 కోట్లు, అన్నారం 65.32 కోట్లు, సుందిళ్ల బరాజ్‌కు రూ.31.24 కోట్లు మొత్తంగా రూ.180.39 కోట్ల నష్టం వాటిల్లింది. కేవలం డిజైన్ లోపం, లోపభూయిష్టంగా చేపట్టిన పనుల కారణంగానే నష్టం జరిగిందని కాగ్ భావించింది.

కాగా ఘోష్ కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్‌లో కెసిఆర్ 'వాంగ్మూలాన్ని' స్థూలంగా చెప్పాలంటే అధికారులు,సాంకేతిక నిపుణులే అన్నింటికీ బాధ్యులు.ఆయన ముఖ్యమంత్రిగా ఆ ప్రాజెక్టు నిర్మించాలని మాత్రమే పూనుకున్నారు. కానీ ఆయన వాంగ్మూలానికి,జరిగిన వాస్తవాలకు చాలా తేడా ఉన్నది. కెసిఆర్‌కు తెలియకుండా కాళేశ్వరం ప్రాజెక్టులో చీమ కూడా కుట్టలేదు.అంతా తానే అయి 'పని పూర్తి చేశారు'. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కుడితిలో పడ్డ ఎలుకలా ఆయన పరిస్థితి మారిపోయింది.ఫోన్ ట్యాపింగ్,కాళేశ్వరం వంటి పలు కేసులు కెసిఆర్‌ను వెంటాడుతున్నవి.ఆయన, ఆయన పార్టీ పూర్తిగా ఆత్మరక్షణలో పడిపోయింది.అటు తన కూతురు ఎమ్మెల్సీ కవిత, పార్టీకి పోటీగా నడుపుతున్న 'సామాజిక తెలంగాణ' కార్యక్రమాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నవి.

# వలస పాలకుల గుండెల్లో దడ పుట్టించిన 'క్విట్ ఇండియా'

రెండవ ప్రపంచ యుద్ధం ఒకవైపు భారత స్వాతంత్ర్య పోరాటం మరో వైపు ఉన్నత స్థాయిలో జరుగుతున్న రోజులవి. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా 08 ఆగస్టు 1942 రోజున బొంబాయిలో భారత జాతీయ కాంగ్రెస్ తీసుకున్న తీర్మానం ప్రకారం క్విట్ ఇండియా ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడింది. ఆగస్టు ఉద్యమం లేదా ఆగస్టు క్రాంతి లేదా భారత్ ఛోడో ఆందోళన్ అనే పేర్లతో కూడా క్విట్ ఇండియా ఉద్యమాన్ని నినాదాలుగా పిలిచారు. క్విట్ ఇండియా అంటూ మహాత్మాగాంధీ బ్రిటీష్ పాలకుల గుండెలు అదిరే విధంగా గళమెత్తడమే కాకుండా స్వాతంత్ర్య సాధనకు డూ ఆర్ డై (సాధించు లేదా మరణించు) అంటూ సామాన్య ప్రజల్లో స్వాతంత్ర్య జ్వాలలు రగల్చగలిగారు. పట్టణాలు, పల్లెల ప్రజలు కూడా క్విట్ ఇండియా అంటూ అహింసాయుత బాటలో ముక్త కంఠంతో గొంతులు ఎత్తడంతో వలస పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తడం ప్రారంభమైంది. క్రిప్స్ మిషన్ వైఫల్యం, భారతీయుల్ని అమానవీయంగా చూడడం, ఈస్ట్ బెంగాల్ ప్రాంతంలో తీవ్ర అస్థిరత, దేశవ్యాప్తంగా ఆకలి పోరాటాలు, వలస పాలకులు పాలనపై అపనమ్మకం లాంటి పలు కారణాలు కూడా క్విట్ ఇండియా ఉద్యమానికి ఆజ్యం పోశాయి.

### వీర మరణమో లేదా స్వాతంత్ర్య సాధనో అంటూ సాగిన పోరు :

క్విట్ ఇండియా ఉద్యమానికి ప్రధాన నినాదంగా డూ ఆర్ డై అనే స్వాతంత్ర్య రెండు పదాల మంత్రం భారతదేశవ్యాప్తంగా వ్యాపించిన వేళ స్వాతంత్ర్య సమరయోధులతో పాటు ఇతర పెద్దలు, విద్యార్థులు, యువత, మహిళలు సహితం పోరాటానికి గళం కలిపి దేశ ఐక్యతను చాటడంతో తెల్లతోలు పాలకులు భయకంపితులి కావడం జరిగింది. ఈ పోరాటాన్ని అణచి వేయడానికి పోలీస్ బలగాలు రంగ ప్రవేశం చేసి పలువురు ప్రముఖ నాయకులను అరెస్టు చేయడం జరిగింది. పౌర సహాయనిరాకరణ, పౌరుల్లో ధైర్యం, ప్రజల త్యాగం, దేశ స్వాతంత్ర్య భావనలు, జాతీయ అంతర్జాతీయ గుర్తింపు పౌర సమాజ భాగస్వామ్యం ప్రజాస్వామ్య పరిరక్షణ, దేశ సార్వభౌమాధికారం, దేశభక్తి, రేపటి యువతరం ప్రేరణ, పెద్ద ఎత్తున నిరసనలు జరగడానికి క్విట్ ఇండియా స్ఫూర్తి పని చేసింది. 1947లో స్వాతంత్ర్యం రావడానికి క్విట్ ఇండియా ఉద్యమ ఘట్టం ప్రధాన కారణంగా నిలిచింది. 08 ఆగస్టు రోజున పాటిస్తున్న క్విట్ ఇండియా ఉద్యమ దినంలో భాగంగా విద్యాలయాల్లో అవగాహనలు, రేపటి తరానికి ప్రేరణాత్మక కార్యక్రమాలు, క్విజ్‌పోస్టర్‌ఉపన్యాస పోటీలు, పోరాటానికి




సంబంధించిన సినిమాల ప్రదర్శనలు, చర్చలు, పోరులో అమరత్వ పొందిన వారికి నివాళులు అర్పించడం, సాంస్కృతిక పోటీలు, సామాజిక మాధ్యమ ప్రచారాలు, ప్రభుత్వ సంస్థల కార్యక్రమాలు లాంటివి నిర్వహించవచ్చు. వీర మరణమే లేదా స్వాతంత్ర్య సాధనో జరిగే వరకు ఈ పోరాటం ఆగదని బ్రిటీష్ పాలకులకు స్పష్టం చేయగలిగినా క్విట్ ఇండియా ఉద్యమం భారత దేశ స్వేచ్ఛ పోరులో ఒక ప్రధాన ఘట్టంగా నిలవడం జరిగింది.

## ఉద్యోగ, ఉపాధ్యాయులకు నగదు రహిత

# ఆరోగ్య కార్డులకు మోక్షమెప్పుడు?

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు నగదు రహిత ఆరోగ్య కార్డులను పంపిణీ చేయాలి. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగులకు,పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు, జర్నలిస్టులకు జారీ చేసిన హెల్త్ కార్డులు ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లలో ఎక్కడ పని చేయడం లేదు. అనారోగ్యానికి గురైనప్పుడు ఆసుపత్రులకు వెళ్లి హెల్త్ కార్డులు చూపిస్తే ఇవి దేనికీ పనికి రావని, డబ్బులు చెల్లించి రీయింబర్స్‌మెంట్ చేసుకోమని ఉచిత సలహాలు ఇస్తున్నారు. ఐదు లక్షలు, పది లక్షలు, ఇరవై లక్షలు ఇంకా అధిక మొత్తలలో ఎంత డబ్బు ఖర్చు పెట్టి వైద్యం చేపించిన ప్రభుత్వం మాత్రం రెండు లక్షల రూపాయల లోపే రీయింబర్స్‌మెంట్ కింద మంజూరు చేస్తున్నారు. మంజూరు అయిన డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం ఖజానా ఖాళీ ఉందని సంవత్సరాలు, సంవత్సరాలు గడిచినా రావడం లేదు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చిన లక్షలకు, లక్షలు ఫీజులు కట్టాల్సి వస్తుంది. ఉద్యోగ, ఉపాధ్యాయుల దగ్గర పెద్ద మొత్తంలో డబ్బులు లేకపోవడం వల్ల ఒంటి మిది బంగారాన్ని అమ్మడం, పర్సనల్ లోన్‌లు తీసుకోవడం,అధిక మొత్తాల్లో అప్పులు చేయడం వల్ల మానసిక క్షోభకు గురౌతున్నారు.

### హరీశ్‌రావు వాగ్దానం హుళక్కె

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం, గెజిటెడ్ అధికారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గత ప్రభుత్వంలో రాష్ట్ర వైద్య శాఖ మంత్రిగా చేసిన హరిష్ రావు గారిని కలిసి నగదు రహిత వైద్యాన్ని అందించాలని కోరారు. పిఆర్‌సి కమిటీ రికమండేషన్ చేసినట్లు బేసిక్ పే నుంచి ఒక్క శాతం హెల్త్ స్కీం కింద ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని లేకపోతే రెండు శాతం బేసిక్ పే నుంచి ఇస్తామని అనగానే పూర్వ వైద్య శాఖ మంత్రి రేపే ప్రైవేట్ ఆసుపత్రులలో, స్పెషాలిటీ హాస్పటల్ లలో, సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ లలో హెల్త్ స్కీం కింద ట్రస్ట్ ఏర్పాటు చేసి ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు నగదు రహిత వైద్యాన్ని అందిస్తామని అన్నారు. పూర్వ వైద్య శాఖ మంత్రి హరిష్ రావు గారు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. తెలంగాణ రాక ముందు జారీ చేసిన ఆరోగ్య కార్డులు అనారోగ్య కార్డులుగా మారాయి. అవే కార్డులు ముఖ్యమంత్రి ముఖ చిత్రం మారి వస్తున్నాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో గత పది సంవత్సరాలు ఫ్రెండ్లీ ప్రభుత్వం.. ఫ్రెండ్లీ ప్రభుత్వం అంటూ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు నగదు రహిత ఆరోగ్య కార్డులను మంజూరు చేయలేదు. ప్రస్తుత రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చి విద్యా, వైద్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది.తెలంగాణ ఆరోగ్య శాఖ మంత్రిగా దామోదరం రాజ నరసింహ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేసి వీలైనంత త్వరగా ఆరోగ్య కార్డులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర కేబినెట్ లోనూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులకు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు నగదు రహిత ఆరోగ్య కా




ర్డులను జారీ చేస్తామని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు సంబుర పడ్డారు.ఉద్యోగ, ఉపాధ్యాయులు వారి వేతనం నుండి ఒక శాతం కార్పస్ ఫండ్ కింద ఇవ్వడానికి ఒప్పందం కుదిరింది. నగదు రహిత ఆరోగ్య కార్డుల వ్యవహారం మూడు అడుగుల ముందుకు ఆరు అడుగుల వెనుకకు అన్న విధంగా మారింది. అన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు అదిగో నగదు రహిత ఆరోగ్య కార్డులు వస్తున్నాయి.ఇదిగో ఆరోగ్య కార్డులు వస్తున్నాయి అని ప్రతి సమావేశంలో అంటున్నారు కానీ అమలు కావడం లేదని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆవేదనను, ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ప్రజా ప్రభుత్వం, ఇందిరమ్మ రాజ్యం అంటూ అనేక ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తుండడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న నగదు రహిత ఆరోగ్య కార్డులను మంజూరు చేస్తారనే ఆశాభావంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు ఉన్నారు.

డాక్టర్. ఎస్. విజయ భాస్కర్,
9290826988

# మ్యావ్... మ్యావ్...పిల్లి

నేడు ప్రపంచ పిల్లుల దినోత్సవం

పిల్లికి చెలగాటం.. ఎలుకకు ప్రాణసంకటం. పిల్లి కళ్ళు మూసుకొని పాలు తాగుతూ తనను ఎవరూ గమనించలేదనుకొనిందట. పొయ్యిలో నుండి పిల్లి లేవలేదు తదితర సామెతలను నిత్యజీవితంలో వాడుతుంటాము. బయలదేరే ముందు పిల్లి ఎదురైతే అపశకునంగా భావిస్తాము. ఇంతకు ఇప్పుడు ఈ పిల్లలు గోల ఎంటా అనుకుంటున్నారా... అదేనండి ఆగస్టు 8న ప్రపంచ పిల్లుల దినోత్సవం. పిల్లి లేదా మార్జాలం కార్నివోరా క్రమానికి చెందిన చిన్న క్షీరదము. దీని శాస్త్రీయ నామం ఫిలస్ కాటస్. దీనిని పెంపుడు పిల్లి అని కూడా అంటారు. వీనిని మానవులు పురాతన కాలం నుండి సుమారు 9,500 సంవత్సరాలుగా పెంచుకుంటున్నారు. పిల్లులు పాములు, తేళ్ళు, ఎలుకలు మొదలైన సుమారు 1,000 పైగా జాతుల జీవాలను వాటి ఆహారం కోసం వేటాడడంలో మనకు తోడుగా ఎంతో సహాయం చేస్తాయి. ఇవి చాలా సులభంగా మనం చెప్పిన వాటిని నేర్చుకుంటాయి. ఇవి మియావ్ మొదలైన వివిధ శబ్దాలతో ఇతర పిల్లులతో సంభాషిస్తాయి. అమెరికాలో 69 మిలియన్ పిల్లులు పెంపుడు జీవులుగా ఉన్నాయి. కుక్కల తర్వాత రెండవ స్థానంలో ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఇవి మొదటి స్థానంలో 600 మిలియన్ ఇండ్లలో పెంచుకోబడుతున్నాయి. తల్లి పిల్లి తన పిల్లలను తన తండ్రికి కనిపించకుండా అవి కొంచెం బాగా తిరగగలిగే వరకు ఒకే దగ్గర ఉండకుండా వేరు వేరు ప్రదేశాలు మారుతూ వాటికి రక్షణ కల్పిస్తాయి. పిల్లి పిల్లలు తమ తండ్రికి కనిపించాయంటే మెడ కొరికి చంపేస్తాయి. తల్లి పిల్లి వాటి పిల్లలను ఎప్పుడూ శుభ్రంగా ఉండేవిధంగా నాలుకతో వాటి శరీరాన్ని శుభ్రం చేస్తుంటాయి. అంతర్జాతీయ పిల్లి దినోత్సవాన్ని మొదటగా 2002లో కెనడాకు చెందిన అంతర్జాతీయ జంతు సంక్షేమ నిధి ప్రారంభించింది. ఈరోజు పిల్లిని రక్షించే మార్గాలు, పిలుల్ని దత్తత తీసుకోవడం మొదలైన అంశాలపై అవగాహన కల్పిస్తారు. పిల్లుల్ని మనదేశంలో పెంచుకోవడానికి పెద్దగా మొగ్గు చూపరు కానీ చాలా దేశాల్లో పిల్లిని ఎంతో ప్రేమగా పెంచుకుంటారు.

కొందరు పిల్లి ఎదురు వస్తే అపశకునంగా భావిస్తారు. వెళ్లిన పని



కాదని నమ్ముతారు. అందులోనూ నల్లపిల్లి ఎదురువస్తే ఇక ఆ పని జరిగినట్లే అని బలంగా నమ్ముతారు. అయితే ఈజిప్షియన్లు మాత్రం పిల్లుల్ని దేవుళ్లుగా భావించేవారట. వారి రాజవంశం కూలిపోయిన తరువాత పిల్లులు ప్రతి చోట ప్రాచుర్యం పొందాయి. గ్రీకులు, రోమన్లలో ధనవంతులు వద్ద పిల్లులు ఉండేవి. అయితే మధ్య యుగంలో ఐరోపాలో పిల్లులపై మూఢ నమ్మకాలు బయలుదేరాయి. 1348 నుంచి 1600 వరకు ప్లేగుకు ఎలుకలు, పిల్లులు కారణమని పిల్లుల్ని చంపడం మొదలుపెట్టారట. రెండు కానీ అంతకంటె ఎక్కువ గానీ తెల్లని పిల్లులు ఇంట్లోకి ప్రవేశిస్తే, ఆ ఇంటివారికి త్వరలో దరిద్రబాధలు, అనారోగ్యాలు, చిక్కులు సంప్రాప్తిస్తాయట పెంపుడు పిల్లి ఇల్లు వదిలిపోతే ఇంటిలోని అదృష్టం కూడా దానితోనే పోతుందట వెన్నెల్లో నల్లపిల్లి కనబడితే, ఆ ప్రాంతంలో ఏదో ఒక అంటువ్యాధి ప్రబలుతుందనడానికి సూచిక. (ఐరిష్ ప్రజల నమ్మకం) పిల్లిని మోసుకుని ఏరును దాటితే జీవితాంతం దురదృష్టం వెన్నంటి ఉంటుందట (ఫ్రెంచి వారి హెచ్చరిక) పిల్లి తన పాదాలను శరీరం కింద ముడుచుకొని నిద్రపోతే, అది వర్షం వస్తోందనడానికి సూచికట పిల్లి ఒకసారి తుమ్మితే వర్షం వస్తుందనీ, మూడుసార్లు తుమ్మితే ఆ గృహంలోని వారందరికీ జలుబు చేస్తుందనీ ఓ విశ్వాసం సింహద్వారం దగ్గర పిల్లి ముఖం శుభ్రం చేసుకుంటే, ఆ ఇంటికి మతాచార్యులు వస్తారని అమెరికన్ల విశ్వాసం.

పిల్లి మీద ఎన్ని వెటకారాలు, చిన్నచూపులు, ఈసడింపులు ఉన్నా, పిల్లల్ని రక్షించుకోవడంలో పిల్లి తరవాతే ఏ జంతువైనా. అందుకే మార్జాలకిశోర న్యాయం అనే జాతీయం పుట్టుకొచ్చింది. పిల్లి తను పెట్టిన పిల్లల్ని ఒక ఇంటి నుంచి మరొక ఇంటికి మార్చేటప్పుడు చాలా జాగ్రత్తగా నోట కరచుకొని తీసుకువెడుతుంది. పిల్లలకు ఎక్కడా కష్టం కలగకూడదనేది పిల్లి ఉద్దేశం. అంతేనా నవరత్నాలలో ఉండే వైడూర్యాన్ని క్యాట్స్ ఐ అంటే పిల్లి కన్ను అంటారు. పిల్లి కన్ను రత్నమైతే, పిల్లి కూడా రత్నమే కదా! పిల్లులు రోజుకు 13 నుంచి 16 గంటల పాటు నిద్రపోతాయి. ఎందుకంటే వాటి శరీర ఎదుగుదలకు అవసరమయ్యే హార్మోన్ నిద్రపోయినప్పుడే విడుదలవుతుంది.ఆడ పిల్లులు ఎక్కువగా కుడి చేతి వాటాన్ని, మగపిల్లులు ఎడమ చేతి వాటాన్ని కలిగివుంటాయి. పిల్లులు వంద రకాలుగా అరవగలవు.పిల్లుల ఒంటిమీద ఉండే బొచ్చు నీటిలో తడిస్తే... అంత త్వరగా ఆరదు. అందుకే పిల్లులు నీటిలోకి వెళ్లడానికి ఇష్టపడవు.పిల్లి గుండె నిమిషానికి 110 నుంచి 140 సార్లు కొట్టుకుంటుంది. వీటికి శుభ్రం చాలా ఎక్కువ. మెలకువగా ఉండేదే తక్కువ అంటే... ఆ సమయంలో ఎక్కువశాతం తమను తాము శుభ్రం చేసుకోవడానికే వినియోగిస్తాయి. భూకంపాలు, సునామీల వంటి ఉత్పాతాలను సంభవించడానికి పదిహేను నిమిషాల ముందే పసిగట్టేస్తాయి.వీటి నాలుక మీద ఉండే రుచి మొగ్గలకు తీపిని గుర్తించే శక్తి లేదు.ఇవి చీకట్లో కూడా స్పష్టంగా చూడగలవు. పుట్టినప్పుడు చాలా పిల్లుల కళ్లు నీలి రంగులోనే ఉంటాయి. కాలం గడిచేకొద్దీ అవి రంగు మారతాయి. మనుషుల్ని వేలిముద్రల ద్వారా గుర్తించినట్టు, పిల్లుల్ని ముక్కు ముద్రలతో గుర్తించవచ్చు. ఎందుకంటే ఏ రెండు పిల్లుల ముక్కూ ఒకలా ఉండదు.ఎంత ఎత్తుమీది నుంచి పడినా పిల్లి ముందు తన పాదాలనే ఆన్చుతుంది తప్ప పొరపాటున కూడా దాని తల నేలకు కొట్టుకోదు. వాటి శరీర నిర్మాణంలోని ప్రత్యేకత వల్ల అలా జరుగుతుంది. మనుషుల్లాగే పిల్లులకూ కలలు వస్తాయి. వారం రోజుల పిల్లగా ఉన్నప్పటి నుంచీ ఇవి కలలు కంటాయట.పిల్లుల ఘ్రాణశక్తి మనుషుల కంటే చాలా రెట్లు ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే వీటి నోటిలోపల పైభాగంలో జాకబ్సన్స్ ఆర్గాన్ అనే ఒక అవయవం ఉంటుంది. ముక్కుతో పాటు ఇది కూడా వాసన చూసేందుకు ఉపయోగపడుతుంది.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/ ఇల్లందు :** 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకునేందుకు అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తిచేయాలని ఇల్లందు ఏరియా జిఎం వి.కృష్ణయ్య అధికారులకు సూచించారు. గురువారం జిఎం కార్యాలయంలో ఈ వేడుకలకు సంబంధించి అధికారులతో ఏర్పాటు చేసిన సామవేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఏరియా జిఎం కార్యాలయంతో పాటు జెకె కాలనీలోని సిఇఆర్ క్లబ్ నందు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎస్ఒటు జిఎం జాకీర్ హుస్సేన్, పిఒకెఒసి గోవింద రావు, ఎజిఎం (ఐఇ)గిరిధర్ రావు, ఏరియా ఇంజనీర్ నరసింహారాజు, డిజిఎం పర్సనల్ అజ్మీర తుకారం, డిజిఎం (సివిల్) రవి కుమార్,డిజిఎం (ఎఫ్ఎ) మధుబాబు, డిజిఎం (ఇయం) వర్క్ షాప్ నాగరాజు నాయక్, డిజిఎం (ఇఎం) సిహెచ్‌పి క్రిస్టోఫర్, డివైసి ఎం. నరసింహారావు, జెకెఒసి మేనేజర్ పులి పూర్ణచందర్ ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## మహా కిసాన్ పంచాయత్‌లో పాల్గొన్న నల్లమల

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పంజాబ్ రాష్ట్రం లూథియానా నగరంలో సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్) ఆధ్వర్యంలో జరిగిన మహా కిసాన్ పంచాయత్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం నుంచి సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లమల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పంజాబ్‌కు చెందిన జగ్జీత్ సింగ్ దల్లేవాల్, హర్యానా నుంచి అభిమాన్యు, రాజస్థాన్ నుంచి మహావీర్ సవాహన్, ఉత్తరప్రదేశ్ నుంచి రాజబీర్, ఢిల్లీ నుంచి అనిల్‌కుమార్, తమిళ నాడు నుంచి వీరపాండ్యన్, కేరళ నుంచి బీజు, తెలంగాణ నుంచి నల్లమల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మహా కిసాన్ పంచాయత్‌లో ప్రధానంగా మూడు అంశాలపై చర్చించారు. భూ సేకరణ చట్టం, ప్రపంచ వాణిజ్య ఒప్పందం, స్వామినాథన్ కమిషన్ ఆమోదం, మద్దతు ధరలకు చట్టబద్ధత వంటి అంశాలపై చర్చించారు.




## ఖమ్మంలో సిపిఐ భారీ ర్యాలీ

### పాల్గొన్న అజీజ్‌పాషా

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పాలస్తీనా సంఘీభావ ర్యాలీకి మద్దతుగా సిపిఐ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక భక్తరామదాసు కళాక్షేత్రం నుండి జెడ్పీ వరకు ఈ ర్యాలీ జరిగింది. ర్యాలీలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు అజీజ్‌పాషా, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్‌కె.జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవింద రావు, సిద్దినేని కర్ణకుమార్, అజ్మీర రామ్మూర్తి తదితరులు నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా అజీజ్‌పాషా మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రోద్భలంతోనే పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు చేస్తుందని ఆరోపించారు. మానవత్వాన్ని మరిచి ఇజ్రాయిల్ గాజాలో మానవ నివాస ప్రాంతాల్లో బాంబు దాడులు చేస్తుందని ఆయన ఆరోపించారు. తక్షణం యుద్ధాన్ని నిలిపివేయాలని అజీజ్‌పాషా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్.సీతామహాలక్ష్మి, రావి శివరామకృష్ణ, పుచ్చకాయల కమలాకర్, తోట రామాంజనేయులు, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, జాగర్లమూడి రంజిత్‌కుమార్, మిడికంటి చిన్నవెంకటరెడ్డి, యానాలి సాంబశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 15 నాటికి దరఖాస్తులు పరిష్కరించాలి

### సాదాబైనామా దరఖాస్తులకు నోటీసులు జారీ చేయాలి

### సమీక్షలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి






**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఆగస్టు 15 నాటికి రెవెన్యూ సదస్సుల క్రింద వచ్చిన భూ సమస్యల దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి గురువారం రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, సంబంధిత రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన భూ సమస్యల దరఖాస్తుల ప్రస్తుత స్థితిగతులు, ఎన్ని దరఖాస్తులు పరిశీలన జరిగింది, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల గురించి మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి 75 వేల దరఖాస్తులు వచ్చాయని, వాటిలో సాదాబైనామాకు సంబంధించి ఉన్న 49వేల దరఖాస్తులకు వెంటనే నోటీసులు జారీ చేయాలన్నారు. సాదాబైనామా మినహాయించి పెండింగ్ ఉన్న దరఖాస్తులను మండలాలవారీగా ప్రస్తుత స్థితిగతులపై నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు. సాదాబైనామా దరఖాస్తుల్లో ముందు నోటీసులు జారీ చేసి, అనంతరం నిబంధనల ప్రకారం అర్హత ఉన్న దరఖాస్తులు పక్కన పెట్టుకోవాలన్నారు. హైకోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆదేశాలమేరకు దరఖాస్తుల పరిష్కారానికి ఆస్కారం ఉంటుందన్నారు. అంతకు ముందు డబుల్ బెడ్‌రూం ఇండ్లపై అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తహసీల్దార్లతో సమీక్షించారు. స్థానిక ఎంఎల్ఏ, మంత్రులు, ఉప ముఖ్యమంత్రుల సమయం తీసుకుని పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను ర్యాండమైజేషన్ పద్ధతిలో కేటాయింపు చేయాలన్నారు. ఏన్కూరులో 40 ఇండ్లను లబ్ధిదారులు ఆక్రమించారని, దీనిపై నివేదిక అందించాలన్నారు. ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో జి.నర్సింహారావు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

**పర్యాటకంలో ఉన్నతంగా తీర్చిదిద్దాలి**

**-రోప్‌వేతో ఖమ్మం ఖిల్లాకు పూర్వ వైభవం**

ఖమ్మం జిల్లాను పర్యాటకంలో ఉన్నతంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గురువారం ఖమ్మం ఖిల్లా, జాఫర్ బావి, నేలకొండపల్లిలోని బౌద్ధ స్థూపాన్ని జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో సందర్శించి చేపట్టాల్సిన పర్యాటక పనుల గురించి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం ఖిల్లా మంచి పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రూ.29కోట్ల వ్యయంతో చేపడుతున్న ఖమ్మం ఖిల్లా రోప్‌వే నిర్మాణానికి చర్యలు వేగవంతం చేయాలన్నారు. ఇట్టి నిధులలో రూ.15 కోట్లు ఖమ్మం నగర పాలక సంస్థ, రూ.14 కోట్లు టిజియుఐడిసి సమకూర్చుతున్నట్లు తెలిపారు. రోప్‌వే నిర్మాణానికి స్థల సేకరణ పూర్తి చేసినట్లు తెలిపారు. వారం రోజుల్లో పనులు ప్రారంభించాలని కలెక్టర్ అన్నారు.
కలకత్తాకు చెందిన కన్వేయర్ అండ్ రోప్‌వే సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మాణ పనులు చేయనున్నట్లు తెలిపారు. జాఫర్‌బావి, ఖిల్లా అభివృద్ధితో ఖమ్మం పర్యాటక ప్రాంతంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో జి.నర్సింహారావు, జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి సుమన్ చక్రవర్తి, ఖమ్మం అర్బన్, నేలకొండపల్లి తహసీల్దార్లు సైదులు, వెంకటేశ్వర్లు, పర్యాటక శాఖ డిఇ రామకృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ అసోసియేట్ చీఫ్ కన్సల్టెంట్ వెంకటేష్, అధికారులు పాల్గొన్నారు.



## చేనేత రంగం బలోపేతానికి ప్రభుత్వం కృషి

### అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన వేడుకల్లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చేనేత కార్మికులు ఉన్న ప్రాంతంలో తాను చిన్నతనంలో ఉన్నట్లు ఆయన తెలిపారు. మగ్గం వేయాలంటే చాలా ఓపిక ఉండాలన్నారు. రాష్ట్రంలో గద్వాల్, నారాయణపేట్, సిరిసిల్ల వంటి ప్రాంతాల్లో మంచి నైపుణ్యత కలిగిన చేనేత కార్మికులు ఉన్నారన్నారు. సిరిసిల్ల ప్రాంతంలో అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీర తయారు చేసే నాణ్యత గల చేనేత కార్మికులు కూడా ఉన్నారన్నారు. మన ముందుతరాలకు కూడా చేనేత వృత్తిపట్ల ఆకర్షితులయ్యేలా చూడాలని, మారుతున్న కాలాన్ని బట్టి సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. చేనేత కార్మికులకు సహాయం చేసేందుకు నేతన్న పొదుపు పథకం, నేతన్న భద్రత పథకం, నేతన్న భరోసా పథకం, నేతన్న రుణమాఫీ పథకం వంటి వివిధ కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. చేనేత చీరలకు మంచి డిమాండ్ ఉంటుందన్నారు. అనంతరం చేనేత కార్మికులకు, నేతన్నలకు, చేనేత దినోత్సవ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అదనపు కలెక్టర్ శాలువాలతో సత్కరించి మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖల సహాయ సంచాలకులు ఎం.విజయల, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠినచర్యలు : ఎడిఎ విజయచంద్ర

**ప్రజాపక్షం/చింతకాని :** డీలర్లు ఎరువులను కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని మధిర ఏడిఏ విజయచంద్ర డీలర్లను హెచ్చరించారు. మంగళవారం చింతకాని మండలం లచ్చగూడెం, నాగిలిగొండ, పాతర్లపాడు, నాగులవంచ గ్రామాల్లోని ఫెర్టిలైజర్ షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్ రిజిష్టర్, ఫార్మర్ సేల్ రిజిష్టర్, బిల్ బుక్స్, ఇన్వాస్ కాపీలను పరిశీలించారు. ప్రతి రోజు రిజిష్టర్‌లను అప్డేట్ చేయాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను అమ్మాలన్నారు. ఎరువులను కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అనంతరం నాగులవంచ సహకార సంఘంలో యూరియా అమ్మకాలను పరిశీలించారు. యూరియా స్టాక్ , అమ్మకాల వివరాలు సంఘం సిఈవో శ్రీనివాసరావు ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి ఎస్ మానస తదితరులు పాల్గొన్నారు.

# సొసైటీల అభివృద్ధిపై కార్యదర్శులకు శిక్షణ

### వెంకటాయపాలెం సొసైటీని సందర్శించిన బృందం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్) బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై సొసైటీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల ఐదు నుంచి ఎనిమిది వరకు టెస్కాబ్ ఆధ్వర్యంలో కోఆపరేటివ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఫ్యాకల్టీ సంపత్‌కుమార్, విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఖమ్మం డిసిసిబి కార్యాలయంలో 35 మంది సొసైటీ కార్యదర్శులకు శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణలో భాగంగా గురువారం వి.వెంకటాయపాలెం సొసైటీని క్షేత్రస్థాయిలో ఫ్యాకల్టీ బృందం, శిక్షణ తీసుకుంటున్న సొసైటీ కార్యదర్శులు సందర్శించారు. వివి పాలెం సొసైటీలో నిర్వహిస్తున్న కార్యకలాపాల గురించి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఫ్యాకల్టీ బృందం మాట్లాడుతూ సహకార సంఘంలో వివిధ రకాల కార్యకలాపాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా ఎరువులు, విత్తనాల విక్రయంతో పాటు గోల్డ్ రుణాలు, డిపాజిట్లు, సేవింగ్ అకౌంట్స్ నిర్వహణ, రైతులకు రుణాలు అందించడం, వాటర్ ప్లాంట్, గోడౌన్ నిర్వహణ, స్థానిక ప్రజలకు కామన్ సర్వీస్ సెంటర్ సేవలు అందించేలా ఏర్పాటు చేయడం వంటి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తూ సంఘం బలోపేతానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వివి పాలెం సొసైటీ తరహాలోనే మిగిలిన అన్ని సొసైటీలు ఇటువంటి కార్యక్రమాలు చేపట్టి సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. సంఘాల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. అనంతరం ఫ్యాకల్టీ బృందాన్ని సొసైటీ వైస్ చైర్మన్ రావెళ్ల శ్రీనివాస్, కార్యదర్శి ఐతగాని తిరుపతి రావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.



## నానో యూరియాతో అధిక ప్రయోజనం

**ప్రజాపక్షం/చింతకాని :** నానో యూరియా వాడకం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ ఏడిఏ స్వర్ణ విజయచంద్ర రైతులకు సూచించారు.మండల పరిధిలోని చిన్నమండవ గ్రామంలో నానో యూరియాను డ్రోన్‌తో పిచికారీ చేసే విధానంను రైతులకు చూపించారు. సాంప్రదాయ యూరియాతో పోలీస్తే నానో యూరియా పిచికారి చేయడం వల్ల 80నుంచి 85 శాతం వరకు నత్రజని అందిస్తూ పర్యావరణ కాలుష్యాన్ని తగ్గిస్తుందన్నారు. నానో యూరియా, నానో డిఏపీ వాడకం వల్ల కలుగు ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సోములపల్లి మానస, ఏఈవో కల్యాణి, రైతులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటికి అడ్డంకిగా విద్యుత్ తీగలు

### గతంలో విద్యుదాఘాతంతో కుమారుడిని కోల్పోయిన కుటుంబం

**ప్రజాపక్షం/ తల్లాడ :** విద్యుత్ వైర్లు ఇంటిపైన వేలాడుతుండటంతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు కుటుంబసభ్యులు వెనకాడుతున్న ఘటన తల్లాడ మండలంలోని నారాయణపురం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సంఘసాని శిరీషకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఈ నేపథ్యంలో తనకున్న సొంత భూమిలో ఇంటిని నిర్మించుకునేందుకు సిద్ధమయ్యారు. ఇంటి నిర్మాణంలో భాగంగా పిల్లర్లకు సంబంధించిన ఇనుప కడ్డీ సువ్వలు నిలబెట్టి బేస్ మట్టం వరకు పూర్తి చేశారు. దీంతో పిల్లర్లకు సంబంధించిన ఇనుప కడ్డీ సువ్వలు పైన విద్యుత్ వైర్లు ఉండటంతో వాటికి అంటుకునే ప్రమాదం నెలకొంది. ఈ నేపథ్యంలో బాధిత కుటంబ సభ్యులు ఆ ఇంటిని నిర్మించుకునేందుకు వెనకాడుతున్నారు.

**గతంలో విద్యుదాఘాతంతో కుమారున్ని కోల్పోయాం :**

గతంలో మా కుమారుడు విద్యుదాఘాతంతోనే మృతి చెందాడని సంఘసాని మల్లిక తెలిపారు. వేరే గ్రామంలో విద్యుత్ పనులు చేస్తుండగా ఆకస్మాత్తుగా తన కుమారుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడని గుర్తుచేశారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని, ఆ ఇల్లు నిర్మించుకుందామని పనులు చేస్తుంటే విద్యుత్ వైర్లు అడ్డు వస్తున్నాయని పేర్కొన్నారు. విద్యుత్ వైర్లు ఉండటం వల్ల ఇంటి నిర్మాణ పనులను నిలుపదల చేయాల్సి వస్తుందన్నారు. సొంత డబ్బులు కట్టి విద్యుత్ స్తంభాలను మార్చే పరిస్థితి మాకు లేదని ఆమె వాపోయారు.

**విద్యుత్ అధికారులు దృష్టి సారించాలి :**

విద్యుత్ అధికారులు దృష్టి సారించి విద్యుత్ వైర్లను తమ ఇంటి పై నుండి జరపాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. విద్యుత్ అధికారులకు ఈ విషయాన్ని తెలిపామని పేర్కొన్నారు. విద్యుత్ వైర్లు జరిపే స్థోమత తమ వద్ద లేదని, జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి విద్యుత్ వైర్లను జరపాలని వారు కోరుతున్నారు.

## అయోధ్య మరణం సిపిఐకి తీరని లోటు

### సిపిఐ జిల్లా నేత దండు

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సిపిఐ సీనియర్ నాయకుడు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకుడు బొల్లోజు అయోధ్య మరణం భారత కమ్యూనిస్టు పార్టీకి, ఉద్యమానికి తీరని లోటని, ఆయన చూపిన మార్గంలో నడవడమే ఆయనకు మనమిచ్చే ఘన నివాళులని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ అన్నారు. బొల్లోజు అయోధ్య మరణానికి సంతాపం తెలియజేస్తూ గురువారం సత్తుపల్లిలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ మాట్లాడుతూ బూర్గంపాడు పాతనియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న పినపాక నియోజకవర్గంలో భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో అయోధ్య పాత్ర ఎంతో ఉందని, క్రమశిక్షణ గల కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా, గ్రామ శాఖ కార్యదర్శి నుంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎదిగి, ఈ ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమానికి బీజం వేసిన మహానుబావుడు అయోధ్యని, అదేవిధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా ఉమ్మడి ఖమ్మం జిల్లా మొత్తానికి తన సేవలను పార్టీ ఉద్యమానికి పార్టీ పోరాటాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలబడి పోరాడారని కొనియాడారు.
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆయన మరణంతో కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటు ఏర్పడిందని ఆయన ఆశయాన్ని మిగిలిన నాయకులు ముందుకు తీసుకుపోవడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళులన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సత్తుపల్లి టౌన్ సహాయ కార్యదర్శి పాలకుర్తి వీరయ్య, సిపిఐ మండల కమిటీ సభ్యుడు తాటి వీరభద్రం, మహిళా సమైఖ్య సత్తుపల్లి నియోజకవర్గ కన్వీనర్ ఎస్కే రంజాన్ బి.రాజశేఖర్, పద్మ, లక్ష్మి, వెంకటేశ్వరరావు, ప్రసాద్, ఆశ, బాబ్జీ, చారీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు ముర్రుపాలు పట్టించాలి

### ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు




**ప్రజాపక్షం/భద్రాచలం :** ఆదివాసీ గ్రామాల్లో గర్భిణీలకు తల్లిపాల ప్రాధాన్యత తెలియజేసి పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించేలా అవగాహన కల్పించాలని ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు అన్నారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశానికి సబ్ కలెక్టర్ మ్రినాలీ శ్రేష్ఠ, ఐటిడిఏ పిఓ రాహుల్‌తో కలిసి పాల్గొన్నారు. 1 నుండి 7వ తేది వరకు తల్లిపాల వారోత్సవాలు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రతి మండలంలో జరిగాయని, తల్లిపాల విశిష్టతను వివరించారని చెప్పారు. తల్లిపాల గొప్పతనాన్ని చాటిచెప్పాలన్నారు. ముర్రుపాలు బిడ్డకు అమృతంతో సమానం అని, పుట్టిన పిల్లలకు ఆరు నెలలు వచ్చేంత వరకు తల్లిపాలు మాత్రమే పట్టాలని, పాలివ్వడం వల్ల తల్లులకు రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం కూడా తగ్గుతుందన్నారు. ఈ సందర్భంగా 15 మంది గర్భిణీలకు బాలామృతం అందించి ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మహిళలకు సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణలత లెనిన, జ్యోతి, అనసూయ, చంద్రకళతో పాటు వివిధ గ్రామాలనుండి వచ్చిన గర్భిణీలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అడుగుతీసి.. అడుగేసేదెలా?

### చినుకుపడితే చిత్తడవుతున్న దారితో ప్రజల ఇక్కట్లు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లోని ఆటోనగర్ టూ మద్దులపల్లి మార్కెట్ రోడ్ అధ్వానంగా మారింది. చినుకుపడితే చిత్తడవుతున్న దారితో అడుగుతీసి అడుగువేయలేని పరిస్థితి నెలకొంది. ఇండ్లలో నుంచి బైటకి వచ్చినవారు మరల ఇంట్లోకి బురదతోనే వెళ్లాల్సి వస్తుంది. దీనికి తోడు పెద్ద పెద్ద గుంతలతో వాహనదారులు ప్రయాణం చేయలంటేనే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ సమస్య ఏండ్లుగా ఉన్నప్పటికీ పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. వర్షాకాలం కావడంతో పాటు పగలు, రాత్రి మట్టిలారీలు తిరుగుతుండటంతో మరింత దారుణంగా మారింది.

**మంత్రి తుమ్మల చొరవతో..**

నాటి ప్రభుత్వంలోని అప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఈ దారికి కొంత మోక్షం కలిగింది. ఆటోనగర్ టూ పొన్నెకల్లు వరకు మెటల్‌రోడ్‌ను ఏర్పాటు చేపించారు. అటు తర్వాత రైతుల కోసం మద్దులపల్లి మార్కెట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అలాగే ఈ దారిని కూడా డాంబర్ రోడ్ ఏర్పాటు చేసేందుకు ఆర్అండ్‌బి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో తుమ్మల ఓటమి చెందడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. అటు తర్వాత ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి మార్కెట్ ఏర్పాటుకు కృషి చేశారు. ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మార్కెట్ పనులను పూర్తిచేయించి రైతులకు అందుబాటులో తీసుకువచ్చారు.

**వర్ణనాతీతంగా కాలనీవాసుల దుస్థితి**

ఆటోనగర్ టూ మద్దులపల్లి వరకు రోడ్డుకు ఇరు వైపుల ఉన్న కాలనీల ప్రజల పరిస్థితి వరనాతీతంగా ఉంది. ఈ రోడ్డు గుండానే మెయిన్‌రోడ్డుకు వెళ్లాల్సి ఉండటంతో దారి బురద, గుంతలమయంగా ఉంది. నడకదారిన వెళ్లే వారు అడుగుతీసి అడుగు వేయలేక పోతున్నారు. వాహనదారులు పెద్ద గుంతలతో నడుముల నొప్పితో బాధపడుతుండటంతో పాటు వాహనాలు రిపేర్ అవుతున్నాయి. ఈదారిపై నుంచే పాఠశాల బస్సులు తిరుగుతుండటంతో ఏర్పడిన పెద్ద పెద్ద గుంతల ద్వారా భయానకపరిస్థితిలు ఉన్నాయి. ఈ దారి గుండా వాహన ప్రయాణం మినహా నడకకు మార్గం లేకుండా అయ్యింది. ఇప్పటికైన పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రజలుకోరుతున్నారు.

**ప్రతిపాదనలు పంపించాం**

**మద్దులపల్లి మార్కెట్ చైర్మన్**

**బైరు హరినాథ్‌బాబు**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలతో మార్కెట్‌కు మూడు వైపులా ఉన్న రోడ్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రపోజల్స్ వెళ్లాయి. అక్కడి నుంచి అనుమతులు రాగానే రోడ్డు నిర్మాణ పనులు జరుగుతాయి.

# జల్లేపల్లి గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు తొలగింపు

### గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా




**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** మండల పరిధిలోని జల్లేపల్లి గ్రామపంచాయతీలో సుమారు 15సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్న నలుగురు మల్టీ పర్పస్ వర్కర్స్‌ను స్థానిక గ్రామ పంచాయతీ అధికారులు తొలగిస్తున్నట్లు చెప్పారని తొలగించిన వర్కర్లు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. జల్లేపల్లి గ్రామంలో ఉమ్మడి రాష్ట్రంలో గత ప్రభుత్వంలో నియమించబడిన జల్లేపల్లి గ్రామానికి చెందిన భాషబోయిన వెంకటేశ్వరరావు, సంకరబోయిన యల్లయ్య, దడిదల లక్ష్మి నారాయణ, కట్టుకూరి మైసయ్యలను తొలగిస్తున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్ తెలిపారని వారు అన్నారు. ఇటీవల అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు స్థానిక మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మండల పర్యటనకు వచ్చినప్పుడు జల్లేపల్లి గ్రామపంచాయతీలో పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు సరిగా పనిచేయటం లేదని కావాలని ఆరోపణలు చేస్తూ చెప్పగా ఎంపిడిఓ సిలార్ సాహెబ్‌ను మంత్రి పొంగులేటి మందలించినట్లు తెలిసింది. ఇటీవల గ్రామపంచాయతీ గ్రామసభ ఏర్పాటు చేసి నలుగురు మల్టీపర్పస్ వర్కర్స్ తొలగిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రమేష్ విన్నవించాడని ఆరోపించారు. గత 15 సంవత్సరాలుగా గ్రామపంచాయతీని నమ్ముకుని పని చేశామని, తీరా నిర్ధాక్షిణ్యంగా తొలగించడం సరైంది కాదని, మాకుటుంబాలు నడివీధిన పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు పునరాలోచన చేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వారు కోరారు.

## ఇవిఎం గోదాములను పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారదా



**ప్రజాపక్షం/ వరంగల్ :** వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో జిల్లా ఇవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు లోని జిల్లా ఇవిఎం గోదాములను కలెక్టర్ తనిఖీ చేసి, ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత సిసికెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో జెడ్పి సిఇఒ రామిరెడ్డి, తహసీల్దార్ ఇక్బాల్, నాయబ్ తహసీల్దార్ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

## బ్లాక్‌లో యూరియా విక్రయిస్తే చర్యలు తప్పవు: ములుగు సిఐ సురేష్



**ప్రజాపక్షం/ములుగు:**బ్లాక్‌లో యూరియా విక్రయిస్తే చర్యలు తప్పవని ములుగు సిఐ సురేష్ అన్నారు. గురువారం ములుగు పిఎసిఎస్ గోదాములను ములుగు ఎస్ఐ వెంకటేశ్వరరావు, ఎఒవరదేశ్వర్‌లతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ గోదాములో యూరియా నిల్వలు ఎంత వరకు ఉన్నాయో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇంకాఎంతో అవసరం ఉం, సరిపడా నిల్వ ఉంచుకోవాలని, బ్లాక్‌లో విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ఎరువుల అక్రమ రవాణను అడ్డుకట్ట వేసేందుకు ములుగు లెవెండ్ చేటిబిడ్డి వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి తనిఖీలు చేయడం జరుగుతుందని తెలిపారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేసిన డిఇఒ వాసంతి



**ప్రజాపక్షం/వేలేరు :** వేలేరు మండలంలోని విద్యా సంస్థలైన గురకుల పాఠశాల కళాశాల,గొల్లకిష్టంపల్లిలోని కస్తూర్భగాంధి బాలికల విద్యాలయం,ప్రాథమిక పాఠశాలను హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు,ఈసంధర్భంగా వాసంతి మాట్లాడుతూ వివిధపాఠశాలలో ఆకస్మిక తనిఖీలో బాగంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుకోవడమే కాకుండా ఏవైనా అభివృద్ధి పనులు అవసరమా అనేది తెలుసుకోవడం జరిగిందని ఈపాఠశాలలలో విద్యా సజావుగానే ఉందని తెలిపారు.కార్యక్రమంలో గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (జిసిడిఒ) సునీత,ఎంపిడిఒ లక్ష్మీ ప్రసన్న,మండల విద్యాశాఖ అధికారి మొగిళిచెర్ల శ్రీనివాస్,ఎఇరూపాదేవి,గురకుల పాఠశాల ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్ ,కస్తూర్భాగాంధి పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే పొలం బాట



**ప్రజాపక్షం/రాయపర్తి:** విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే పొలం బాట కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని టెక్నికల్ డీఈ ఆనందం, ఆరేషన్ డిఇ బిక్షపతి అన్నారు. గురువారం మండలంలోని పెరికేడు గ్రామంలో రైతులతో కలిసి పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన సర్వీసు వైరు వాడితే విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా ఉంటాయన్నారు. రైతులు విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. లూజ్ లైన్‌లో 3 మిడిల్ పోల్స్, సిఐ ఎర్త్ పైపులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఎడిఇ నటరాజ్, ఎఇరవళి, సబ్ ఇంజినీర్ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## 6వ వార్డులోక్లీన్ అండ్ గ్రీన్




**ప్రజాపక్షం/మరిపెడ;**డిప్యూటి స్పీకర్, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ ఆదేశాల మేరకు గురువారం 6వ వార్డులో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ తాజుద్దీన్ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. వార్డులోని మైనార్టీ కాలనీలో పెరిగిన మెక్కలను చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్బంగా తాజుద్దీన్ మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన సాగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా రేపు 7వ వార్డులో జరిగే శ్రమదానం కార్యక్మంలో 15వార్డులకు చెందిన ఇంచార్జిలు బిఎల్ఓలు, ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ అప్జల్, వీసారపు శ్రీపాల్‌రెడ్డి, ఎస్‌సి సెల్ పట్టణ అధ్యక్షులు బాషిపంగు రవికాంత్, 6వ వార్డు ఇంచార్జి దేవరశెట్టి లక్ష్మి నారాయణ, మండల యూత్ ఉపాధ్యక్షులు జాటోత్ సురేష్‌నాయక్, అనంతగిరి రవి, బల్లెం రవి, జాటోత్ లక్ష్మ ణ్, బోర లింగమూర్తి, బోడ శంకర్, బోడ రమేష్, ఇస్లావత్ తిరుపతి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

**ప్రజాపక్షం/జనగామ :**తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు జనగామలోని మినీ స్టేడియంలో ఘనంగా జరిగాయి. ఈ పోటీలకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటీఆడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడాలకు అత్యంత ప్రాముఖ్యత ఇస్తుందన్నారు. క్రీడా ప్రాంగణాలకు తీర్చిదిద్దడంతో పాటు పాఠశాల స్థాయి నుండి కళాశాల స్థాయి వరకు అనేక పోటీలు నిర్వయించడం జరుగుతుందన్నారు. యువతను తీర్చిదిద్దాలనే లక్ష్యంగా క్రీడాలు నిర్వయించడం జరుగుతుందన్నారు. క్రీడాకారులకు రెండు శాతం పొజిషన్ ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరు విధిగా క్రీడల్లో పాల్గొని శారీరక ఆరోగ్యం, పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణగౌడ్ పాల్గొని మాట్లాడారు. జనగామలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ క్రీడలు భవిష్యత్తులో ఇతర క్రీడాలకు ఉపయోగపడతాయన్నారు.యువజన క్రీడాధికారి బైరెడ్డి వెంకట రెడ్డి, తెలంగాణ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, తెలంగాణ క్రీడల నిర్వహణ కార్యదర్శి పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, జనగామ ఇజిల్లా అదర్స్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్, కోశాధికారి అవుల అశోక్, నిర్వహణకార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ వారాహి హోటల్ ప్రారంభోత్సవం



**ప్రజాపక్షం / హనుమకొండటౌన్ :** హనుమకొండలోని రెడ్డి కాలనీ శ్రీ వారాహి హోటల్ ప్రారంభోత్సవం చైర్మన్ సుమన్ చేతుల మీదుగా జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ సుమన్ మాట్లాడుతూ వరంగల్ నగరం రోజురోజుకుఅభివృద్ధి చెందుతున్నదని, దానికి అనుగుణంగా లగ్జరీ రూమ్స్, డీలక్స్ రూమ్స్, సూట్ రూమ్స్, బఫెట్ హాల్స్, కాన్ఫరెన్సహాలు, ఫ్యామిలీ రెస్టారెంట్, సెంట్రల్ ఏసి,అందరికీ అందుబాటు ధరలకు లభించేటట్లు శ్రీ వారాహి హోటలను నిర్మించడం జరిగిందన్నారు. అలాగే శ్రీ వారాహి హోటల్‌లో ఆన్లైన్ బుకింగ్ కూడా అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్,బంధువులు, శ్రేయోభిలాషులు, ప్రజాప్రతినిధులు, హోటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# చేనేత కార్మికులు ఆర్థికంగా ఎదగాలి: కలెక్టర్




చేనేత కార్మికుల ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం /వరంగల్ :** ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సదుపాయాలను వినియోగించుకొని చేనేత కార్మికులు ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత శాఖ ఆధ్వర్యంలో గురువారం వరంగల్ కొత్తవాడ ఇందిరాగాంధీ విగ్రహం నుండి కెమిస్ట్ భవన్ వరకు నిర్వహించిన ర్యాలీను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రారంభించారు. అనంతరం కెమిస్ట్ భవన్ లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ చేనేత వృత్తి జీవనోపాధి కాదు, భారత సంస్కృతిని ప్రతిభింభించే ప్రతీక అని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం తర్వాత చేనేత రంగం అత్యధిక జనాభాకు ఉపాధి కల్పిస్తూ దేశంలోని మొత్తం వస్త్ర ఉత్పత్తిలో 19 శాతం భాగస్వామ్యం కలిగియున్నదన్నారు. ప్రపంచం అన్ని రంగాల్లో వేగంగా మారుతున్న నేపథ్యంలో చేనేత రంగం కూడా సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి అనేక కష్టాలు పడే వారని, నేడు ఆన్‌లైన్ మార్కెట్లు, డిజిటల్ పోర్టల్స్ ప్రభుత్వ వేదికలు వంటి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ మార్పులను అంగీకరించి, తరం నుండి తరం వరకు నైపుణ్యాన్ని కొనసాగించడమే కాకుండా, ఆదాయాన్ని పెంపొందించే దిశగా చేనేత కుటుంబాలు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత వృత్తులు కనుమరుగు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత చేనేత కార్మికులపై ఉందన్నారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా మన ప్రాంతానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉండేలా డిజైన్తో వస్తువు తయారు చేసి ఇతర రాష్ట్రాల దేశ ప్రముఖులు సందర్శించినప్పుడు బహూకరించవచ్చన్నారు. ఇప్పటికే వరంగల్ జిల్లా ఉత్పత్తులు జి ఐ ట్యాగ్ పొందాయని ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు. వినూత్నమైన డిజైన్స్ తో ఉత్పత్తులను నేస్తే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఇటీవల మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ వరంగల్ నగరాన్ని సందర్శించినప్పుడు వరంగల్ డర్రితో కూడిన జ్ఞాపకాలను అందించడం జరిగిందన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్లో చేనేత ఉత్పత్తుల స్టాల్స్ ఏర్పాటు చేసి చేనేత ఉత్పత్తులు విక్రయించేలా ప్రోత్సహించడం జరుగుతున్నదని అన్నారు. జిల్లాలో 2300 మంది నేత కార్మికులు ఉన్నారని, చేనేత రంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదన్నారు. ఈ సందర్భంగా చేనేత ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇస్తామని ప్రతిజ్ఞ చేశారు. చేనేత కార్మికులను ఘనంగా సన్మానించి, చేనేత పై నిర్వహించిన పకృత్వ ఉపన్యాస పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బసవరాజు కుమార్, జెడ్పిసిఈఓ రామిరెడ్డి, జిల్లా చేనేత జౌళి అధికారి శ్రీకాంత్ రెడ్డి , చేనేత సంఘాల నేతలు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి



**ప్రజాపక్షం/ములుగు:**సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్దరించాలని ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని పాఠశాల ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారంకై ధర్నా చేస్తుండగా వారికి మద్దతుగా ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బడే నాగజ్యోతి మాట్లాడుతూ జీవో నెంబర్ 25ను సవరించాలని, ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరూ ఉపాధ్యాయులు ఉండాలని, సబ్జెక్టు వర్క్ లోడ్‌కు అనుగుణంగా టీచర్ పోస్టులను కేటాయించాలని ఆమె కోరారు. ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు, షెడ్యూల్స్ తక్షణమే విడుదల చేయాలని, అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. జీవో 317 కారణంగా స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులను వారి స్థానాలకు బదిలీ చేయాలని, అర్హత లేని ఆరోపణలున్న డిఈఓలను తొలగించాలని, దీర్ఘకాలంగా ఒకే జిల్లాలో ఉన్న వారిని కూడా బదిలీ చేయాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు, ములుగు మండలాధ్యక్షుడు సాని కొమ్ము రమేష్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ , తదితరులు పాల్గొన్నారు.

## వెట్టిచాకిరికి గురవుతున్న వంట కార్మికులు

### సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి




**ప్రజాపక్షం/హనుమకొండ :** వెట్టి చాకిరీకి గురవుతున్న వంట కార్మికులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట తెలంగాణ మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి జిల్లా సమితి ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కర్రె బిక్షపతి మాట్లాడుతూ 2002 సంవత్సరం నుండి ప్రభుత్వ విద్యా సంస్థల్లో పౌష్టికాహారం అందించాలని, కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులురాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధుల కేటాయింపుతో మధ్యాహ్న భోజనం పథకం కొనసాగుతోందని,అప్పటి నుండి వంట కార్మికులకు ఒక వెయ్యి రూపాయలు మాత్రమే గౌరవ వేతనం అందించి కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు చేతులు దులుపుకున్నాయన్నారు. మరొక పక్క ప్రతి విద్యార్థికి పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాల్సిన అవసరం ఉందని, కానీ పూర్తిగా నిర్లక్ష్యం వహించడం వల్ల వంట కార్మికులు అప్పుల పాలై కనీస వేతనం 26వేల రూపాయలు నోచుకోక వెట్టి చాకిరీకి గురవుతూ అప్పుల పాలవుతున్నారన్నారు. బిల్లులు సకాలంలో అందక వంట కార్మికులు అప్పులు తీసుకువచ్చి ఇబ్బందులకు గురవుతున్నారని,మరోవైపు వంట పాత్రలు, కోడిగుడ్లు, గ్యాస్ సిలిండర్లు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు పదివేల రూపాయలు గౌరవ వేతనం అందిస్తామని చెప్పిఇప్పటికీ అమలు చేయలేదని అన్నారు. వంట కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని,ప్రభుత్వమే వంట పాత్రలు, గ్యాస్ సిలిండర్లు, కోడిగుడ్లు సరఫరా చేసి కనీస వేతన చట్టాన్ని ప్రకారం 26 వేల రూపాయలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో తమ సమస్యల పరిష్కారం వెంటనే పరిష్కరించాలని వంటకార్మికులు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమానికి ధర్మల రామ్మూర్తి అధ్యక్ష వహించగా ఎఐటియుసి జిల్లా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

## ఇనుగుర్తి మండలంలో ఆకస్మిక తనిఖీలు



**ప్రజాపక్షం/మహబూబాబాద్:**మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎంపీడీవో,తహసిల్దార్, కార్యాలయాలు, ఫర్టిలైజర్ షాప్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ లను జిల్లా (ఇన్చార్జి) కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రధానంగా హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్, రైతులకు సంబంధించి ఎరువుల నాణ్యత, ప్రజలకు సత్వరమైన సేవలు పై ప్రత్యేక దృష్టి పెట్టి పారదర్శకంగా కార్యకలాపాల నిర్వహణకు శ్రీకారం చుట్టిందని అందులో భాగంగానే క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరు వారికి కేటాయించిన విధులను క్రమం తప్పకుండా చిత్తశుద్ధితోపనిచేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సబ్ సెంటర్ల వారీగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని అవసరమున్న చోట వైద్య శిబిరాలు నిర్వహించాలని, ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్లకు అందుబాటులో వైద్యులు ఉండాలని, ప్రతి ఒక్కరి ఆరోగ్య నివేదికలు సిద్ధం చేయాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, మాత శిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని,రానున్న రోజుల్లో నిర్వహించే నూలు పురుగు దినోత్సవం, బోదకాలు నివారణ కార్యక్రమం మందుల పంపిణీ షెడ్యూల్ ప్రకారం సంబంధిత సిబ్బందితో విజయవంతం చేయాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది హాజరు, మందుల స్టాక్ వివరాలను తనిఖీ చేశారు.మండల కేంద్రంలోని కిషన్ నాయక్ అగ్రి మాల్ సీడ్స్, స్టాక్, తనిఖీ చేశారు.జిల్లాలో డిమాండ్ కనుగుణంగా రైతులకు కావలసిన యూరియా, డిఏపి, తదితర ఫర్టిలైజర్స్ అందుబాటులో ఉన్నాయని రైతుల వివరాల ద్వారా ఇప్పటికే సిద్ధంగా ఉంచడం జరిగిందని అన్నారు. కల్తీ ఎరువులు, ఫర్టిలైజర్స్ అమ్మకాలు జరిపితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసి పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలను వారిని అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు షెడ్యూలు ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించి విద్యార్థినిల యొక్క ఆరోగ్య, మానసిక స్థితిగతులను పరిశీలిస్తూ ఉండాలన్నారు. అవసరం ఉన్నచోట మానసిక వైద్య నిపుణుల చేత కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేతన్నల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/వరంగల్ :** చే నేత సంక్షోభానికి పాలకు లు అనుసరిస్తున్న పెట్టుబడిదారీ విధానాలే కారణమ ని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం స ందర్భంగా వరంగల్ కొత్తవా డలో చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ము ఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రాము లు ప్రసంగిస్తూ ..చేనేతకు రిజర్వ్ చేసిన వస్త్రాలను మిల్లులలో ఉత్పత్తి చేసినవారిపై చర్యలు తీ సుకునే నాధుడేలేడన్నారు. చేనేత అభివృద్ధి కోసం చర్చించాల్సిన ఆలిండియా హైండ్లూమ్ బోర్డును రద్దుచేసి, చేనేతపై జిఎస్టి విధించి, అనేక పథకాలు రద్దుచేసి నేతన్నలకు మోదీ ప్రభుత్వం ద్రోహం చేసిందన్నారు. చేనేతల అభివృద్ధి కి చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. నేతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ అమలుకాలేదన్నారు . పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీరేట్లు పెంచాలని, చేనేత పెన్షన్ రూ.5వేలకు అందించాలన్నారు. దొంతుల శంకరయ్య,రమ,పుణ్యవతి,రాధ,రమ్య,రాణి తదితరులు పాల్గొన్నారు.

## పలు సమస్యలపై కల్లు గీతకార్మికుల బైక్ ర్యాలీ




**ప్రజాపక్షం/మంగపేట:**మండలం పరిధిలోని కమలాపురం అంబేద్కర్ విగ్రహం సెంటర్ నుంచి మండల కేంద్రం వరకు కల్లు గీత కార్మికా సంఘం మంగపేట మండల అధ్యక్షుడు రావుల శ్రీనివాస్ గౌడు ఆధ్వర్యంలో గురువారం గౌడుల సమస్యలపై గలం మెత్తుతూ వంద మందితో బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కల్లు గీతా కార్మిక సంఘం ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవి గౌడ్ జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు రంగు సత్యం గౌడ్ పాల్గొన్నారు. జిల్లా నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీలో నివసిస్తున్నటువంటి కల్లుగీత కార్మికులు ఎన్నో రకాల సమస్యలను ఎదుర్కొంటూ ఇబ్బందులు పడుతూ దుర్బరమైన జీవితాన్ని గడుపుతున్నారని ఏజెన్సీలో రద్దు చేసినటువంటి సొసైటీలను వెంటనే పునరుద్ధరించాలని, సభ్యత్వాల నమోదు చేసి కల్లు గీతా కార్మికులకు సేఫ్టీ మోకులు ఇవ్వాలని, 50 సంవత్సరాలు నిండిన వారికి వృత్తి పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ గౌడులకు రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక హక్కు అయినటువంటి గిరిజనులుగా గుర్తించడం అనేది వెంటనే అమలు చేయాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ నాటి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటను స్వయంగా తానే ముఖ్యమంత్రిగా ఉన్నాడు కాబట్టి వెంటనే నెరవేర్చి గౌడులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సేఫ్టీ మోకులు అందించి ప్రమాదంలో చనిపోయినటువంటి వారికి ఎక్స్రేషియా 10 లక్షలు ఇవ్వాలని సంఘం తరఫున డిమాం డ్ చేశారు. హామీలు నెరవేర్చకుండా ఇలాగే కొనసాగితే రాబోయే స్థానిక ఎన్నికలలో తప్పకుండా కాంగ్రెస్ కు తగిన బుద్ధి చెప్తామని గీతన్నలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఆగస్టు 2 నుంచి 18 వరకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలలో భాగంగా, కల్లుగీత కార్మిక అమరుల యాధిలో ప్రతి మండలంలోని ప్రతి గీత కార్మికుడి సమస్యను గుర్తించాలని డిమాండ్ చేస్తూ, ములుగు జిల్లా పరిధిలోని ప్రతి మండలంలో ఇలాంటి బైక్ ర్యాలీలు నిర్వహించడం జరుగుతుందని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలోమకూరి భీముడు, గడ్డం పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలి

### ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ డిమాండ్

**ప్రజాపక్షం/వరంగల్ :** ఇఎస్‌ఐ కాంట్రాక్టు కార్మికులకు గత 12 నెలల జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే వారికి జీతాలు చెల్లించాలి ఎఐటియుసివరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. వరంగల్ పట్టణంలోని లేబర్ కాలనీ ఇఎస్‌ఐ ఆసుపత్రిలో పనిచేయుచున్న స్వీపర్స్, సెక్యూరిటీ కార్మికులకు వేతనాలను చెల్లించాలని కోరుతూ గురువారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆసుపత్రిలో పనిచేయుచున్న కాంట్రాక్ట్ కార్మికుల ఎవరికి కూడా గత 12 నెలలుగా జీతాలు అందకపోవటం వలన కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఆ జీతాలు కూడా 3 నెలలకు ఒకసారి కూడా ఇవ్వకుండా కాంట్రాక్టర్లు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్మిక శాఖ పరిధిలో ఉన్నటువంటి ఇఎస్ఐ ఆసుపత్రిలో ఇ ఇకార్పొరేషన్‌కు డైరెక్టర్ లేకపోవడం వలన ఆసుపత్రిలో పనులు సక్రమంగా జరగటం లేదని, కాంట్రాక్ట్ కార్మికుల జీతాల విషయమై గతంలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం ఇవ్వడం ద్వారా 2 నెలల జీతం మాత్రమే కార్మికులకు కాంట్రాక్ట్ సంతోష్ ఇవ్వడం జరిగిందని, కాని ఇంకా12నెలల జీతం పెండింగులో ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం అధికారులు వెంటనే చొరవ తీసుకొని కార్మికులకు రావలసిన 12 నెలల జీతాలు వెంటనే చెల్లించి ప్రతినెలా సక్రమంగా జీతాలు అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## 13 జిల్లాల్లో జీరో కేసులే కమిషన్ లక్ష్యం

### రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

**ప్రజాపక్షం/జనగామ :**తెలంగాణలోని 13 జిల్లాల్లో జీరో కేసులే లక్ష్యంగా సమాచారం హక్కు చట్టం కమీషన్ ముందుకు సాగుతుందని ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సమాచార హక్కు చట్టంపై అందరికి అవగాహన అవసరమని, సమాచారం కావాలని కోరిన వారు అడిగిన 30 రోజుల్లో తప్పక సమాచారం ఇవ్వాలన్నారు. సమాచార శాఖ కమీషన్ గురువారం జనగామ జిల్లాలో పర్యటించింది. రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి చంద్రశేఖర్‌రెడ్డి, కమిషనర్లు అయోద్యరెడ్డి, పివి శ్రీనివాసరావు, పర్వీన్ మోసిస్నా, మేర్వ వైష్ణవిలు పర్యటించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులు, పిఐఓలు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్, అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డిసిపి రాజమహేంద్రనాయక్‌తో కలిసి కమీషనర్ డాక్టర్ జి చంద్రశేఖర్‌రెడ్డి సమాచార హక్కు చట్టంపై సమగ్రంగా వివరించారు. చట్టం తీసుకురావడానికి కారణాలు, అందులోని క్లాజ్‌లు, ఏఏ సమాచారం ఎలా ఇవ్వాలి, చట్టం ఏం చెబుతుంది, ఇవ్వకుంటే జరిగే పరిణామాలను సమగ్రంగా వివరించారు. సమాచారం ఇవ్వకుండా తప్పించుకునే మార్గాలను వెతకొద్దని, తమ వద్ద ఉన్న సమాచారం తప్పక ఇవ్వాలన్నారు. ప్రస్తుతం ఉన్న వారందరం కేసులు, జిల్లాలను టార్గెట్‌గా పెట్టుకొని పనిచేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 6వేలకు పైగా కేసులు ఉన్నాయని, వీటిని త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంతో ముందుకు పోతున్నామన్నారు. తాము పరిశీలించిన వాటిలో 13 జిల్లాల్లో తక్కువగా కేసులు ఉన్నాయని, ఈ జిల్లాల్లో పూర్తిగా కేసులు పరిష్కరించి జీరో జిల్లాలుగా చూపించాలనే లక్ష్యంతోనే కమీషన్‌లో ఉన్న సభ్యులు అందరూ జిల్లాలను పంచుకొని పనిచేయడం జరుగుతుందన్నారు. గ్రామ పంచాయితీల్లో ఎక్కువ కేసులు నమోదు అవుతున్నాయన్న మాట వాస్తవమని, అక్కడ అప్లీవిట్ అధికారి లేకపోవడం, గ్రామ కార్యదర్శియే సమాధానం ఇవ్వాల్సి రావడం, ఏడాదిన్నరగా పంచాయితీల్లో పాలక వర్గాలు లేకపోవడం వంటివి ఉన్నాయన్నారు. ఎంపిడిఓ స్థాయి అధికారులు సమాచార అధికారులుగా ఉండాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డిసిపి రాజమహేంద్రనాయక్‌తో పాటు పలు శాఖల అధికారులు, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 163 కేసుల్ని విచారించారు. బాధితుల ద్వారా సమాచారం తీసుకున్నారు.



**మొక్కలు నాటిన కమిషనర్**

వనమహోత్సవంలో భాగంగా సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్ డాక్టర్ జి చంద్రశేఖర్‌రెడ్డి మొక్కలు నాటారు. ఆయన రాక సందర్భంగా పోలీసులు గౌరవ వందనం చేశారు. కమీషన్ ఉన్నంత వరకు కలెక్టరేట్ సమీపంలో ఎవరిని లోనికి రానివ్వలేదు. జనగామ సిఐ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వయించారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్, అదనపు కలెక్టర్ పింకేషన్ కుమార్‌లు బోకేలు అందజేసి స్వాగతం పలికారు.

# క్రీడ

## ఎప్పటికీ ఎల్లో జెర్సీలోనే ఆడు



చెన్నై సూపర్ కింగ్స్ ప్లేయర్ ఎంస్ ధోనీ ఆ జట్టుతోనే భవిష్యత్తులో కొనసాగనున్నాడు. ఇటీవల జరిగిన ఓ ఈవెంట్‌లో అతను ఆ క్లారిటీ ఇచ్చాడు. 2008 నుం చి ఐపిఎల్‌లో చెన్నై టీమ్‌తోనే ధోనీ ఆడుతున్నాడు. అతని సారథ్యంలో ఆ జట్టు అయిదుసార్లు టైటిల్ కూడా నెగ్గింది. అయితే గత కొన్ని సీజన్ల నుంచి సీఎస్కే జట్టు సరిగా పర్ఫార్మ్ చేయడం లేదు. దీంతో ధోనీ కెప్టెన్సీ సామర్థ్యంపై అనుమానాలు వ్యక్తం అయ్యాయి. చివరి సీజన్‌లో రుతురాజ్ గైక్వాడ .. సీఎస్కే కెప్టెన్‌గా బాధ్యలు చేపట్టాడు. ధోనీ కెరీర్ ముగిసిందా అన్న అనుమానాలకు అతనే తెర దింపాడు.

## సచిన్, కోహ్లీ అవుతావా? అని ఎగతాళి చేశారు : హర్షిత్ రాణా



క్రికెటర్ అవుతానంటే.. సచిన్, కోహ్లీ అవుతావా? అని తన బంధువులు, స్నేహితులు, చుట్టు పక్కల వాళ్లు ఎగతాళి చేశారని టీమిండియా యువ పేసర్ హర్షిత్ రాణా తెలిపాడు. వీడి గురించి ఎక్కువ ఊహించుకుంటున్నావని, టైమ్ వృథా చేసుకుంటున్నావని తన తండ్రిని నిరుత్సాహపరిచే ప్రయత్నం చేశారని హర్షిత్ రాణా గుర్తు చేసుకున్నాడు. తాను టీమిండియాకు ఆడిన తర్వాత అందరూ మాట మార్చారని చెప్పాడు. కష్టానికి తగ్గ ఫలితం దక్కిందని తన తం డ్రిని కొనియాడారని, అది తనకు వింతంగా అనిపించిందని తెలిపాడు. తనకు కూడా ఫోన్లు చేశారని, కానీ తాను ఎత్తలేదని పేర్కొన్నాడు. తాజాగా ఓ పాడ్‌కా స్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్న హర్షిత్ రాణా.. చిన్నప్పుడు తన చుట్టూ ఉన్నవారు డిస్కరేజ్ చేస్తూ అన్న మాటలను గుర్తు చేసుకున్నాడు. 'మనకు ఒక్కసారిగా పేరు, ప్రఖ్యాతలు, గుర్తింపు రాగానే.. అప్పటి వరకు దూరంగా ఉన్న వ్యక్తులం తా దగ్గరవుతారు. చిన్నప్పుడు నేను క్రికెటర్ అవుతానంటే నవ్విన నా సోదర సో దరీమణులు, మా బంధువులు.. అనవసరంగా వాడి కోసం కష్టపడుతున్నావం టూ మా నాన్నను నిరుత్సాహపరిచే ప్రయత్నం చేసిన వాళ్లు ఎంతో మంది ఉన్నా రు. వీడి వల్ల ఏం కాదు. క్రికెట్ ఆడిన ప్రతోడు సచిన్, కోహ్లీ అవుతాడా? అని హేళన చేశారు. వాళ్లే ఇప్పుడు మా నాన్నకు ఫోన్ చేసి నీ కష్టానికి ఫలితం దక్కిందంటూ పొగడటం వింతగా అనిపిస్తుంది. వాళ్లు నాకు కూడా ఫోన్లు చేస్తారు. కానీ నేను అస్సలు ఎత్తను. ఇదే నా అటిట్యూడ్ కాదు. గతంలో వాళ్లు నన్ను చాలా హేళన చేశారు. అలాంటి వాళ్లతో మాట్లాడాల్సిన అవసరం లేదనేది నా అభిప్రాయం.'అని హర్షిత్ రాణా ఆవేదన వ్యక్తం చేశాడు.

## గిల్ చేతికి దేశవాళీ జట్టు పగ్గాలు..



సీనియర్లు లేకుంటేనేం ఇంగ్లాండ్ గడ్డపై సిరీస్ సమం చేసిన శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా నూరు మార్కులు కొట్టేశాడు. నాయకుడిగా ముందుండి నడిపిస్తూ.. తనకిచ్చిన స్క్వాడ్‌ను సమర్థంగా ఉపయోగించుకొని 'మిస్టర్ పర్ఫెక్ట్' అనిపించుకున్నాడు. అండర్సన్ – టెండూల్కర్ ట్రోఫీని పంచుకున్న ఉత్సాహంతో స్వదేశం వచ్చిన గిల్‌కు మళ్లీ కెప్టెన్ బాధ్యతలు అందుకున్నాడు. దేశవాళీ సీజన్‌లో అతడు నార్త్ జోన్ సారథిగా ఎంపికయ్యాడు. దులీప్ ట్రోఫీ కోసం గురువారం సెలెక్టర్లు గిల్ నాయకత్వంలో 15 మందితో కూడిన బృందాన్ని ప్రకటించారు. ఆగస్టు నెలాఖర్లో దులీప్ ట్రోఫీ ప్రారం భం కానుంది. జోన్ల ఫార్మాట్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో గిల్ కె ప్టెన్సీలో నార్త్ జోన్ టైటిల్ వేటకు సిద్ధమవుతోంది. సెలెక్టర్లు ఎంపిక చేసిన స్క్వాడ్‌లో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానాలతో పేస్ దళం పటిష్టంగా ఉంది. ఒకవేళ ఈ గిల్ ఆసియా కప్ ఆడాల్సి వస్తే శుభం రొహిల్లా నార్త్ జోన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని సెలెక్టర్లు తెలిపారు.

**నార్త్ జోన్ స్క్వాడ :** శుభ్‌మన్ గిల్(కెప్టెన్), శుభం ఖజురియా, అంకిత్ కుమార్ (వైస్ కెప్టెన్), ఆయుష్ బదొని, యశ్ దయాల్, అంకిత్ కల్సి, నిశాంత్ సింధు, సాహిల్ లొత్రా, మయాంక్ దగర్, యధ్‌వీర్ సింగ్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానా, అన్షుల్ కంభోజ్, అఖీబ్ నబీ, కన్హయ్య వధావన్ (వికెట్ కీపర్).

**రీప్లేస్‌మెంట్స్ :** ఒకవేళ గిల్, అర్ష్‌దీప్, హర్షిత్‌లు ఆసియాకప్ స్క్వాడ్‌కు ఎంపికైతే వీళ్ల స్థానాన్ని భర్తీ చేసేందుకు ముగ్గురిని ఎంపిక చేశారు సెలెక్టర్లు. శుభం రొహిల్లా (గిల్), గుర్నూర్ (అర్ష్‌దీప్ సింగ్), అనుజ్ థక్రాల్ (హర్షిత్ రానా).

**స్టాండ బైస్ :** శుభం అరోరా, జస్కరణ్‌వీర్ సింగ్, రవి చౌహన్, అబిడ ముస్తాక్, నిషంక్ బిర్లా, ఉమర్ నజీర్, దివేష్ శర్మ.

ఇంగ్లాండ్ పర్యటనతో టెస్టు కెప్టెన్‌గా పగ్గాలు అందుకున్న గిల్ అంచనాలకు మించి రాణించాడు. సీనియర్లు లేనిలోటు కనిపించినా.. జట్టు ప్రదర్శన మాత్రం ఇసుమంతైనా తగ్గకుండా చూసుకున్నాడు. లీడ్స్‌లో ఓటమితో సిరీస్ ఆరంభించినా పట్టువదలక బర్మింగ్‌హమ్‌లో రికార్డు విజయంతో సిరీస్ సమం చేసింది గిల్ సే న. ఆ మ్యాచ్‌లో రెండు శతకాలతో చెలరేగాడు గిల్. అనంతరం లార్డ్స్‌లో అసమానంగా పోరాడినా 21 పరుగుల దూరంలో ఆగిపోయింది భారత్. ఇక మాంచెస్టర్‌లో సున్నాకే రెండు వికెట్లు పడి న వేళ కెప్టెన్ గిల్ ఓపెనర్ కెఎల్ రాహుల్‌తో పాటు క్రీజులో పాతుకుపోయాడు. చివరిరోజు సుందర్, జడ్డూల శతకాలతో డ్రాగా ము గిసిందా టెస్టు. నిర్ణయాత్మక ఓవల్ టెస్టులో టీమిండియా యశస్వీ సెంచరీ.. సిరాజ్ సూపర్ స్పెల్ కారణంగా అద్భుత విజయంతో సిరీస్ సమం చేసింది. ఎన్నో అనుమానాల నడుమ జట్టును గొప్పగా నడిపించిన గిల్ బ్యాటర్‌గా 754 రన్స్‌తో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ పట్టేశాడు.


## ఫోకస్ | స్పోర్ట్స్ | తెర వెనుక ఎవరు?

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరిగిన 5 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ డ్రా (2–2)గా ముగియడం భారత క్రికెట్ అభిమానులకు ఊరటనిచ్చి ఉండవచ్చు. అత్యంత కీలకమైన చివరి టెస్టులో టీమిండియా ఆరు పరుగుల తేడాతో గెలిచి, పరువు నిలబెట్టుకున్న వైనం అందరినీ ఆకట్టుకుంటున్నది. అదే సమయంలో ఈ టెస్టు సిరీస్ పేరు మార్చడంపై క్రికెట్ వర్గాల్లో చర్చ కొనసాగుతున్నది. పటౌడీ (మన్సూర్ అలీఖాన్ పటౌడీ) పేరుమీద ఉన్న ఈ ట్రోఫీకి ఆండర్సన్–తెండూల్కర్ ట్రోఫీగా పేరు ఖరారు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పేరు మార్పు వెనుక ఎవరున్నారనే ప్రశ్న తెరపైకిరాగా, అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) అధ్యక్షుడు జై షా పేరు ప్రధానంగా వినిపిస్తున్నది. గత ఏడాది డిసెంబర్ ఒకటిన ఐసిసి అధ్యక్ష పదవిని చేపట్టినప్పుడు అతని వయసు 36 సంవత్సరాలు. ఐసిసికి అత్యంత పిన్న వయస్కుడైన అధ్యక్షుడిగా రికార్డు పుస్తకాల్లోకి ఎక్కాడు. మన దేశం నుంచి ఇంతకు ముందు జగ్‌మోహన్ దాల్మియా, శరద్ పావర్, శ్రీనివాసన్, శశాంక్ మనోహర్ ఈ పదవిని నిర్వహించగా, ఇప్పుడు జై షా వారి అడుగుజాడల్లో నడుస్తున్నాడు. ప్రపంచంలోనే అత్యధిక ఆదాయ వనరులున్న భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) ప్రధాన కార్యదర్శిగా 2022లో ఎన్నికైన అతను 2025 వరకూ ఈ పదవిలో కొనసాగుతాడు. అదే సమయంలో ఐసిసి అధ్యక్షుడిగా కూడా ఎన్నికయ్యాడు. దీనితో జోడు పదవులు అనుభవిస్తున్నాడు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కుమారుడైన కారణంగానే జై షాకు ఇన్ని అవకాశాలు వస్తున్నాయని, లేకపోతే అతనికి క్రికెట్‌లో ఎలాంటి పదవి దక్కేది కాదన్న విమర్శల్లో నిజం లేకపోలేదు. క్రికెట్‌తో ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేని ఒక వ్యక్తి ఏకంగా ప్రపంచ క్రికెట్‌ను శాసించడం విచిత్రం. కరడుగట్టిన ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం ఉన్నందున, పటౌడీ ట్రోఫీ పేరును మార్చడానికి ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డ్ (ఇసిబి)పై ఒత్తిడి తెచ్చి ఉంటాడన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి అటు ఇంగ్లాండ్.. ఇటు భారత్‌లో క్రికెట్ రంగానికి ఇద్దరు పటౌడీలు తమ వంతు సేవలు అందించారు. నవాబ్ మహ్మద్ ఇఫ్తికర్ అలీ ఖాన్ పటౌడీ (సీనియర్ పటౌడీ) 1910 మార్చి 16న జన్మించాడు. 1932 నుంచి 1946 మధ్యలో టెస్టు క్రికెట్ ఆడాడు. 1932–1934 మధ్య ఇంగ్లాండ్‌కు ప్రాతినిధ్యం వహించాడు. తాను ఆడిన మూడు టెస్టుల్లోనూ ఇంగ్లాండ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఆ తర్వాత టీమ్ ఇండియా తరపున మూడు టెస్టులు ఆడాడు. ఆ సమయంలో కూడా భారత జట్టుకు కెప్టెన్‌గానే ఉన్నాడు. అయితే 41 ఏళ్ల చిన్న వయసులోనే ఇఫ్తికర్ అలీ ఖాన్ పటౌడీ చనిపోయాడు. ఇండియా, ఇంగ్లాండ్ జట్లకు టెస్టుల్లో ప్రాతినిధ్యం వహించిన ఏకైక క్రికెటర్ అతని పేరు చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. సీనియర్ పటౌడీ ఏకైక కుమారుడు మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ తండ్రి వారసత్వాన్ని స్వీకరించాడు. 'టైగర్ పటౌడీ' అని అభిమానులు అతనిని ముద్దుగా పిలుచుకుంటారు. భారత జట్టు తరపున 1961 నుంచి 1975 వరకు క్రికెట్ ఆడాడు. ససెక్స్, ఢిల్లీ, హైదరాబాద్ జట్ల తరపున డొమెస్టిక్ క్రికెట్‌నూ పాల్గొన్నాడు. కెరీర్‌లో 46 టెస్టులు, 310 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన పటౌడీ.. ఒక అద్భుతమైన బ్యాట్స్‌మన్ మాత్రమేకాదు... గొప్ప కెప్టెన్‌గా కూడా పేరు పొందాడు. టెస్టుల్లో 6 సెంచరీలు, 16 హాఫ్ సెంచరీలు చేశాడు. 203 అతడి అత్యధిక టెస్టు పరుగులు. టెస్టుల్లో టైగర్ పటౌడీ బ్యాటింగ్ యావరేజ్ 88గా ఉందంటే.. ఏ రేంజ్‌లో ఆడేవాడో అర్థం చేసుకోవచ్చు. కేవలం 21 ఏళ్లకే భారత క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన టైగర్ పటౌడీ.. ఆ కాలంలోనే బెస్ట్ ఫీల్డర్‌గా.. వన్ ఆఫ్ ది గ్రేటెస్ట్‌గా గుర్తింపు పొందాడు. టెస్టు క్రికెట్‌లో కెప్టెన్సీకి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు పొందిన ఏకైక క్రికెటర్ అతనే. తండ్రీకొడుకులు ఇద్దరు భారత క్రికెట్‌కు గొప్ప సేవ అందించారు కాబట్టి 'పటౌడీ' పేరు ఇంగ్లాండ్, భారత్ టెస్టు సిరీస్‌కు సరైనదనే భావం చాలా మందిలో ఉంది. కానీ, ఇసిబి హఠాత్తుగా పేరు మార్చేడం చర్చకు తావిస్తున్నది.




పురుషుల విభాగంలో అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ (ఎటిపి), మహిళల విభాగంలో ఉమెన్స్ టెన్నిస్ అసోసియేషన్ (డబ్ల్యుటిఎ) ప్రకటించే ప్రపంచ ర్యాంకింగ్స్‌కు ప్రత్యేక స్థానం ఉంది. టెన్నిస్ ర్యాకెట్ పట్టిన ప్రతి ఒక్కరూ కనీసం 'టాప్ 100'లోనైనా చోటు సంపాదించాలని కోరుకుంటారు. కాగా, వివిధ టోర్నీల్లో సంపాదించిన పాయింట్ల ఆధారంగా ప్రపంచ ర్యాంకింగ్స్‌ను నిర్ధారిస్తారు. ర్యాంకింగ్స్‌కు అవసరమైన పాయింట్ల కోసం జరిగే టోర్నీల్లో 'సిన్సినాటి ఓపెన్' అత్యంత కీలకమైనది.

### ర్యాంకింగ్స్‌కు కీలకం 'సిన్సినాటి' ఓపెన్



అమెరికాలో యుఎస్ ఓపెన్ (1881) తర్వాత అత్యంత పురాతనమైన టెన్నిస్ టోర్నమెంట్‌గా గుర్తింపు పొందిన సిన్సినాటి ఓపెన్ 1899లో మొదలైంది. అధికారికంగా పురుషుల విభాగంలో 'వెస్టర్న్ ఓపెన్', మహిళల విభాగంలో 'సదరన్ ఓపెన్' ఈ టోర్నీకి పిలుస్తారు. కానీ, ప్రపంచ వ్యాప్తంగా టెన్నిస్ అభిమానులకు ఇది 'సిన్సినాటి ఓపెన్'గానే సుపరిచితం. ఇప్పటికీ ఆ పేరుతోనే ఎక్కువ మంది ఈ టోర్నీని ప్రస్తావిస్తూ ఉంటారు. ఈ ఏడాది కూడా టోర్నమెంట్ అభిమానులను ఆకట్టుకోవడానికి సిద్ధంగా ఉంది. గురువారం (ఆగస్టు 7) నుంచి ప్రారంభమయ్యే ఈ టోర్నమెంట్ 18వ తేదీతో ముగుస్తుంది. సిన్సినాటి నగరానికి అత్యంత సమీపంలోని లిడ్నెర్ ఫ్యామిలీ టెన్నిస్ సెంటర్ (మాసన్, ఒహియో)లో టోర్నమెంట్‌ను నిర్వహిస్తారు. చాలా మంది క్రీడాకారులు దీనిని యుఎస్ ఓపెన్ గ్రాండ్ శ్లామ్ టెన్నిస్‌కు ప్రాక్టీస్ సెషన్‌గా కూడా భావిస్తారు. యుఎస్ ఓపెన్‌కు ముందు జరిగే సిన్సినాటి ఓపెన్‌లో భాగంగా, పురుషులు, మహిళలు ఒకే వేదికపై పోటీపడడం విశేషం. ఈ విధంగా ఒకే కోర్టుపై పురుషులు, మహిళల మ్యాచ్‌లను నిర్వహించే విధానం మరే ఇతర టెన్నిస్ టోర్నమెంట్‌లోనూ లేదు. గత ఏడాది పురుషుల సింగిల్స్‌లో జానిక్ సిన్నెర్, మహిళల సింగిల్స్‌లో అరినా సబలెన్కా విజేతలుగా నిలిచారు.

# అయోధ్య లేని లోటు పేదవర్గాలకు నష్టం

తుదిశ్వాస వరకు వీడని పోరాటతత్వం
ప్రజా పోరాటాలే అయోధ్యకు నివాళి
సంతాప సభలో చాడ, కూనంనేని, ఎమ్మెల్యే తెల్లం, సాబీర్‌పాషా







**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** పేదలు, బడు గు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ఎర్రజెండా ఎత్తిన బొల్లోజు అయోధ్యలేనిలోటు పేదవర్గాలు, కార్మికులకు, ప్రజలకు తీరనినష్టమని సిపిఐ జాతీ య కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నా రు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య సంతాప సభ మణుగూరు మండలపరిధిలోని రామానుజవరం గ్రామంలో గురువారం జరిగిం ది. ఈ సందర్భంగా చాడా మాట్లాడుతూ తాను సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న రోజుల్లో చేపట్టిన ప్రజాపోరుయాత్ర సమయంలో ఈప్రాంత సమస్యలపై ఆయోధ్య వివరించారని చెప్పారు. పోడురైతులు పడుతున్న పలు సమస్యలను ప్రత్యక్షంగా చూపించారని, సమస్యల పట్ల ఆయనకున్న అవగాహన, వాటిని పరిష్కరించటానికి ఆయన చేసిన కృషి ప ట్టుదల ఎంతో క్రమశిక్షణతో కూడుకున్నదన్నారు.



**ప్రాణహాని ఉన్నా..భయపడని ధీశాలి కూనంనేని**

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కార్యదీక్ష, క్రమ శిక్షణ, నిబద్ధత గలిగిన నేత అయోధ్య అన్నారు. 40 ఏళ్లపాటు ఈ ప్రాంతంలో ఉద్యమాన్ని నిర్మిస్తూ ఎన్నో ఆటుపోట్లను సైతం తట్టుకున్నారని, ఆఖరికి నక్సలైట్లతో ప్రాణహాని ఉందని తెలిసినప్పటికీ జాగ్రత్తలు తీసుకుంటూనే పార్టీ నిర్మాణం లో కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఒక దశలో ఈ ప్రాంత నక్సలైట్ పార్టీ అయోధ్యను అడవుల్లోకి తీసుకెళ్లి చంపుతామని బెదిరించారని గుర్తుచేశారు. సిపిఐ వల్ల ఈప్రాంతంలో అనేక గ్రామాలు వెలుస్తుండటంతో జనసంచారం పెరిగి అడవులు తగ్గిపోతున్నాయని, తద్వారా నక్సలైటు ఉద్యమానికి చోటువచ్చే ప్రమాదం ఉందని, ఇక్కడి నుండి వెళ్లిపోవాలంటూ తుపాకీ తలపై పెట్టినప్పటికీ జంకు లేకుండా చావనన్నా చస్తాను కానీ, ఎర్రజెండాను విడిచి వెళ్లే ప్రసక్తే లేదని తెగేసి చెప్పిన ధీశాలి అయోధ్య అని అన్నారు. బూర్గంపాడు నియోజకవర్గం ఉన్నరోజుల నుండి నేటి పినపాక నియోజకవర్గంగా రూపాంతరం చెందిన నాటి వరకు ఆయన పార్టీ కోసం చేసిన కృషి మరువలేదని, ఆ నాటి రోజుల్లో సిపిఐ ఎమ్మెల్యేలను గెలిపించడంలో కీలక భూమిక పోషించారని కూనంనేని కొనియాడారు. అయోధ్య మృతి చెందారనే విషయాన్ని ఇప్పటికీ నమ్మలేకుండా ఉన్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా అన్నారు. మారుమూల ప్రాంతం నుండి రాష్ట్రస్థాయికి ఎదిగిన నేత అయో ధ్య అని, ఆయన ఆశయాల సాధనకు ప్రతీఒక్కరూ పాటుపడాలన్నారు. సిపిఐ జిల్లా మహాసభలు అశ్వారావుపేటలో జరిగిన సమయంలో అయోధ్య మాట్లాడిన తీరు అందరిని ఆలోచింపజేసిందన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ సిపిఐలో మంచినేతగా గుర్తింపు ఉన్న అయోధ్య లేకపోవడంతో ఆ పార్టీ పోరాటాలకు నష్టమే అన్నారు. ఈప్రాంతంలో ఆయన చేసిన అనేక పోరాటాలు పలు సందర్భాల్లో చర్చకు వస్తుంటాయన్నారు. బిఆర్‌ఎస్ పినపాక మాజీ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ పినపాక ప్రాంతంలో ఉద్యమాల నేత మృతి చెందడం బాధాకరమన్నారు. 40 సంవత్సరాలుగా కమ్యూనిస్టు పార్టీనే నమ్ముకుని కడదాకా ఆదే పార్టీలో ఉండి నిబద్ధత గల నేతగా గుర్తింపు పొందారన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ అయోధ్య ఈ ప్రాంత సింగరేణి సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తూ కార్మికుల పక్షాన నిలబడి పోరాటాలు నిర్వహించారని, ఆయనలేని లోటు సింగరేణి ఓబి కార్మికులకు తీరనిదన్నారు. జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోరాట పటిమను గుర్తు చేశా రు. రామానుజవరం మాజీ సర్పంచ్ బాడిస సతీష్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలివేన శంకర్, డిహెచ్‌పిఎస్ ప్రధాన కార్యదర్శి మారపాక అనిల్ కుమార్, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిర్నాకి నవీన్, బిఆర్‌ఎస్ మాజీ జెడ్పిటిసి పోశం నర్సింహారావు, టిడిపి నాయకులు వాసిరెడ్డి చలపతిరావు, వట్టం నారాయణ, సిపిఐ నాయకులు ముత్యాల విశ్వనాథం, మిర్యాల రంగయ్య, మున్నా లక్ష్మీ కుమారి, సరెడ్డి పుల్లారెడ్డి, దుర్గ్యాల సుధాకర్, రావులపల్లి రవి, ఎస్‌డి సలీం, కమటం వెంకటేశ్వరరావు, కిలిమి ఎల్లారెడ్డి, జక్కుల రాజాబాబు, వై.రాంగోపాల్, జంగం మోహన్‌రావు, వీశం శెట్టి పూర్ణచంద్రరావు, అడుసుమల్లి సాయిబాబు, సుధాకర్, శ్రీనివాస్, రత్నకుమారి, రాంబాబు, విజయలక్ష్మీ, పద్మ, వీరభద్రం, సిద్దెల హుస్సేన్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు

**ప్రజాపక్షం/జడ్చర్ల :** గ్రామాలు పట్టణాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని సిపిఐ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం నాడు జడ్చర్ల పట్టణంలోని గౌడ ఫంక్షన్ హాల్‌లో సిపిఐ జిల్లా స్థాయి మహాసభలు ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని జిల్లా నేతలు బృంగి బాలకిషన్ , పరమేశ్వర్ గౌడ్, బాగీ కృష్ణయ్య, తదితరులు మాట్లాడుతూ ఈ నెల 5,6 తేదీలలో జడ్చర్ల పట్టణంలో గౌడ ఫంక్షన్ హాల్‌లో జరిగిన మహబూబ్‌నగర్ సిపిఐ జిల్లా 23వ మహాసభలను విజయవంతంగా నిర్వహించడం జరిగింది. అనంతరం మహాసభల్లో ప్రజా సమస్యలపై తీర్మానాలు ఆమోదించడం జరిగింది. మొదటి తీర్మానంగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా కల్పించాలని రెండవది పాలమూరు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా అగ్రికల్చర్ ఆ కోర్సులను ప్రవేశపెట్టాలని మూడవది మాచర్ల టు గుంటూరు రైల్వే లైన్ వెంటనే కేంద్రంతో ఒప్పించి నిర్మాణం చేపట్టాలని, నాల్గవ తీర్మానంగా ఈ ప్రాంతంలో పరిశ్రమల్లో పనిచేస్తున్నటువంటి అన్ని రంగాలలో కార్మికులకు పని గంటలు పెంచే 282 జీవోను వెంటనే ఉపసంహరించాలని నాలుగు తీర్మానాల్ని ఆమోదించడం జరిగిందని తెలిపారు.



## సమగ్ర అభివృద్ధికి ఉద్యమాలు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహా




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** జిల్లా సమగ్రాభివృద్ధికి ఉద్యమాలు నిర్మిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మ తెలిపారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని లక్ష్మ ణాచారి భవనంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్‌తో కలిసి బాల్‌నర్సింహా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జిల్లావాసి అయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి నాగర్‌కర్నూల్ జిల్లాకు రూ.5వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించి జిల్లాను అభివృద్ధి చేయాలని, అదే విధంగా నల్లమల అటవీ ప్రాంతంలో ఎంతో విలువైన ఖనిజ సంపద ఉంది కాబట్టి నల్లమలప్రాంతంలో సిమెంటు పరిశ్రమ, పేపర్ పరిశ్రమ ఏర్పాటు చేయాలన్నారు. జిన్నుకుంటలో దశాబ్దాలుగా ఆచరణకు నోచుకొని లెదర్‌పరిశ్రమను ప్రారంభించాలని, పాలెంలోని ఇండస్ట్రీయల్ అభివృద్ధిచేసి జిల్లాను ఇండస్ట్రీయల్ కారిడార్‌గా ప్రకటించాలన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్రసమితి సభ్యులు హెచ్.ఆనంద్‌జి, కేశవులుగౌడ్, బండిలక్ష్మి పతి, శివశంకర్, పట్టణ కార్యదర్శి గోపిచారి, శివకృష్ణ, కొట్ర శేఖర్ పాల్గొన్నారు.

# సామ్రాజ్యవాదంపై పెల్లుబికిన నిరసన

ఖమ్మంలో పాలస్తీనా సంఘీభావ ర్యాలీ

**ప్రజాపక్షం/ఖమ్మం :** సామ్రాజ్యవాదాన్ని ఖమ్మం ప్రజలు గొంతెత్తి నిరసించారు. మానవత్వం మరిచి మహిళలు, వృద్ధులు, పసిపిల్లలపై చేస్తున్న దాడులను ముక్త కంఠంతో ఖండించారు. గురువారం ఖమ్మంలో రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థులు, మేధావులు, పాలస్తీనా సంఘీభావ కమిటీ నేతృత్వంలో భారీప్రదర్శన నిర్వహించారు. సామ్రాజ్యవాదాన్ని కాంక్షిస్తూ ఇజ్రాయిల్ పాలస్తీనాపై అమానవీయ దాడులు చేస్తున్న తీరును నిరసిస్తూ వేలాదిమంది ర్యాలీలో పాల్గొన్నారు. సేవ్ గాజా సేవ్ పాలస్తీనా అంటూ ప్లేకార్డులు ప్రదర్శించారు. ఈసందర్భంగా వివిధ రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, మేధావి సంఘాల నేతలు మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల మూలంగా పాలస్తీనా ప్రజ లు నీరు, ఆహారం, మందులు, నిత్యావసర వస్తువులు అందక ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదనవ్యక్తం చేశా రు. ఇప్పటికే గాజాలో 20 లక్షల మంది ప్రజలు దుర్భర దారిద్ర్యాన్ని గడుపుతుండగా వేలాదిమంది ప్రజలు మరణించారని అక్కడి ప్రజలకు ఆహారాన్ని అందించకుండా ఇజ్రాయిల్ దాడులు చేస్తుందని ఆరోపించారు. ఒక పక్క దాడులు మరో పక్క ఆకలి కేకలతో ప్రజలు అల్లాడిపోతున్నారని సామ్రాజ్యవాద కాంక్షతోనే ఇటువంటి అమానవీయ ఘటన చోటు చేసుకుంటుందని వారు తెలిపారు. గాజాకు స్వేచ్ఛ ఇచ్చినట్లు ఇచ్చి భూగగనతలంపై ఆంక్షలు విధించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అజీజ్ పాషా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మధు, బిఆర్‌ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, కాంగ్రెస్ నాయకులు శేఖర్‌గౌడ్, మైనార్టీ నాయకులు మహ్మద్ హుస్సేన్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొ.గడ్డం లక్ష్మ ణ్, పాలస్తీనా సంఘీభావ కమిటీ నాయకులు రవిమారుత్, భాస్కర్, మువ్వా శ్రీనివాస్, ఐవి రమణారావు, దేవిరెడ్డి విజయ్, బండారు రమేష్, మనోహర్ రాజు, ఎంఎఫ్ గోపీనాథ్, రవీంద్రనాథ్, కిషన్ నాయక్, పెన్ననర్ల సంఘం అధ్యక్షులు పరిశ పుల్లయ్య, ప్రసేన్, న్యాయవాదులు తిరుమలరావు, ఓరుగంటి శేషగిరిరావు, సుగుణారావు, పోటు కళావతి, జర్నలిస్టు సంఘాల నాయకులు ఏనుగు వెంకటేశ్వరరావు, ఆకుతోట ఆదినారాయణ, శ్రీనివాసరెడ్డి, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.








# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి :కలెక్టర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శ్రీరాంసాగర్ పరివాహక ప్రాంతంతో పాటు నదులు, వాగుల పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ప్రజలకు సూచించారు. అవసరమైతే తప్ప ఇళ్ల బయటకు ఎవరూ రాకూడదని హితవు పలికారు. చేపల వేట, ఈత సరదా కోసం చెరువులు, కాలువలు, కుంటలు, ఇతర జలాశయాల వద్దకు వెళ్లకూడదని సూచించారు. ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా ఉండేందుకు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ తక్షణ పర్యవేక్షణ చేపట్టాల్సిందిగా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించామని కలెక్టర్ తెలిపారు. భారీ వర్షాలతో ఎక్కడైనా ప్రమాదం ఎదురైనా లేక అత్యవసర పరిస్థితులు ఏర్పడి సహాయక చర్యలు అవసరమైన పక్షంలో కలెక్టరేట్‌లో కొనసాగుతున్న కంట్రోల్ రూం ఫోన్ నెం. 08462220183 కు సమాచారమందించవచ్చని సూచించారు.

## సమస్యలు ఎన్నో..

### తెలంగాణ అంగన్‌వాడీ వెల్ఫేర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుణ కుమారి




**ప్రజాపక్షం/ఖానాపూర్ :**నిర్మల్ జిల్లాలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పేర్స్ అసోసియేషన్ నాలుగో మహాసభలు ఘనంగా జరిగాయి. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణకుమారి మాట్లాడుతూ, అంగన్‌వాడీలు అనేక సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఇ చ్చిన హామీ మేరకు వారి జీతాలను వెంటనే రూ.18 వేలకు పెంచాలని ఆ మె డిమాండ్ చేశారు. అదే విధంగా ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కరుణకుమారి కోరారు. పదవీ విరమణ పొందిన వారికి రావలసిన రెండు లక్షల రూపాయలు(టీచర్లకు)ఒక లక్ష రూపాయలు(ఆయాలకు ఇప్పటివరకు అందలేదని వాపోయారు. వారికి ఆసరా పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మహాసభలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి కే.ఎస్.విలాస్ మాట్లాడుతూ, నిర్మల్ జిల్లా అంగన్‌వాడీలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి ఉద్యమాలు చేయాలి. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుగా రమాదేవి, గౌరవ అధ్యక్షులుగా శ్రీనివాస్ చారి,జిల్లా అధ్యక్షురాలిగా వనమాల, జిల్లా కార్యదర్శిగా భూక్యా రమేష్, ఉపాధ్యక్షులుగా ఏ.గోదావరి, జయంతిమాల, లావణ్య, లక్ష్మీ దేవి కడెం, సహాయ కార్యదర్శులుగా దయాసాగర్, ఏ సులోచన, విజయ నిర్మల, కడెం , కోశాధికారిగా రాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో అన్ని సెక్టార్ల నుండి అంగన్‌వాడీలు, ఆయాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టేకు చెట్లు నరికిన ఐదుగురు అరెస్ట్



**ప్రజాపక్షం/జన్నారం :** మండలంలోని పైడిపల్లి బీట్‌లో అక్రమంగా చెట్లు నరికిన ఐదుగురిని అటవీ శాఖ అధికారులు అరెస్ట్ చేసి స్థానిక ఎంఆర్ఓ కార్యాలయానికి గురువారం బందోవర్ చేసినట్లు జన్నారం ఎఫ్ఆర్ఓ సుష్మా రావు తెలిపారు. ఆమె మాట్లాడుతూ చింతగూడెం గ్రామానికి చెందిన తిరుపతి, మహేష్, కమలాకర్, సురేష్, తాహెర్ అనే వ్యక్తులు పైడిపల్లి బీట్‌లో అక్రమంగా చెట్లు నరకుతుండగా క్రరలతో సహా పట్టుకున్నట్టు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని వెల్లడించారు. చెట్లు నరకడం నేరమని, అటవీ సంపదకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ భానుచందర్, ఫారెస్ట్ అధికారిణి శివకుమార్, ఎఫ్‌బిఓ లాలూభాయి, కానిస్టేబుల్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## మురికికాలువలో శిశువు పిండం బయటకు తీసి ఆసుపత్రికి తరలింపు

**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలో గురువారం అమాన వీయ ఘటన వెలుగు చూసింది.నర్సింహనగర్ కాలనీ ప్రాంతంలోని వేదం హైస్కూల్ పక్కన,రేయిన్బో హెస్కూల్ ముందరి భాగంలోని మురికి కాలువలో శిశువు పిండం ఒకటి లభ్యమయ్యింది.గుర్తు తెలియని వ్యక్తులు శిశువు పిండాన్ని మురికి కాలువలో పారవేసినట్లుగా తెలిసింది.మధ్యాహ్నం వేళలో అక్కడి మార్గం మీదుగా వెలుతున్న కొందరు మురికి కాలువలోని పిండాన్ని గుర్తించడంతో ఘటన వెలుగు చూసింది. సంబంధిత సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు, మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి మురికి కాలువలో పారవేయబడి ఉన్న శిశువు పిండాన్ని బయటకు తీసారు.అక్కడి నుంచి ఏరియా ఆసుపత్రిలోని పోస్టుమార్టం గదికి తరలించారు. శిశువు పిండం ఐదు నుంచి ఆరు నెలల వయసు ఉన్నట్లు తెలిసింది.

## పశువులు వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/లక్ష్మ ణచందా :**గురువారం లక్ష్మ ణచందా మండలం కనకపూర్ గ్రామంలో పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని సందర్శించి పశువులకు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బ్లూ టంగ్ వ్యాధి నివారణకు ఇచ్చే టీకాల వివరాలు, వ్యాక్సినేషన్ కు సంబంధించిన రిజిస్టర్లు నమోదు వివరాలను తనిఖీ చేశారు. వర్షాకాలంలో వ్యాధులు విస్తరించే ప్రమాదం ఎక్కువగా ఉండడంతో అధికారులు వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారి అంబాజి, ఎంపిడిఓ రాథోడ్ రాధ, పశువైద్యాధికారి శ్రీనివాస్ సిబ్బంది అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల అభ్యున్నతికే లక్ష్యంగా ప్రజా పాలన

### మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

**ప్రజాపక్షం/మెదక్ :**పేద ప్రజల అభ్యున్నతికే లక్ష్యంగా ప్రజా పాలన సాగుతుందని మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. గురువారం చిన్న శంకరంపేట మండలంలో రేషన్ కార్డుల పంపిణీలో పాల్గొన్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కనీసం ఒక్క రేషన్ కార్డు కూడా ఈయన చరిత్ర గత ప్రభుత్వానిది అని ఎద్దేవా చేశారు. ప్రతి పేదవారికి రేషన్ కార్డు ద్వారానే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని తదనుగుణంగా ప్రభుత్వం గొప్ప ఆలోచనతో నూతన రేషన్ కార్డులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. గత పాలకులు అభివృద్ధిని విస్మరించారని 10 సంవత్సరాల కాలంలో చేయని అభివృద్ధి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 6 గ్యారంటీ పథకాలు సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లగా నిరుపేదలకు కలగా మిగిలిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని శంకరంపేట మండలంలో 846 నూతన ఆరభద్రతా కార్డులు మంజూరు చేయడం జరిగిందని 18 57 కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేశామన్నారు. ఆహార భద్రతా కార్డుల జారి నిరంతర ప్రక్రియని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి



**ప్రజాపక్షం/దండేపల్లి :** ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంపై అధికారులు దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. గురువారం దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన, వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలు పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఆసుపత్రులు పరిశుభ్రంగా ఉండాలని, మందులు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. అనంతరం కర్ణపేటలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, లింగాపూర్ ఆదర్శ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పౌష్టికాహారం, ఆరోగ్యం, నాణ్యమైన బోధనపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, చెత్త సేకరణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. నర్సరీలో మొక్కల నిర్వహణ పరిశీలించి వనమహోత్సవానికి అవసరమైన మొక్కలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ధర్మారావుపేటలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి, లబ్ధిదారులు నిబంధనల మేరకు ఇండ్లు పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ప్రసాద్, ఇతర అధికారులు ఉన్నారు.

## స్థానిక ఎన్నికల తర్వాత రైతుబంధు మాయం!

### రైతు ధర్నాలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**ప్రజాపక్షం/మెదక్ :**కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులకు అలవు కాని హామీలు ఇచ్చి రాష్ట్ర రైతాంగాన్ని నట్టేటా ముంచిందని, భూములను, కష్టాన్ని నమ్ముకుని పనిచేసే రైతులకు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలకు ఆశపడిన రైతులు కాంగ్రెస్ సర్కార్ లో మోసానికి గురవుతున్నారని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. రాబోయే స్థానిక ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రైతులకు మేలు జరిగే రైతుబంధుతో పాటు ఇతర పథకాలు కూడా మాయమౌతాయన్నారు. బిజెపిలో ఉన్న ఒక ముగ్గురు ఎమ్మెల్యేలు తప్ప మిగతా బిజెపి ఎమ్మెల్యేలంతా రేవంత్ రెడ్డికి అండగా ఉన్నారని, బిజెపి రైతాంగం కోంస పాటు పడే పార్టీ కాదని రైతు వ్యతిరేకని దుయ్యబట్టారు. ఇప్పటికైన రైతులంతా సంఘటితం కావాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణ పాఠం,బుద్ధిచెప్పాలని నిరంజన్ రెడ్డి సూచించారు. కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా మెదక్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు గురువారం బిఆర్ఎస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి అధ్యక్షతన రైతు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ ధర్నాకు మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, నర్సాపూర్,దుబ్బాక ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, శశిధర్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ హేమలత, నాయకులు తిరుపతిరెడ్డిలు హాజరయ్యారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు, రైతులు ఆశాజీవులని ఎవరు ఏది చెప్పినా నమ్ముతారని, కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోయారని విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉన్నాయన్నారు. అప్పట్లో యూరియా కొరత లేదని, కాంగ్రెస్ యూరియా విషయంలో ఇబ్బందులకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. లైన్‌లో చెప్పులు పెట్టే పరిస్థితి దాపురించిందని మంత్రి వాపోయారు. రైతులు, ప్రజల విషయంలో ప్రభుత్వం చిన్న చూపు తగదన్నారు. చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం దిగివచ్చి రైతులకు 24 గంటల కరెంటు, రుణమాఫీ, సన్నాలకు బోనస్ ఇచ్చి రైతులను ఆదుకోవాలని సూచించారు. కాంగ్రెస్,బిజెపి రైతు వ్యతిరేక పార్టీలని వాటిని నమ్మి రైతులు మోసపోవద్దని, రైతులంతా,ప్రజలు సంఘటితమై వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలకు ఇంటికి సాగనంపేలా తీర్పు ఇవ్వాలని చెప్పాలని నిరంజన్ రెడ్డి కోరారు. మాజీ మంత్రి హరీష్ రావు రైతు ధర్నాలోంచి మధ్యలో వెళ్లిపోయారు. మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, నాయకులు సోములు, చంద్రగౌడ్,బట్టి జగపతి, మామిల్ల అంజనేయులు, జీవన్ రావు, దేవేందర్ రెడ్డి, మెదక్, నర్సాపూర్ నియోజకవర్గ నాయకులు,పాల్గొన్నారు.

## 19 నుంచి 22 వరకు సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలు




**ప్రజాపక్షం/నిజామాబాద్ :**రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 19 నుండి 22 వరకు మేడ్చల్ జిల్లాలో సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలు జరగనున్నాయని ఈ మహాసభలలో గత మూడు సంవత్సరాల్లో పార్టీ చేసిన ఉద్యమాలను సమీక్షించుకుని భవిష్యత్తు మూడు సంవత్సరాల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి ఉద్యమాలను రూ పొందించటం జరుగుతుందన్నారు. అమెరికా భారత్‌పై వేస్తున్న 50 శాతం సుంకాలపై ప్రధాని, మోదీ స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అమెరికాకు భారతదేశం నుంచి ఎగుమతవుతున్న వస్త్ర, ఉక్కు, అల్యూమిని యం ఇతర పరిశ్రమలకు ఉపయోగపడే ముడిసరుకుపై 50 శాతం సుంకాలు వేయటంతో దేశ ఆర్థిక పరిస్థితి పై భారం పడుతుందన్నారు. ఈ పెంపు పట్ల పిఎం మోదీ ధీటుగా స్పందించటం లేదన్నారు. సిపిఐ నగర కార్యదర్శి ఓమ య్య, సభ్యులు హన్మాండ్లు, అలీ ఇమ్రాన్, సురేష్, పరశురాం పాల్గొన్నారు.

### అయోధ్య మరణం సిపిఐకి తీరని లోటు

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :**మణుగూరు ప్రాంతంలో ఆదివాసుల హక్కుల కోసం, పోడు భూముల పట్టాల కోసం సాగిన పోరాటంలో అత్యంత క్రియాశీలకమైన పాత్ర పోసించిన కామ్రేడ్ అయోధ్య ప్రజా సమస్యల పరిష్కారం కోసం నాలుగున్నర దశాబ్దాలుగా అనేక పోరాటాలు చేసి సిపిఐ పార్టీ పటిష్టతకు పనిచేసిన మహాయోధుడు అని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో అమరజీవి అ యోధ్య మృతి పట్ల రెండు నిమిషాలు మౌనంపాటించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కామ్రేడ్ అయోధ్య బుధవారం సూర్యాపేట నుంచి హైదరాబాద్ మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించ డం అత్యంత బాధాకరమన్నారు. ఇది కమ్యూనిస్టు పార్టీకి, ప్రజలకు, కార్మిక ఉద్యమానికి తీరని లోటని అన్నారు. అమరజీవి అయోధ్య మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. సిపిఐ నాయకులు వై.ఓమయ్య, దేవేందర్, ఆలి ఇమ్రాన్, సురేష్, రవి, ఆనంద్ పాల్గొన్నారు.

## రేషన్ కార్డు పంపిణీలో ఉద్రిక్తత

### కాంగ్రెస్ నేతపై బాటిల్ విసిరిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్:** కొమురం భీం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో గురువారం జరిగిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఉద్రిక్తతకు దారి తీసింది. బిఆర్ఎస్ పాలనను విమర్శించిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్‌పై స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి కోపంతో వాటర్ బాటిల్ విసిరిన ఘటన కలకలం రేపింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోవలక్ష్మి , శ్యాం నాయక్‌తో పాటు జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్యాం నాయక్ మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలో పేదలకు రేషన్ కార్డులు ఇవ్వలేదని, సన్నబియ్యం కూడా సరైనవిధంగా పంపిణీ కాలేదు అని విమర్శించారు. ఇది చూసిన ఎంఎల్ఏ కోవలక్ష్మి మండిపడి ప్రోటోకాల్ లేని వ్యక్తి అధికారిక కార్యక్రమంలో పాల్గొంటూ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ అజమాయిషీ చేస్తున్నారు. ప్రజలు ఎప్పటికీ ఇతన్ని ఎమ్మెల్యే ఎన్నుకోరు, అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరువురి మధ్య మాటల యుద్ధం పెరిగి కోపంతో ఎమ్మెల్యే తన ముందున్న వాటర్ బాటిల్‌ను శ్యాం నాయక్‌పై విసిరారు. దీంతో కాంగ్రెస్, బిఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. శ్యాం నాయక్ అనుచరులు ఎంఎల్ఏకు వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. ఈ ఘటనపై శ్యాం నాయక్ స్పందిస్తూ... ఇది పూర్తిగా దురదృష్టకరం. ఎంఎల్ఏ ఈ స్థాయిలో ప్రవర్తించాల్సి రావడం బాధాకరం. ఆమెపై చర్యలు తీసుకోవాలి అంటూ డిమాండ్ చేశారు.

## ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

### కొత్త రేషన్‌కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే రోహిత్‌రావు



**ప్రజాపక్షం/రామాయంపేట :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని మెదక్ ఎమ్మె ల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. గురువారం రామాయంపేట రైతు వేదికలో లబ్దిదారులకు కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన త ర్వాత అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నామని తెలిపారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తం గా 9వేలకు పైగా కొత్త రేషన్‌కార్డులు మంజూరైన ట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయా ణం, ఉచిత విద్యుత్‌తో పాటు అనేక ప్రజా సం క్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నా రు. ఈకార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ నగేష్ , ఆర్‌డిఓ రమాదేవి, ఎంపిడిఓ శాజిలోద్దిన్, తహసీల్దార్ రజనికుమారి, ఆర్ఐ గౌస్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు చౌదరి సుప్రబాత్‌రావు, రమేష్ రెడ్డి, ఎనిశెట్టి అశోక్, శ్రీదర్‌రెడ్డి, నాగులుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సిర్పూర్ అటవీ ప్రాంతంలో ఎన్‌టిసిఎ అధికారుల పర్యటన



**ప్రజాపక్షం/సిర్పూర్ (టి) :**సిర్పూర్ రేంజ్‌లోని అటవీ ప్రాంతాన్ని గురువారం ఎన్‌టిసిఎ అధికారి హరిణి సందర్శించారు. రైల్వేశాఖ చేపట్టిన మూడవ లైన్ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. వన్యప్రాణుల రాకపోకలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు ఓవర్ బ్రిడ్జిలు అవసరమైన ప్రాంతాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఇటుకలపహాడ్ ప్లాంటేషన్‌కి వెళ్లి టైగర్ ట్రాకింగ్ పద్ధతులపై అధికారులు చేపడుతున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం, డిఎఫ్ఓ నీరజ్ కుమార్ టిబ్రెవాల్, ఎఫ్డిఓ సుశాంత్ బోబడే, బెల్లంపల్లి ఎఫ్ఆర్ఓ పూర్ణచందర్, సిర్పూర్ ఇంచార్జ్ ఎఫ్ఆర్ఓ ప్రవీణ్ కుమార్, రైల్వే అధికారులు, సిర్పూర్ రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమన్వయంతో పని చేస్తేనే సత్ఫలితాలు

### రాష్ట్ర ఇంటర్ బోర్డు ప్రత్యేకాధికారి దాసరి ఒడ్డెన్న



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** అధ్యాపకులు సమన్వయంతో పని చేస్తూ మంచి ఫలితాలను సాధించాలని రాష్ట్ర ఇంటర్ బోర్డు జిల్లా ప్రత్యేకాధికారి దాసరి ఒడ్డెన్న ఆదేశించారు. గురువారం ఉదయం నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాకు విచ్చేసిన సందర్భంగా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ అధ్యక్షతన కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ప్రత్యేకాధికారి మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో చేరిన పేద, బడుగు, బలహీన, మైనార్టీ విద్యార్థినిల అభ్యున్నతికి అన్ని సబ్జెక్టుల అధ్యాపకులు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరముందన్నారు. రాష్ట్ర ఇంటర్ బోర్డు కమీషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాల్సిందేనని, అందుకు అధ్యాపకులు కృషి చేయాలన్నారు. కళాశాల ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నందున యూనిట్ టెస్టులు నిర్వహించి మార్కుల ఆధారంగా విద్యార్థుల ప్రతిభను గుర్తించాలన్నారు. కళాశాల మైదానాన్ని, తరగతి గదులను ఆయన స్వయంగా పరిశీలించి ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కల పెంపకం, మైదానం చదును చేయించి విద్యార్థులకు చదువుకోవాలనే ఆహ్లాదకర వాతావరణం కల్పించి సౌకర్యవంతంగా తీర్చిదిద్దడంపై అభినందించారు. కళాశాలలో జరుగుతున్న విద్యాబోధనపై రాష్ట్ర ఇంటర్ బోర్డు ప్రత్యేకాధికారి స్వయంగా విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులదేనని ఆయన ఆదేశించారు. ఏ గ్రూపులో చేరిన విద్యార్థులైనా అన్ని సబ్జెక్టులలో ఉత్తీర్ణులు కావల్సిందేనని ఇందుకు శ్రద్ధ సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఒకే కుటుంబంలోని ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్లో ఓటు వేసేలా చర్యలు

### సంగారెడ్డి కలెక్టర్ పి.ప్రావీణ్య



**ప్రజాపక్షం / సంగారెడ్డి :** ఒకే కుటుంబందలోని ఓటర్లు ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని, ఓటర్లకు సులభంగా ఓటు వేసే సదుపాయం కల్పించేందుకు నజరీ నక్షల రూపకల్పనపై సమీక్ష నిర్వహించారు. పటాన్ చెరు నియోజకవర్గంలో ఓటర్లకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా నజరీ నక్షలను సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పటాన్ చెరు నియోజకవర్గానికి చెందిన ఈఆర్ఓ సహాయ రిటర్నింగ్ అధికారులు మున్సిపల్ కమీషనర్లు జిహెచ్ ఎంసి అదికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ స్టేషన్లలో ఓటు వేసే విధంగా నజరే నక్షలను రూపొందిచాలి పోలింగ్ స్టేషన్‌లు ఆయా వార్డుల బౌండరీల లోపలే ఉండాలని పేర్కొన్నారు. పటాన్ చెరు నియోజకవర్గంలోని మొత్తం 422 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు తాము నివసించే ప్రాంతానికి సమీపంలోనే ఓటు వేసేలా మ్యాప్‌లు రూపొందించాలని సూచించారు. జిహెచ్‌ఎంసి పరిధిలోని ఉన్న 116 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి ఇప్పటికి తయారు చేసిన నజరీ నక్షలను ఈ సందర్భంగా పరశీలించారు. నజరీ నక్షల రూపకల్పన సమయంలో సహజసిద్ధమైన కాలనీ గ్రామ బౌండరీలను దాటి ఓటర్లను ఇతర ప్రాంతాలకు తరలించకుడా తాము నివసించే గ్రామం కాలనీలోనే ఓటు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నియోజకవర్గ స్థాయి నజరీ నక్ష మ్యాప్‌ను నాలుగు రోజుల్లో సిద్ధం చేయాలని వచ్చే సోమవారం నాటికి పటాన్ చెరు నియోజకవర్గంలోని 422 పోలింగ్ కేంద్రాల మ్యాపులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు ఎన్నికల అధికారి,, అదనపు కలెక్టర్ ( రెవెన్యూ ) మాదురి డిఆర్ఓ పటాన్ చెరు నియోజకవర్గం ప్రత్యేక అధికారి అల్పసంఖ్య వర్గాల సంక్షేమశాఖ అదికారి దేవుజా పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన అన్ని మండలాల సహాయ రిటర్నింగ్ అదికారులు జిహెచ్‌ఎంసి మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## చెట్టుకు ఢీ కొన్న కారు.. ఇద్దరు మృతి



**ప్రజాపక్షం/శివ్వంపేట :** కారు అదుపుతప్పి చెట్టుకు ఢీ కొన్ని ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శివ్వంపేటకు చెందిన కొడకంచి బాలమణి, నర్సాపూర్ మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన డ్రైవర్ ఆంజనేయులు కారులో శివ్వంపేట నుంచి నర్సాపూర్ వైపు బయలుదేరారు. వీరి కారు చాకరిమెట్ల సమీపంలో మూలమలుపు వద్ద అదుపుతప్పి చెట్టుకు ఢీ కొనడంతో బాలమణి, డ్రైవర్ ఆంజనేయులు స్పాట్‌లోనే మృతిచెందారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



# స్థానికం

REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## కరీంనగర్ హాఫ్ మారథాన్ పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** అక్టోబర్ 12న జరగబోవు కరీంనగర్ హాఫ్ మారథాన్ థర్డ్ ఎడిషన్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. గత రెండు సంవత్సరాలుగా నిర్వహించిన హాఫ్ మారథాన్‌లు విజవంతమయ్యాయని, ఈ యేడాది సైతం అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన తీసుకువస్తున్న కరీంనగర్ రన్నర్స్ సైకిలిస్ట్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. ఇందులో 3, 5, 10, 12 కిలో మీటర్ల పరుగు ఉంటుంది. ఆసక్తి గల వారు. https://karimnagarmarathon. com లో వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోగలరని సూచించారు.



## కరెంట్ షాక్‌తో రైతు మృతి



**ప్రజాపక్షం/కొండపాక:** కొండపాక మండలం సిరిసినగండ్ల గ్రామానికి చెందిన గూడెం బాపురెడ్డి 64 అనే రైతు ప్రమాదవశాత్తు బోరు మోటరు స్టార్టర్ వద్ద తెలి ఉన్న విద్యుత్ తీగ తగిలి విద్యుత్‌ఘాతానికి గురై మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది.వివరాలోకి వెళ్తే బాపూరెడ్డికి మూడు ఎకరాల భూమిలో వరి, మొక్కజొన్న వేసిసాడు.ఇట్టి పొలంలోని మొక్కజొన్న పంటకు నీరు పెట్టడానికి రోజు మాదిరిగానే గురువారం ఉదయం వెళ్ళగా అక్కడ బోరు పని చేయకపోవడంతో స్టార్టర్‌లో సమస్య ఉందని గమనిస్తూ చూస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై కిందపడిపోయాడు.పడిపోయిన ఆయన కాలుకు వైరు తగిలి అపస్మారక స్థితికి వెళ్ళాడు.బాపురెడ్డి భార్య భాగ్యమ్మ బావి రోజు మాదిరిగా బావి వద్దకు వెళ్ళి తన భర్తను పిలుస్తూ బోరు స్టార్టర్ వద్దకు వెళ్ళి చూడగా బాపురెడ్డి కిందపడి కోట్టుకోనుటను చూసి భర్తను కాపాడడానకి కేకలు వేయగా పొలం దగ్గర గల గూడెపు బుచ్చిరెడ్డి, కుమ్మరి ఆంజనేయులు వచ్చి కాలుకు తగిలిన వైరును తప్పించి చికిత్స కోసం పొలం నుంచి రోడ్డుకు తీసుకు వెళ్తున్న క్రమంలోనే మృతి చెందాడు.మృతునికి భార్య భాగ్యమ్మ, ఒక కూతురు ఉన్నారు.బోరు స్టార్టర్ వద్ద తేలి ఉన్న కరెంట్ వైరు కాలుకు తగిలి కరెంట్ షాక్ తో చనిపోయాడని మృతుని భార్య భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## 1000 మంది యువతకు ఉపాధి కల్పించేలా చర్యలు




**ప్రజాపక్షం/పెద్దపల్లి:** రాబోయే 6 నెలల కాలంలో పెద్దపల్లి జిల్లాకు 1000 మంది యువతకు నాణ్యమైన ఉపాధి కల్పించేలా కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష యువతకు ఉపాధి కల్పన పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే 6 నెలల కాలంలో మన పెద్దపల్లి జిల్లాలో 1000 మంది యువతకు నాణ్యమైన ఉపాధి కల్పించడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పరిశ్రమల శాఖ, బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, వివిధ శాఖల పరిధిలో సమన్వయంతో వివిధ కార్యక్రమాలను అమలు చేసి ఉపాధి కల్పించాలని అన్నారు.యువతకు నాణ్యమైన ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు అవసరమైన నైపుణ్య శిక్షణ కోసం నిధులు, లాజిస్టిక్స్ ఇతర సౌకర్యాల కల్పనకు జిల్లా కలెక్టరేట్ నుంచి సంపూర్ణ సహకారం అందించడం జరుగుతుందని అన్నారు.పెద్దపల్లి టాస్క్ సెంటర్ లో వివిధ కోర్సులు నేర్చుకున్న యువతకు 7 లక్షల ప్యాకేజీ తో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. టాస్క్ సెంటర్‌లో అందించే వివిధ కోర్సులు, వాటి రిజిస్ట్రేషన్, ఉపాధి అవకాశాల పై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని, ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, జిల్లా వ్యవసాయ అధికారి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయితీ కార్యదర్శిపై చర్యలు..

**ప్రజాపక్షం/బెజ్జంకి:** మండల పరిధిలోని చీలాపూర్‌పల్లి గ్రామ పంచాయితీ కార్యదర్శి యం.డి రఫీ మద్యం సేవించి విధుల పట్ల నిర్లక్ష్యంగా వహిస్తున్నాడని స్థానిక ఎంపిడివో ప్రవీణ్‌కు గురువారం ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ గ్రామస్తులతో కలిసి పిర్యాధు చేయగా వెంటనే ఎంపిడివో స్పందించి జిల్లా డిపివోకు సరెండర్ చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.గ్రామ పంచాయితీ కార్యదర్శి కార్యాలయానికి గైర్హజరవుతు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల వివరాలను నమోదు చేయకపోవడం,గ్రామ పంచాయితీ ఓటర్ ప్రక్రియ,ఉపాధి హామీ వంటి తదితర పనులల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తునందున మద్యం చేవించి గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఉంటున్నట్లు పిర్యాధు రావడంతో తదుపరి చర్యల నిమిత్తం జిల్లా ఉన్నతాధికారులకు సరెండర్ చేసినట్లు తెలిపారు.

## మహిళ దారుణ హత్య

### శవాన్నీ నీరు లేని బావిలో పడేసిన నిందితులు



**ప్రజాపక్షం/కొడిమ్యాల:** మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన జగిత్యాల జిల్లా కొడిమ్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సందీప్ తెలిపిన వివరాల ప్రకారం కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన మేన్నేని ప్రేమలత (67) అనే మహిళ బుధవారం రాత్రి 9 గంటల సమయంలో బస్సు దిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అతి కిరాతకంగా దాడిచేసి కొట్టి హత్య చేశారని, అంతటితో ఆగకుండా శవాన్ని ఈడ్చుకెళ్లి మృతురాలి ఇంటిముందు గల నీరు లేని బావిలో పడేశారని తెలిపారు. మృతురాలి కోడలు స్వర్ణలత ఫిర్యాదు మేరకు కేసు నమోద చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



**ప్రజాపక్షం/కొడిమ్యాల:** గుంతల రోడ్డు వల్లే వాహనం అదుపు తప్పి ఘటన కొడిమ్యాల మండలం చెప్యాల గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందినట్లు కొడిమ్యాల ఎస్ఐ సందీప్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలానికి చెందిన గుర్ర మమత(30) తనకు పరిచయం ఉన్న వ్యక్తితో కలిసి వేములవాడ నుండి కొడిమ్యాలకు వస్తున్న క్రమంలో చెప్యాల గ్రామ శివారులో స్వామి తన వాహనాన్ని గుంతల రోడ్డు మీద అతివేగంగా నడపడంతో అదే సమయంలో తన కాలు ద్విచక్ర వాహనం వెనుక చక్రంలో ఇరుక్కుపోవడంతో ఒక్కసారిగా కింద పడి తలకు తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలించగా మరణించినట్లు తెలిపారు. మృతురాలి తల్లి శంకరవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## చేనేత కార్మికుల ఆర్థిక సంక్షేమానికి పూర్తి సహకారం అందిస్తాం




### స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

### కలెక్టర్ హైమావతి

**ప్రజాపక్షం/సిద్దిపేట:** చేనేత కార్మికులు, మహిళల ఆర్థిక సంక్షేమానికి పూర్తి సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. గురువారం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ హైమావతి విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడారు. మన గత నాగరికతను ఆనవాళ్లు మనం వేసుకునే వస్త్రాలేనని, ఒక చీరను తయారు చేయటంలో మీ సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అభివర్ణించారు. నేతన్నల సంక్షేమం,అభివృద్ధి కొరకు మీరందరు కలసి సోసైటీలు ఏర్పాటు చేసుకోవాలని, అందు కోసం ఎలక్షన్ నిర్వహించుకోవాలని సూచించారు. ఈ సోసైటలను కొందరు కొరకు కాకుండ నేతవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారి సంక్షేమం కోసం పనిచేయాలన్నారు. జిల్లాను గొల్లభామ ఉత్పత్తులను బ్రాండ్‌గా నిలపటంలో మీరంత కృషిచేయాలన్నారు. ప్రతి నేత కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే దిశగా, ప్రస్తుత మార్కెట్ ట్రెండ్‌కు అనుగుణంగా ఉత్పత్తులు రావాలని, ఇందు కోసం జాతీయ ఉత్పత్తుల సహకారంతో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించు నూతన వస్త్రాలను ఉత్పత్తి చేయాలన్నారు. ఇందు కోసం ప్రభుత్వం తరుపున తన పూర్తి సహకారాన్ని అందిస్తామని హామీనిచ్చారు. ఇకపై ప్రతి సోమవారం కాటన్ వస్త్రాలను ధరించటంతో జిల్లా యంత్రాంగం కూడ కాటన్ దుస్తులు ధరించేలా చూస్తామన్నారు. చేనేత వస్త్రాల తయారిలో మహిళలు సంఘంగా ఏర్పడితే వారందరికి స్థలం ఇవ్వటంతో పాటు ఆర్థిక తోడ్పాటు కొరకు బ్యాంకర్ల ద్వారా సహకారం అందిస్తామన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ మహేశ్వరీ చీరలు తన సొంత రాష్ట్రం నుండి వస్తాయన్నారు. నేతకార్మికులు తయారు చేసిన చీర వారం నుండి 10 రోజులు కృషిఫలితమని, సిద్దిపేట చేనేతకు ప్రాధాన్యత ఇవ్వటానికి కృషిచేస్తామన్నారు. సిద్దిపేట గొల్లభామ చీరకు ప్రాధాన్యత కల్పించేందుకు తనవంతూ కృషిచేస్తానన్నారు. మనమంత వారంలో ఒకరోజు చేనేత వస్త్రాలను ధరించాలని, అప్పుడే సమాజంలో నేత వస్త్రాలపై ఆసక్తి పెరుగుతుందన్నారు. గత 40 నుండి 50 ఏండ్లుగా చేనేత వృత్తిలో కొనసాగుతున్న పలువురు చేనేత కార్మికులను సన్మానించారు. ఆనంతరం నేత పొదుపు పథకం కింద లబ్దిదారులకు 18.84.000 వేల రూపాయల చెక్కులను అందచేశారు. ఈకార్యక్రమంలో చేనేత, జౌళిశాఖ ఆధికారి సాగర్, జిల్లా పంచాయతీ అధికారి దేవకిదేవి, ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, జడ్పి సిఈఓ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



**స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి: కలెక్టర్**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు వివిధ శాఖల వారిగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. గరువారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై జిల్లా అదనపు కలెక్టర్లు, గరిమా అగర్వాల్. అబ్దుల్ హమీద్‌లతో కలసి సమావేశం నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల స్ఫూర్తి కనబడేలా వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలు, సంక్షేమ కార్యక్రమాల శకటాల ప్రదర్శన, స్టాళ్ల ఏర్పాటు, ముఖ్య అతిథి ప్రసంగం సిద్ధం చేయాలన్నారు. విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. వేడుకల సందర్భంగా ఏలాంటి ఇబ్బంది కలుగకుండ పోలీస్ బందోబస్తునుఏర్పాటు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అడిషనల్ డిసిపి సుభాష్ చంద్రబోస్. ఏసిపి రవీందర్‌రెడ్డి, కలెక్టర్ ఎఓ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత వస్త్రాల గౌరవం ఎప్పటికీ తగ్గదు



**ప్రజాపక్షం/కరీంనగర్:** చేనేత వస్త్రాల గౌరవం ఎప్పటికీ తగ్గేది కాదని, నేత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత, జౌళి శాఖ ఆద్వర్యంలో తెలంగాణ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు నేత కార్మికులు, విధ్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఈ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. కొండా లక్ష్మ ణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రతి కార్మికునికి ఆరోగ్య కార్డు అందించి సంవత్సరంలో నాలుగు సార్లు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యశ్రీ ద్వారా పది లక్షల రూపాయల ఉచిత వైద్య సహాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో చేనేత మహిళా కార్మికులు ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నేత కార్మికులు కోరిన రుణాలు, గురుకులాల్లో వారి పిల్లలకు సీట్ల కేటాయింపు వంటి అంశాలను ప్రభుత్వానికి విన్నవిస్తామన్నారు. నేత కార్మికుల్లో అర్హులు ఉంటే కచ్చితంగా ఇందిరమ్మ మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్,విద్యాసాగర్, రమేష్, పద్మశాలి సంఘం నాయకులు, నేత కార్మికులున్నారు.

## పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** తెలంగాణ మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఏఐటియుసి ఆద్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సంధర్భంగా ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతుందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 12నెలల నుంచి వీరికి రావాల్సిన వేతనాలు ఇంతవరకు చెల్లించలేదని, వంట సరుకులకు పెట్టినటువంటి డబ్బులు, అల్పాహారం బిల్లులు 2023 అక్టోబర్ నుంచి నేటి వరకు పెండింగ్ బిల్లులు చెల్లించలేదన్నారు. అనేక సార్లు ప్రభుత్వానికి విన్నవించినా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు మధ్యాహ్న బోజన కార్మికులకు పదివేల రూపాయల వేతనం చెల్లిస్తామని ఇచ్చిన మాట అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిత్యావసర వస్తువులు గ్యాస్, కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని, ప్రతి విధ్యార్థికి తరగతితో సంబంధం లేకుండా మెనూ చార్జీలు 25 రూపాయలు ఇవ్వాలని, వంటకార్మికులకు పనిభద్రత కల్పించి ప్రభుత్వం గుర్తింపు కార్డులు, ప్రొసీడింగ్ ఆర్డర్స్, డ్రెస్‌కోడ్స్‌తో బట్టలు ఇవ్వాలన్నారు. వంట కార్మికులకు కేంద్ర ప్రభుత్వం రూ.600 మాత్రమే చెల్లిస్తుందని, కనీసం వేతనం ఇస్తూ కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్, ప్రమాద బీమా సౌకర్యంతో పాటు గ్రీన్ చానల్ ద్వారా , పిఎఫ్ఎంఎస్ ద్వారా బడ్జెట్‌ను రిలీజ్ చేయాలన్నారు. నేరుగా కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు బొజ్జసాయిలు, జిల్లా ప్రధాన కార్యదర్శి రజిత, కార్యదర్శి దేవేంద్ర, నాయకులు ఎం.లక్ష్మి, బి.భాగ్య, హాలియా తదితరులున్నారు.

## కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాటం

### సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కార్మికుల హక్కుల కోసం సిపిఐ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం గురువారం రోజున పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పెద్దపల్లి జిల్లా ప్లంబర్ ట్రేడ్ యూనియన్ అసోసియేషన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం అయినా ప్లంబర్ యూనియన్ కార్యాలయాన్ని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి తో పాటు పెద్దపల్లి బార్ అస్సోసియేషన్ లీగల్ అడ్వాయిజర్ ఆర్. సురేష్ బాబు తో కలిసిప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ భవన నిర్మాణానికి పని చేసే కార్మికులు యజమానులకు అగ్రిమెంట్స్ ద్వారా పనిని నాణ్యతతో పని చేయాలనీ అన్నారు ఇల్లు కట్టుకునే ఇంటి యజమానులు కూడా ఏఐటీయూసీ అనుబంధ సంఘం యొక్క గుర్తింపు కార్డు లు ఉన్నవారికే పనులు ఇవ్వాలని బయటి వ్యక్తులకు పనులు ఇచ్చి ఇబ్బంది పడవద్దు అని అన్నారు. ఇంటిలో ప్లంబింగ్ కి సంబంధించి ఏదైనా సమస్య వచ్చినప్పుడు స్థానిక ప్లంబర్ ని పిలుస్తారు కాబట్టి స్థానికులకే పనులు ఇవ్వాలని, గృహ నిర్మాణానికి సంభందించి కార్మికులు ప్రమాదవాషత్తు చనిపోతే వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, వారు గ్రూప్ ఇన్సూరెన్స్ చేయించుకున్నట్లు అయితే ఐదు లక్షల వరకు ఆయొక్క ఇంటికి అందుతాయని వారు తెలిపారు.యూనియన్ సహాయకార్యదర్శి ఆరెపల్లి మానస్ కుమార్ అధ్యక్షతన ప్లంబింగ్ యూనియన్ అధ్యక్షులు చంద్రగిరి ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి గౌతమ్ గోవర్ధన్, యూనియన్ కార్యదర్శి తగరం నరేష్ లతో పాటు యూనియన్ కార్యవర్గ సభ్యులు బండారి సదానందన్ మాచర్ల అంజి. బోయిని రమేష్. వంశీ. కాదశి సదయ్య. శంకర్. యూనియన్ సభ్యులు అందరూ పాల్గొన్నారు.

## పసుపు సాగులో నూతన ఒరవడులను అవలంభించాలి

### జాతీయ పసుపు బోర్డు చైర్మన్ గంగారెడ్డి

**ప్రజాపక్షం/మల్లాపూర్ :**పసుపు పంట సాగులో నూతన ఒరవడులను అవలంభించి అధిక దిగుబడులను సాధించాలని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని కొత్త దామ రాజు పల్లి గ్రామంలోని రైతు వేదిక భవనంలో శ్రీ కొండా లక్ష్మ ణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పసుపు పంట సాగుపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చైర్మన్ గంగారెడ్డి మాట్లాడుతూ పసుపు రైతులు సేంద్రియ పద్ధతిలో పంటను సాగు చేసి నాణ్యమైన దిగుబడి పొందేలా పద్దతులు అవలంభించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన వన శాస్త్రవేత్త మహేందర్, శ్యాం ప్రసాద్, లావణ్య, క్లస్టర్ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** మధ్యాహ్న భోజన కార్మికులకు రావలసిన బకాయిలు, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మ ణ్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మీసం లక్ష్మ ణ్, రాములు మాట్లాడారు. కార్మికులకు 10000 కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా సిలిండర్లు ఇచ్చి గ్యాస్ పొయ్యిలు మర్చిపోయిందనీ వెంటనే గ్యాస్ పోయిలు ఇవ్వాలని గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వమే సప్లై చేయాలన్నారు. వంట సామాగ్రిని ప్రభుత్వం ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు చెప్పిన ప్రకారంగా సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సెప్టెంబర్ ఒకటో తారీకు నుండి నిరవధిక సమ్మెకు వెళ్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఐడెంటి కార్డులు ఇవ్వాలని ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 60 నెలలు నిండిన కార్మికులకు 9వేల పెన్షన్ చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో జుబేదా, రజిత, విజయ, లావణ్య, లక్ష్మీ, మైసమ్మ, సత్తవ్వ, రాజమణి,జ్యోతి, పాల్గొన్నారు.

## అల్ఫోర్స్‌లో ఉత్కంఠభరితంగా సిబిఎస్ఇ క్లస్టర్ 7టెన్నిస్ పోటీలు

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్‌లోని కొత్తపల్లి అల్ఫోర్స్ హైస్కూల్(సిబిఎస్ఇ) ప్రాంగణంలో క్లస్టర్ 7 టెన్నిస్ పోటీలు ఉత్కంఠభరితంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా టోర్నమెంట్‌ను ఉద్దేశించి అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ వివిధ పాఠశాలల నుంచి విచ్చేసిన క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి చాటుతూ క్రీడారంగానికి వన్నె తెస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో రెండో రోజులో బాగంగా నిర్వహించిన టీం ఈవెంట్లలో అండర్ 14 బాలికల విభాగంలో టీం ఈవెంట్‌లో విపిఎస్ పబ్లిక్ స్కూల్, టైం స్కూల్‌పై ఒక పాయింట్ తేడాతో గెలిచింది. అండర్ 17 విభాగంలో శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్ 30 పాయింట్లతో సిఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్‌పై గెలిచింది. అండర్ 19 విబాగంలో శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాల, సిఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్‌పై 0 3 పాయింట్ల తేడాతో గెలిచింది.

## ఫీవర్ కేసులకు తప్పనిసరిగా డెంగి వ్యాధి నిర్ధారణ పరీక్షలు

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పట్ల పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధుల నియంత్రణ పై ఎం.పి. ఓ., పంచాయతీ కార్యదర్శులు, ఏ.ఎన్.ఎం. లతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, డెంగ్యూ, మల్లేరియా, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, ఫీవర్ కేసులకు తప్పనిసరిగా డెంగ్యూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి బాధ్యతతో గ్రామంలో పిచ్చి మొక్కల తొలగింపు, నీటి నిల్వ ఉండకుండా చర్యలు, అధికంగా నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయడం వంటి చర్యల చేపట్టాలని అన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని హై రిస్క్ ఏరియాలను గుర్తించి అక్కడ డ్రై డే పకడ్బందీగా జరిగేలా చూడాలని అన్నారు. ప్రతి గ్రామంలో వారానికి రెండు సార్లు మంగళవారం, శుక్రవారం డ్రై డే కార్యక్రమం జరగాలని అన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, హెల్త్ సబ్ సెంటర్ పరిధిలో అవసరమైన మేర వ్యాధి నిర్ధారణ కిట్లు అందుబాటులో పెట్టాలని అన్నారు. ప్రతి పీ.హెచ్.సి పరిధి లో లక్ష్యాలు నిర్దేశించుకొని నిర్ధారణ పరీక్షలు చేయాలని అన్నారు. డెంగ్యూ కేసులను తక్కువ చేసి చూపించే అవసరం లేదని, మనం ఎన్ని డెంగ్యూ కేసులు గుర్తించి వారికి అవసరమైన చికిత్స అందిస్తే అంత బాగా పని చేసినట్లుగా పరిగణిస్తామని కలెక్టర్ తెలిపారు. డెంగ్యూ కేసులను రెగ్యులర్ గా ఫాలో అప్ చేయాలని, రక్త కణాలు ఎలా ఉంటున్నాయో పరిశీలించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా రజిత, సిరిసిల్ల, ఆసుపత్రుల సూపరింటెండెంట్ లు పెంచలయ్య, షరీఫ్దీన్, ఎంపిఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎం లు,అధికారులు, పాల్గొన్నారు.

## యాజమాన్యం అంగికరించి నడిమాండ్లపై సర్క్యులర్‌లు జారీ చేయండి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి లో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు సంఘం ఏఐటియుసితో యాజమాన్యం జరిపిన స్ట్రక్చర్ కమిటీ మరియు డైరెక్టర్ ఫా స్థాయి సమావేశాల్లో అంగీకరించిన డిమాండ్ల పై ఇంత వరకు అమలు కోసం సర్క్యులర్ లు యాజమాన్యం జారీ చేయలేదని, దీని వల్ల కార్మికులు సమస్యలు పరిష్కారం కాక అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సర్క్యులర్ లు జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సింగరేణి సి అండ్ ఎండి బలరాం నాయక్‌కు గుర్తింపు సంఘం ఏఐటియుసి అధ్యక్ష, కార్యదర్శులు గురువారం హైదరాబాద్ లోని సింగరేణి భవన్ లో వినతి పత్రం సమర్పించారు. సింగరేణి లో ప్రధానంగా మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్ మెన్ అనారోగ్యం తో అండర్ గ్రౌండ్ లో మెడికల్ అన్ఫిట్ ఐతే వారికి సర్ఫేస్లో సూటబుల్ జాబ్ ఇవ్వడానికి మరియు ఈపీ ఆపరేటర్లకు డి నుంచి సి, సి నుంచి బి కి ఖాళీలతో సంబంధం లేకుండా ప్రమోషన్ల ఇవ్వడానికి, మారుపేర్ల సమస్యను పరిష్కరించేందుకు నోట్ ఫైల్ రాష్ట్ర ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ దగ్గర ఉన్నందున యాజమాన్యం మారుపేర్ల సమస్య వెంటనే పరిష్కారం అయ్యేలాగా గవర్నమెంట్ తో పాటు అడ్వకేట్ జనరల్ ను సంప్రదించి కృషి చేయాలని వారు కోరారు. అనారోగ్యం తో బాధపడుతున్న వారికి మళ్లీ మెడికల్ బోర్డు పెట్టాలని వారు సి అండ్ ఎండి ని కోరారు.

# రీల్






కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'కె ర్యాంప్'. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్లపై రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్ గా నటిస్తోంది. 'కె ర్యాంప్' సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండగ సందర్భంగా అక్టోబర్ 18న గ్రాండ్ థియేటర్లలో రిలీజ్ కాబోతోంది.

## మలయాళ సంస్కృతి 'ఓనమ్' గొప్పతనాన్ని తెలిపే పాట

'కె ర్యాంప్' సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు. ఈ నెల 9వ తేదీన 'ఓనమ్' లిరికల్ సాంగ్ ను రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ పాట కోసం ఎనర్జిటిక్ ట్యూన్ కంపోజ్ చేశారు మ్యూజిక్ డైరెక్టర్ చేతన్ భరద్వాజ్. కేరళ పండుగ ఓనమ్ నేపథ్యంగా సాగే ఈ పాటను మలయాళ ట్రెడిషన్ చూపించేలా కలర్ ఫుల్ గా రూపొందించారు. కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా, నరేష్,సాయి కుమార్,వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్నారు.

## నిర్మాతల మధ్య విబేధాలు లేవు

### సి.కళ్యాణ్ వివరణ
### ఛాంబర్‌లో చిన్న నిర్మాతల భేటీ



తెలుగు సినిమా పరిశ్రమలో గత నాలుగు రోజులుగు కార్మికుల సమ్మె జరుగుతున్న నేపథ్యంలో రోజుకొక తరహాలో చర్చలు విఫలం అవుతూనే ఉన్నాయి. నిర్మతలు కొంత మంది చిరంజీవి దగ్గరికి వెళ్లి తమ సమస్యలు చెప్పుకోగా, మరికొంతమంది నిర్మాతలు బాలకృష్ణ దగ్గరికి వెళ్లి మొర పెట్టుకున్నారు. దీంతో నిర్మతల మధ్య సయోధ్య లేదు, నిర్మాతల మధ్య అభిప్రాయం బేధాలు వచ్చాయని ఫీల్ నగర్ లో చర్చ జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో సీనియర్ నిర్మాత సి కళ్యాణ్ మీడియా అడిగిన ఓ ప్రశాంకు సమాధానం చెబుతో వివరణ ఇచ్చారు. '' నిర్మాతల మధ్య ఎలాంటి అభిప్రాయబేధాలు లేవు. చిరంజీవిని కలిశాం. అలాగే బాలకృష్ణను కలిసాం. ఇద్దరికీ తమ సమస్యలు చెప్పాం. అగ్రహీరోల దృష్టికి కూడా నిర్మాతల సమస్యలు తీసుకువెళ్లాలని ఉద్దేశ్యంతోనే కలిశాం తప్ప ఇందులో భిప్రాయబేధాలు ఏమి లేవు'' మని పేర్కొన్నారు. చిన్న నిర్మాతల సమస్యలు కూడా చర్చించామని అన్నారు. చిన్న నిర్మాతలు థియేటర్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఏడాదికి 300 సినిమాలు విడుదల అయితే అందులో 200 సినిమాలు చిన్న నిర్మతలవే. చిన్న సినిమా లేకపోతే పరిశ్రమ లేదు, కార్మికులు లేరు. చిన్న సినిమాలకు 25 శాతం తగ్గుతామని గతంలో చెప్పారు కానీ ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. పెద్ద సినిమాల నిర్మాతలు ఇష్టమొచ్చినట్టు వేతనాలు పెంచేసి , పెంచిన వేతనాలను చిన్న సినిమా నిర్మాతలపై రుద్దవద్దని వేడుకుంటున్నామని కళ్యాణ్ , నట్టి కుమార్, చదలవాడ శ్రీనివాస్ రావు, ప్రతాని రామకృష్ణ గౌడ సాయి వెంకట్ ఫిలిం ఛాంబర్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ చెప్పారు. చిన్న సినిమా నిర్మించాలంటే తక్కువలో తక్కువ నాలుగు కోట్లు ఖర్చు అవుతోందని చెప్పారు. సమ్మెతో సంబంధం లేకుండా కార్మికులు చిన్న సినిమాలకు పని చేసుకోవచ్చని అన్నారు.. పని లేక అనేక మంది కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, అలనాటి వారికీ పని కల్పించాల్సిన బాధ్యత ఇండస్ట్రీపై ఉందని వారన్నారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నామని వారు తెలిపారు.

## ఫిల్మ్ ఛాంబర్‌లో కోఆర్డినేషన్ కమిటీ మీటింగ్

సినిమా కార్మికుల సమ్మె పంచాయతీ ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం వద్దకు చేరింది. సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు ఎఫ్ డీ సి చైర్మన్ దిల్ రాజు సారథ్యంలో ఫిలిం ఛాంబర్ కో ఆర్డినేషన్ కమిటీ భేటీ జరిగింది. ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ తో పాటు దర్శకుల సంఘం అధ్యక్షుడు వీర శంకర్ కూడా ఈ సమావేశానికి హాజరైయ్యారు. ఈ కో ఆరినేషన్ కమిటీకి వీర శంకర్ చైర్మన్ గా వ్యవహరిస్తున్నారు. పలువురు నిర్మాతల మండలి సభ్యులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. 30 శాతం వేతనాలు ఇవ్వాల్సిందేనని కార్మికుల పక్షాన ఫెడరేషన్ వాదన చేసినట్టు సమాచారం. 30 శాతం పెంపుకు నిర్మాతలు ససేమిరా అంగీకరించకపోవడంతో మధ్యస్థంగా 20శాతం మేర వేతనాలు పెంచే ప్రతిపాదన కూడా ఆలోచిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఒక పక్క ప్రభుత్వం, మరోపక్క చిరంజీవి, బాలకృష్ణ కూడా రంగంలో దిగిన నేపథ్యంలో త్వరలోనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని అందరూ భావిస్తున్నారు.

## అనుష్క ఘాటీ ట్రైలర్ రిలీజ్



అరుంధతి సినిమా తరువాత అంతటి ఫరెవర్ ఫుల్ లేడి ఓరియంటేడ్ లో అనుష్క నటిస్తున్న సినిమా 'ఘాటీ . క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ట్రైలర్ ను విడుదల చేశారు. ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లముడి ఈ చిత్రాన్ని భారీగా నిర్మిస్తున్నారు. యువి క్రియేషన్స్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.బ్రిటిష్ రాజ్ కాలంలో ప్రమాదకరమైన కనుమలలో చారిత్రాత్మకంగా రోడ్లు నిర్మించిన ఘాటి సమాజ ప్రపంచాన్ని పరిచయం చేసే పవర్ ఫుల్ వాయిస్ ఓవర్‌తో ట్రైలర్ ప్రారంభమవుతుంది. ఇప్పుడు, వారు కొండల్లో డ్రగ్స్ మోసే పనుల్లో చిక్కుకుపోయారు.ఈ కఠినమైన పరిస్థితులు చిక్కుకున్న ప్రేమికుల జంటగా అనుష్క శెట్టి, విక్రమ్ ప్రభు కనిపించారు. అనుష్క పాత్ర అవినీతి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతుంది. తప్పు చేస్తున్నామనే గ్రహించి, ఈ చెడు వ్యవస్థకి ఎదురు నిలవడానికి రెడీ అవుతుంది. తన వాళ్లని ఈ ప్రమాదకర వ్యాపారం నుంచి బయటకు లాగడానికి ప్రయత్నిస్తుంది.ట్రైలర్ లో అనుష్కను మునుపెప్పుడూ చూడని వైల్డ్ అవాతర్ లో కనిపించారు. ఒక బలహీన మహిళ నుంచి క్రిమినల్, అక్కడి నుంచి లెజెండ్‌గా మారే ఆమె పాత్ర ప్రేక్షకుల్ని కట్టిపడేసింది. ఆమె అద్భుతమైన పర్ఫార్మెన్స్‌తో పాత్రకి ప్రాణం పోస్తుంది. విక్రమ్ ప్రభు పర్ఫార్మెన్స్ స్ట్రాంగ్ గా వుంది . చైతన్య రావు, రవీంద్రన్ విజయ్ విలన్ పాత్రల్లో ఆకట్టుకున్నారు. జగపతి బాబు పాత్ర మరింత క్యురియాసిటీ పెంచింది. దర్శకుడు క్రిష్ జాగర్లముడి ఒక ప్రత్యేకమైన, బోల్డ్ కథను తెరపైకి తెచ్చారు. ఎమోషన్, యాక్షన్ తో కథ అద్భుతంగా నడిపించారు. సినిమాటోగ్రాఫర్ మనోజ్ రెడ్డి కటసాని తీసిన విజువల్స్ చూస్తే... ఆ ఘాట్లు మన ముందుకొచ్చినట్టు ఫీలింగ్ కలుగుతోంది. మ్యూజిక్ డైరెక్టర్ నాగవెల్లి విద్యాసాగర్ ఇచ్చిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ యాక్షన్ సీన్స్ ని ఎలివేట్ చేసింది.ఆర్ట్ డైరెక్టర్ తోట తరణి సెట్స్ వండర్ ఫుల్. సాయి, మాధవ్ బుర్రా రాసిన డైలాగులు అందరికీ కనెక్ట్ అవుతున్నాయి. ఎడిటర్స్ చాణక్య రెడ్డి తూరుపు, వెంకట్ ఎన్. స్వామి ఇంటెన్స్ అండ షార్ప్ గా కట్ చేశారు. యాక్షన్ మాస్టర్ రామ్ కృష్ణ ప్లాన్ చేసిన ఫైట్ సీన్స్ చాలా బాగా వచ్చాయని దర్శకుడు క్రిష్ చెప్పారు. అన్ని పనులు పూర్తి చేసుకుని ఈ సినిమాను సెప్టెంబర్ 5న థియేటర్స్ లో తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు.

'90s మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ మౌళి తనుజ్, 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' మూవీతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ శివానీ నాగరం లీడ్ రోల్స్ లో నటిస్తున్న మూవీ 'లిటిల్ హార్ట్స్'. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్ పై దర్శకుడు సాయి మార్తాండ రూపొందించారు. '90s మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ 'లిటిల్ హార్ట్స్' మూవీకి నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమా కంటెంట్ నచ్చి నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి సెప్టెంబర్ 12న గ్రాండ థియేట్రికల్ రిలీజ్ కు చేస్తున్నారు. . ఈ చిత్రం నుంచి రాజా గాడికి పాటను నిర్మాత బన్నీ వాసు లాంఛ్ చేశారు. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ బన్నీ వాస్ మాట్లాడుతూ 'లిటిల్ హార్ట్స్' సినిమాను మేము రిలీజ్ చేస్తే బాగుంటుంది అని మా దగ్గరకు వచ్చిన సాయి మార్తండ ఆదిత్యకు థ్యాంక్స్ చెబుతున్నా. వాళ్లు నా మీద నమ్మకం పెట్టుకున్నారు. ప్రేక్షకుల్ని బాగా నవ్వించే మూవీస్ చేయాలని నేను కోరుకుంటాను.సెప్టెంబర్ 12న థియేటర్స్ లో విడుదల చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి , హీరోయిన్ శివానీ నాగరం, డైరెక్టర్ సాయి మార్తండ హీరో మౌళి తనూజ్, ప్రొడ్యూసర్ ఆదిత్య హాసన్ , ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయికృష్ణ, ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ వంశీ నందిపాటి పాల్గొన్నారు.

### 'లిటిల్ హార్ట్స్ నుంచి 'రాజాగాడికి' సాంగ్ లాంఛ్



## మేఘం వర్షించదా' పాట ఆవిష్కరణ



విజయ రామరాజు టైటిల్ రోల్ పోషించిన స్పోర్ట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకత్వం వహించిన ఈ సినిమాని నిర్మాత శ్రీని గుబ్బల నిర్మించారు. ఇప్పటికే ఈ సినిమాకు 46 ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ వచ్చాయి. ఇటివలే రీలీజైన టీజర్ కు అద్భుతమైన స్పందన వచ్చింది. తాజాగా ఫస్ట్ సింగిల్ 'మేఘం వర్షించదా ' అనే పాటను రిలీజ్ చేశారు. విఘ్నేష్ బాస్కరన్ బ్యుటీఫుల్ లవ్ సాంగ్ గా కంపోజ్ చేశారు. విక్రాంత్ రుద్ర రాసిన సాహిత్యం మనసుని హత్తుకునేలా వుంది. కపిల్ కపిలన్, మీరా ప్రకాష్ , సుజిత్ శ్రీధర్ తమ మ్యాజికల్ వాయిస్ తో కట్టిపడేశారు. ఈ సాంగ్ లో విజయరామరాజు, సిజా రోజ్ కెమిస్ట్రీ లవ్లీగా వుంది. అద్భుతమైన స్పోర్ట్స్ డ్రామాతో పాటు హార్ట్ టచ్చింగ్ లవ్ స్టోరీతో అర్జున్ చక్రవర్తి అలరించబోతుందని ఈ సాంగ్ చూస్తే అర్థమవుతోంది. ఈ చిత్రంలో హర్ష్ రోషన్, అజయ్, అజయ్ ఘోష్, దయానంద్ రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు, ఈ చిత్రానికి జగదీష్ చీకాటి డీవోపీ, ప్రదీప్ నందన్ ఎడిటర్ , సుమిత్ పటేల్ ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్నారు. ఈ చిత్రం ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: ఈడే కృష్ణ చైతన్య వ్యవహరించారు. సంగీతం: విఘ్నేష్ బాస్కరన్ సంగీతం అందించారు.

## జన నేతకు ఘన వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)

అటు నుండి నేరుగా మణుగూరు సిపిఐ కార్యాలాయానికి తరలించిన విషయం విదితమే. ఆయన భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచి అక్కడి నుంచి రాత్రి 10గంటలకు అయోధ్య స్వగ్రామమైన రామానుజవరంకు తీసుకువచ్చారు. గురువారం అశృనయాల నడమ బరువెక్కిన గుండెలు, కన్నీటిధారల మధ్య అంత్యక్రియలు జరిగాయి.

**జనసంద్రమైన రామానుజవరం :** అయోధ్య స్వగ్రామమైన రామానుజవరం జనసంద్రమైంది. తన అభిమాన నాయకున్ని చివరి చూపు చూసేందుకు వేలాదిగా జనం తరలివచ్చారు. రాష్ట్రంతోపాటు జిల్లా నలు మూలల నుండే కాకుండా ఆయనకు సుపరిచితులుసైతం అయోధ్యను కడసారి చూసేందుకు బారులు తీరారు. ప్రధానంగా పినపాక నియోజవర్గవ్యాప్తంగా పల్లెలు అయోధ్యకు అంతిమ వీడ్కోలు తెలిపాయి. తాము ఇప్పుడు ఆయా గ్రామాల్లో ఉంటున్నామంటే సిపిఐ పోరాటాల ఫలితమే అని గుర్తు చేసుకుంటూ పార్థివ దేహాన్ని చూసి బోరున విలపించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య మృతదేహాన్ని చూసి సిపిఐ నేతలతో పాటు పలువురు కంటతడిపెట్టారు. ప్రధానంగా సిపిఐ నేతలు చాడా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు, సాబీర్ పాషాలు వారితో ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకుంటూ ఒక్క సారిగా భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. సిపిఐ నేత బొల్లోజు అయోధ్య అంతిమ యాత్ర వేలాది మందితో సాగింది. సుమారు నాలుగు కిలోమీటర్ల దారిపొడవునా జనం కన్నీటి నిరాజనాలు అర్పించారు. అంతిమయాత్రలో అయోధ్య చిత్రపటానికి యువత పాలాభిషేకం చేశారు. డప్పు వాయిద్యాలు, ఎర్రజెండాలు, విప్లవగీతాలు, జన జోహార్లతో అంతిమయాత్ర రహదారి మార్మోగింది. ఏటూరునాగారం, మణుగూరు ప్రధాన రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు 40 ఏళ్లపాటు అనేక నిర్భంధాలను ఎదుర్కొని, అనేక ఆటుపోట్ల నడుమ ఈ ప్రాంతంలో బలమైన ఉద్యమాన్ని నిర్మించిన సిపిఐ నిబద్ధత గల నేత బొల్లోజు అయోధ్య లేడని నిజాన్ని ఇక్కడి జనం నమ్మలేకుండా ఉన్నారు.

**పలువురి నివాళి:** భద్రాచలం ఎంఎల్ఎ డా.తెల్లం వెంకట్రావు, పినపాక మాజీ ఎంఎల్ఎ రేగా కాంతారావు, ఆంధ్రప్రదేశ్ సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మునీర్, సిపిఎం రాష్ట్ర నాయకులు అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, కాంగ్రెస్, బిఆర్ఎస్, టిడిపి, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, సిపిఐ అనుబంధ మహిళా సంఘం, ఏఐటియూసి అనుబంధ సంఘాలైన హామాలీ, బొగ్గుముఠా సంఘం, సింగరేణి లారీ యూనియన్ నాయకులు, గిరిజన సంఘాలతో పాటు పలువురు ఘన నివాళ్లర్పించారు.

## వేతనాలు పెంచాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)


మాట్లాడారు. తెలుగు సినిమా కార్మికులు తమకు వేతనాలు పెంచాలంటే ముంబాయి నుంచి సినీ కార్మికులను తీసుకువచ్చి పని చేయించుకుంటామని సినీ నిర్మాతలు బేదిరింపులకు పాల్పడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇక్కడి కార్మికులకు అన్యాయం చేయాలని చూస్తే సిపిఐ ప్రత్యేక్షంగా ఉద్యమంలో పాల్గొన్నడంతో పాటు ఎంత వరకైనా ముందుకెళ్తుందని హెచ్చరించారు. రాష్ట్రంలో తెలుగ సినిమా రంగంలో రాష్ట్రంలో కేవలం 10 కుటుంబాలు , థియేటర్లు 4 కుటుంబాల చేతుల్లో ఉన్నాయని వారే మొత్తం ఆడిస్తున్నారని ఆగ్రహాం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కేవలం సందేశాత్మక చిత్రాలకు మాత్రమే ప్రొత్సహాం అందించాలని డిమాండ్ చేశారు. వందల కోట్లతో సమాజాన్ని చెడు మార్గం పట్టించేలా తీస్తున్న చిత్రాలకు ఏలాంటి పరిస్థితుల్లో రాయితీలు ఇవ్వరాదని, టికెట్ల పెంపునకు అనుతులు ఇవ్వరాదని సూచించారు. పెద్ద పెద్ద నిర్మాతలు, హీరోలను పిలిచి మాట్లాడే ముఖ్యమంత్రి సినిమా కార్మికులను పిలిచి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.ప్రభుత్వానికి పక్షపాతం సరికాదని కార్మికులకు ఎలాంటి అన్యాయం జరగకూండా చూడాలని కోరారు.

**చిరంజీవి నైతికతకే వదలి వేస్తున్నా : నారాయణ**

గతంలో తాను సినీ నటుడు చిరంజీవిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను అప్పుడే ఉపసంహరించుకుని, అందుకు క్షమాపణ కూడా చెప్పానని, దీంతో ఆ అంశం ముగిసిపోయిందని, కానీ చిరంజీవి మళ్లీ ఆ ప్రస్తావనను తీసుకురావడం, ఆ వీడియోలను వైరల్ చేయడం సరికాదని నారాయణ అన్నారు. ఈ అంశాన్ని చిరంజీవి నైతికతకు, విజ్ఞతకే వదిలి వేస్తున్నాని నారాయణ పేర్కొన్నారు.

# వచ్చేవారం ట్రంప్-పుతిన్ ముఖాముఖీ!

### ఉక్రేన్ సమస్యపైనే ప్రధాన చర్చ



**మాస్కో:** రష్యా—అమెరికా దేశాధ్యక్షులు పుతిన్—ట్రంప్ మధ్య వచ్చేవారం ముఖాముఖీ సమావేశం జరిగే అవకాశం ఉంది. వీలైతే తాను వచ్చేవారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)లో ట్రంప్‌ను కలిసేవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్‌తో క్రెమ్లిన్‌లో గురువారం సమావేశం అనంతరం ట్రంప్‌తో సమావేశం గురించి పుతిన్ ప్రకటన చేశారు. ఐతే వైట్‌హౌస్ దీనిపై వెంటనే స్పందించలేదు.ఉక్రేన్‌లో మూడు సంవత్సరాలుగా జరుగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు ట్రంప్ ప్రభుత్వం పుతిన్‌పై తీవ్ర ఒత్తిడిచేస్తున్నది. కాల్పుల విరమణ ఒప్పందానికి విధించిన 10—12 రోజుల గడువు తేదీ ఆగస్టు 8వ తేదీ (శుక్రవారం)తో ముగుస్తున్న తరుణంలో పుతిన్ పాత్రికేయులకు ఈ విషయం చెప్పారు. పుతిన్ విదేశీ వ్యవహారాల సలహాదారుడు యూరీ ఉషకోవ్ మాస్కోలో అంతకుముందు మాట్లాడుతూ, పుతిన్—ట్రంప్ మధ్య శిఖరాగ్ర సదస్సు వీలైతే వచ్చేవారం జరుగుతుందని, వీరిద్దరి సమావేశ వేదికను సూత్రప్రాయంగా ఇంకా నిర్థారించాల్సి ఉందన్నారు. ఈ శిఖరాగ్ర సదస్సులో ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా పాల్గొనే అవకాశాలను ఆయన తోసిపుచ్చారు. ఉక్రేన్ విషయం చర్చించేందుకు విట్‌కాఫ్ మాస్కో వెళ్ళి బుధవారం మూడు గంటలపాటు పుతిన్‌తో సమావేశం జరిపారు. ఐతే ట్రంప్,జెలెన్‌స్కీ,పుతిన్ మధ్య త్రైపాక్షిక సమావేశం జరగాలని విట్‌కాఫ్ ప్రతిపాదించారు. ఈ విషయంలో తుది నిర్ణయం తమదేనని,త్రైపాక్షిక సమావేశానికి అవకాశమే లేదని యూరి ఉషకోవ్ అన్నారు. ట్రంప్‌తో సమావేశమయ్యేంకు పుతిన్ అంగీకరించారని చెప్పారు. స్టీవ్ విట్‌కాఫ్ ఇంతకు ముందు ఐదుసార్లు మాస్కోలో పర్యటించి పుతిన్‌తో, ఇతర ఉన్నతాధికారులతో చర్చలు జరిపినాగానీ ఎలాంటి ఫలితం రాలేదు. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో చర్చకు తాను సిద్ధంగా ఉన్నాననీ, కానీ అందుకు తగిన పరిస్థితులు ఇంకా ఏర్పడలేదని కూడా పుతిన్ చెప్పారు. జెలెన్‌స్కీతో చర్చలకు తాను ఎప్పుడూ వ్యతిరేకం కాదని చెప్పారు. చర్చలు జరపాలంటేత తగిన పరిస్థితులను సృష్టించాల్సిన అవసరం ఉందన్నారు. విచారకరమైన విషయం ఏమిటంటే, తమ మధ్య చర్చలు జరగడానికి ఇంకా చాలా సమయం ఉందని, అందుకుతగ్గ పరిస్థితులు ప్రస్తుతం లేవన్నారు. జెలెన్‌స్కీతో చర్చలపట్ల తనకు వ్యతిరేకత ఏమీ లేదని ఇప్పటికే తాను పలుసార్లు చెప్పానన్నారు. అదేవిధంగా క్రెమ్లిన్ వర్గాలు కూడా ఒక ప్రకటన చేస్తూ, ఒక స్పష్టమైన ఎజెండా లేకుండా రెండు దేశాల నాయకులమధ్యా ముఖాముఖీ సమావేశం సాధ్యంకాదని తెలిపింది. ఉక్రేన్‌కు నాటో, అమెరికా ఆయుధాలు సరఫరా చేయడాన్ని పుతిన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఒకవైపు ఆయుధాలు సరఫరా చేస్తూ మరోవైపు కాల్పుల విరమణ ఒప్పంద ప్రక్రియను, దౌత్య చర్యలను ముందుకు తీసుకురావడం హాస్యాస్పదమని రష్యన్ వర్గాలు ఇప్పటికే విమర్శించాయి. అంతర్జాతీయ జలాల్లో రష్యాకు సమీపంలో రెండు అణు జలాంతర్గాములను అమెరికా మోహరించడంతో ఈవారంలో రష్యా—అమెరికా మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. విట్‌కాఫ్ మాస్కో పర్యటన తర్వాత ఉద్రిక్తత కొంత తటస్థస్థాయికి చేరుకుంది.

**నిజమైన పరిష్కారం రావాలి:జెలెన్‌స్కీ**

ట్రంప్—పుతిన్ మధ్య ముఖాముఖీ సమావేశం త్వరలో జరుగుతుందని వచ్చిన వార్తలపట్ల ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ హర్షం ప్రకటించారు. ఎక్స్ వేదికగా గురువారంనాడు పోస్టింగ్ పెడుతూ, ఈ నాయకులిద్దరి సమావేశం ద్వారా ఉక్రేన్‌కు నిజమైన పరిష్కారం లభించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఐపిఎస్ హోదానా?

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం హోంమంత్రిత్వ శాఖలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డిఒపిటి) అనుమతి తప్పనిసరి. అయితే ప్రభాకర్‌రావు నియామకం విషయంలో ఇలాంటి అనుమతులు అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకోనట్లు సమాచారం. కనీసం ఆ మేరకు ప్రతిపాదనలు కూడా కేంద్రానికి పంపలేదని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రభాకర్‌రావు నియామకం విషయంలో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం తన ఇష్టానుసారంగా ఉత్తర్వులు జారీ చేసిందంటున్నారు. ప్రభాకర్‌రావును తిరిగి అదే పోస్టులో నియమించాలని నాటి హోం శాఖ కార్యదర్శి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సిఫార్సు చేయగా, ఆ సిఫార్సులపై అప్పటి సిఎం చంద్రశేఖర్‌రావు స్వయంగా సంతకం చేసినట్లు తెలిసింది. ఆ తరువాతనే ఎస్ఐబి ఐజిగా ప్రభాకరరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2001 బ్యాచ్‌కు చెందిన తెలంగాణ క్యాడర్ ఐపిఎస్ అధికారి ప్రభాకర్‌రావు 2020 జూన్ 30వ తేదీన పదవీ విరమణ చేశారు. అదే రోజు రాష్ట్ర ప్రభుత్వం ఆయనను తిరిగి అదే స్థానంలో నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఇలా రెండు సార్లు కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వడంతో ప్రభాకర్‌రావు 2023 డిసెంబర్ వరకు అదే పదవిలో ఉన్నారు. ఈ ఉత్తర్వులు ఇవ్వడం ద్వారా బిఆర్ఎస్ ప్రభుత్వం ఆల్ ఇండియా సర్వీస్ రూల్స్‌లోని 16(1), (5) నిబంధనలను ఉల్లంఘించిందని న్యాయ, ఐపిఎస్ వర్గాలు, కేంద్ర హోంశాఖ వర్గాలు అంటున్నాయి.

**కేసుల నమోదుకు సిట్ కసరత్తు:** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎ1 నిందితుడిగా ఉన్న మాజీ ఎస్ఐబి ఐజి, ఐపిఎస్ అధికారి టి.ప్రభాకర్‌రావు నియామకంపై సిట్ దర్యాప్తు అధికారులకు అనేక అనుమానాలు ఉన్నట్లు సమాచారం. పదవీ విరమణ చేసిన ప్రభాకర్‌రావుకు తిరిగి ఐపిఎస్ హోదా కల్పిస్తూ అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం జారీచేసిన జిఒ పూర్తిగా నేరపూరితమైన చర్యగా భావిస్తున్నారు. ప్రభాకర్‌రావును తిరిగి నియమించాలనే సిఫార్సులపై సంతకం పెట్టిన కెసిఆర్‌తో పాటు సిఫార్సు చేసిన అధికారులపై కేసులు నమోదు చేసేందుకు సిట్ అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని కోర్టుకు తెలియజేసిన తరువాత తదుపరి చర్యలకు అనుగుణంగా సిట్ అధికారులు నడుచుకునే అవకాశం ఉందని పోలీసు వర్గాల కథనం.

**ఐజి సంతకం దుర్వినియోగం:** ఫోన్ ట్యాపింగ్‌కు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలంటే టెలిగ్రాఫ్ చట్టం ప్రకారం ఐజి స్థాయి అధికారి సిఫార్సు చేయాల్సి ఉంటుంది. అయితే, ఎస్ఐబి ఐజిగా రిటైరైన తరువాత మళ్ళీ నియమితులైన ప్రభాకర్‌రావుకు కేంద్ర హోంశాఖ నిబంధనల ప్రకారం ఐపిఎస్ హోదా ఉండదు. అయినప్పటికీ ఫలానా నెంబర్లు ఫోన్ ట్యాపింగ్ చేయాలని ఐజి స్థాయిలో ప్రభాకర్‌రావు సంతకం చేసి, ఫోన్ ట్యాపింగ్ కమిటీకి సిఫార్సు చేసినట్లు తెలిసింది. ఇలా ప్రభాకర్‌రావు ఐజిగా సంతకం చేయడం కూడా సిట్ అధికారులు నేరంగా పరిగణిస్తున్నారు. నిజానికి ఆ అధికారాలు ప్రభాకర్‌రావుకు ఉండవని సిట్ భావిస్తున్నట్లు సమాచారం. ఐపిఎస్ అధికారి పదవీ విరమణ పొందితే మాజీ ఐపిఎస్ అధికారిగా, సామాన్య వ్యక్తిగా పరిగణిస్తారు. అలాంటిది ఐజిగా సంతకం ఎలా చేశారని సిట్ అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని కూడా కోర్టులో సవాల్ చేసే అవకాశాలు ఉన్నాయి.

**పెనం మీది నుంచి పొయ్యిలోకి:** ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్ సతమతమవుతుండగా ఎస్ఐబి ఐజిగా ప్రభాకర్‌రావును నియమిస్తూ జారీచేసిన జీఓ కెసిఆర్‌కు కొత్త తల నొప్పులను తీసుకువస్తోందని భావిస్తున్నారు. ఇప్పటికే బిఆర్ఎస్ నేతలు గొర్రెల స్కామ్, ఈకార్ రేస్, భూదాన్ భూముల స్కామ్, కాళేశ్వరం ప్రాజెక్ట్ స్కామ్, విద్యుత్ కొనుగోలు స్కామ్, ఫోన్ ట్యాపింగ్ తదితర కేసులలో తలలు పట్టుకుంటున్నారు. ఇదే సమయంలో ప్రభాకర్‌రావు నియామక జీఓ వెలుగు చూడడంతో బిఆర్ఎస్ అగ్ర నాయకుల పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలోకి నెట్టినట్లు అయ్యిందని రాజకీయ నాయకులు అంటున్నారు.

# వైరా మున్సిపాలిటీలో దారిమళ్లిన జనరల్ ఫండ్

### ఖమ్మం యాక్సెస్ బ్యాంకులో నగదు డ్రా చేసిన అకౌంటెంట్
### ప్రత్యేకాధికారికి తెలియకుండానే ఇతరుల ఖాతాలో నిధులు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** వైరా మున్సిపాలిటీలో జనరల్ ఫండ్ నిధులకు రెక్కలొచ్చాయి. ప్రజా ఉపయోగ పనులకు ఖర్చు చేయాల్సిన డబ్బు ప్రైవేటు వ్యక్తుల ఖాతాల్లో జమ అయింది. లక్షలాది రూపాయలు దారి మళ్లడంతో మున్సిపాలిటీ సిబ్బంది అవినీతి బాగోతం మరోసారి బయటపడింది. అదనపు కలెక్టర్ శ్రీజ వైరా మున్సిపాలిటీకి ప్రత్యేకాధికారిగా ఉండగా రూ.80లక్షల నిధులను దారి మళ్లించారంటే సిబ్బంది చేతివాటం ఏ స్థాయిలో ఉందో అవగతమవుతుంది. ఈ మొత్తం వ్యవహారం వెనక అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు మున్సిపల్ అకౌంటెంట్ ఉన్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. వివరాల్లోకి వెళితే... వైరా మున్సిపాలిటీకి రెండున్నర కోట్ల రూపాయలు జనరల్ ఫండ్ జమ అయింది. ఈ నిధుల నుండి అకౌంటెంట్‌గా విధులు నిర్వహించిన వ్యక్తి ఖాతాకు రూ.80లక్షలు దారి మళ్లించారు. అక్కడి నుంచి ఇతరుల ఖాతాల్లోకి కొంత సొమ్ము బదలాయించినట్లు సమాచారం. అకౌంటెంట్ ఖమ్మంలో ఉన్న యాక్సెస్ బ్యాంకు నుంచి వ్యక్తి గత చెక్ ద్వారా డబ్బులు డ్రా చేసినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. అతని వద్ద నుంచి నలుగురు అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఖాతాల్లోకి వెళ్లినట్లు తెలుస్తుంది. వైరా మున్సిపాలిటీలో నిధుల మళ్లింపు వ్యవహారంతో మున్సిపాలిటీలో జరుగుతున్న మరో అవినీతి బాగోతం బయటపడింది. మున్సిపాలిటీ అభివృద్ధికి వినియోగించాల్సిన నిధులను దారి మళ్లించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో వైరా పంచాయతీగా ఉన్నప్పుడు అనుమతుల పేరుతో కోట్ల రూపాయల అక్రమ వసూళ్లు జరిగాయి. మున్సిపాలిటీగా మారిన తర్వాత సైతం వైరాలో అవినీతి చీడ వదలడం లేదు. అభివృద్ధి పనులకు వినియోగించాల్సిన నిధులు వ్యక్తుల ఖాతాల్లోకి ఎలా దారి మళ్లాయన్న ప్రశ్నకు కమిషనర్ వద్ద సమాధానం లేదు. సిన్సియర్ అధికారిగా పేరు ఉన్న అదనపు కలెక్టర్ ప్రత్యేకాధికారిగా ఉన్న వైరా మున్సిపాలిటీలోనే నిధులు దారి మళ్లడం చర్చకు దారి తీస్తుంది. ప్రత్యేకాధికారికి ఏ మాత్రం అనుమానం రాని రీతిలో నిధుల దారి మళ్లింపు జరిగినట్లు తెలుస్తుంది. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరిపితే వీటితో పాటు వైరా మున్సిపాలిటీలో జరుగుతున్న మొత్తం అవినీతి గుట్టు రట్టవుతుంది.

## 10న బాల్‌బాడ్మింటన్ సెలక్షన్

**హైదరాబాద్:** హైదరాబాద్ బాల్ బాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో సెలక్షన్ ట్రయల్స్ జరగనున్నాయి. వనస్థలిపురం (ఎన్‌జిఒస్ కాలనీ)లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ గ్రౌండ్స్‌లో ఈనెల 10వ తేదీ, ఆదివారం ఉ: 8.30 గంటలకు ట్రయల్స్ ప్రారంభమవుతాయని అసోసియేషన్ అధ్యక్షుడు టి. మహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో విజేతలైన వారికి, ఈనెల 23, 24 తేదీల్లో, ఆదిలాబాద్ జిల్లా గోలేటిలో జరిగే అంతర్‌జిల్లా సీనియర్ బాల్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుందని ఆయన అన్నారు. ఈ సెలక్షన్ ట్రయల్స్‌ను ఔత్సాహిక బాల్ బాడ్మింటన్ క్రీడాకారులు వినియోగించుకోవాలని కోరారు. ఇతరత్రా వివరాలకు 9490682199 లేదా 9440344853 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com